ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాలు
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-5-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 108 పేజీలు: 12 వెల: 6.50

సిందూర్‌లో ఎన్ని విమానాలు నష్టపోయాం?: రాహుల్ 5లో

బెంగళూరును ముంచెత్తిన భారీ వర్షాలు

## ప్రభావశీల నేతల్లో ప్రధానిమోడీ@9







టాప్-జిన్‌పింగ్

పుతిన్-2

డొనాల్డ్ ట్రంప్-3

**న్యూఢిల్లీ, మే 19:** ప్రపంచదేశాలను బహుళ రంగాల్లో ప్రభావితంచేసే ప్రముఖులుగా పది మంది ప్రముఖులు నిలిచారు. వీరు రాజకీయం, పాలనారంగం, వాణిజ్యరంగాలకు చెంది నవారు కూడా లేక పోలేదు. భారత ప్రధాని నరేంద్ర మోడీకూడా తన బలమైన నాయకత్వం, సాహసోపేతమైన నిర్ణయాలతో ప్రపంచంలోని అత్యంతశక్తివంతమైన వ్యక్తుల జాబితాలోచేశారు. ఆయన మొదటిపది మందిలో తొమ్మిదో స్థానంలో నిలిచారు. >>2

## భారత్ ధర్మశాల కాదు..



### శరణార్థులు వెళ్లిపోవాలి: 'సుప్రీం'

**న్యూఢిల్లీ, మే 19:** భారతదేశం ధర్మశాల కాదని వివిధ దేశాల నుంచి వచ్చే శరణార్థులందరికీ ఆతిథ్యం ఇవ్వడం కుదరదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. శ్రీలంక తమిళ శరణార్థి దాఖలు చేసిన పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. శ్రీలంక తమిళ జాతీయుడి నిర్బంధంలో విషయంలో జోక్యం చేసుకోవడానికి సర్వోన్నత న్యాయస్థానం జస్టిస్ కే వినోద్ >>2


# 'సేవ'ల తీరుపై తనిఖీలు

### జూన్ 12 తర్వాత ఆకస్మిక తనిఖీలు చేస్తానన్న సిఎం చంద్రబాబు

### ప్రభుత్వసేవలపై ప్రజలకు పూర్తి సంతృప్తి లభించాలి

### దీపం లబ్ధిదారుల ఖాతాలో ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము

### ఆర్టీసిలో సౌకర్యాలు మెరుగుపడాలి: సిఎం



**విజయవాడ, మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు సక్రమంగా అందుతున్నది లేనీ పరిశీలించేందు జూన్ 12 తరువాత ఎప్పుడైనా రాష్ట్రంలో ఆకస్మిక తనిఖీలు మొదలు పెడతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, వివిధ ప్రభుత్వ సేవలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. ప్రతివారం నాలుగు శాఖల పరిధిలో పథకాలు, సేవలపై ప్రజలనుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు ఈ వారం రేషన్, దీపం, ఎపిఎస్ఆర్టీసీ, పంచా యతీ సేవలపై వెల్లడైన ప్రజాభిప్రాయాలను పరిశీలించారు. ఈ శాఖల పరిధిలో అమలు అవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల నుంచి ఐవిఆర్ఎస్, క్యూ ఆర్ కోడ్ వంటి విధానాల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ అభిప్రాయాలపై సిఎస్, సిఎంవో సెక్రటరీలతో ముఖ్యమంత్రి చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తుందని అన్ని శాఖల్లో ప్రభుత్వ పనితీరు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయి సంతృప్తి కనిపించాలని సిఎం అన్నారు. కొన్ని శాఖల్లో మార్పు వచ్చిందని అయితే ఆర్టీసీ వంటి చోట్ల ఇంకా సేవల్లో నాణ్యత పెరగాల్సి ఉందని సిఎం అన్నారు. దీపం 2 పథకం ద్వారా లబ్దిదారులకు ఏడాదికి ఇచ్చే 3 సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్దిదారుల ఖాతాలో జమ చేస్తామని సిఎం అన్నారు. లబ్దిదారులు తమకు కావాల్సినప్పుడు దీపం పథకం కింద సిలిండర్ పొందవచ్చు... అయితే వారికి మూడు సిలిండర్లకు ఇచ్చే మొత్తాన్ని ప్రభుత్వం ముందుగానే చెల్లిస్తుంది. దీపం పథకం లబ్దిదారుల నుంచి ఏజెన్సీ వాళ్లు కానీ, ఇతర స్థాయిల్లో గాని ఎక్కడా డబ్బులు అదనంగా వసూలు చేసే పరిస్థితి ఉండకూడదన్నారు.

**రేషన్ సరుకుల పంపిణీపై అభిప్రాయాలు**

మీరు ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా అని ప్రశ్నించగా 74 శాతం మంది అవునని, వాటి నాణ్యతపై ఎలా ఉంది అంటే బాగుందని 76 శాతం మంది చెప్పారు. రేషన్ పంపిణీలో, నాణ్యతపై ప్రజల సంతృప్తిలో >>2



## బడి తెరిచిన రోజే పిల్లలకు పుస్తకాలు

### 'సంచి' బరువు తగ్గేందుకు సెమిస్టర్ విధానం

**విజయవాడ,మే 19,ప్రభాతవార్త ప్రతినిధి:** పాఠశాలలు పునఃప్రారంభమైన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో పుస్తకాల ముద్రణ, సరఫరాను వేగవంతం చేసింది. ప్రభుత్వ,ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ఏటా ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తోంది. వీటిని రెండు సెమిస్టర్లుగా ముద్రిస్తున్నారు. అన్ని పాఠశాలలకు కలిపి సెమిస్టర్-1కు 1.64 కోట్ల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా,ఇప్పటికే 1.24కోట్ల వరకు జిల్లా కేంద్రంలోని గోదాములకు చేరాయి. అక్కడి నుండి 1.22 కోట్ల పుస్తకాలను మండల కేంద్రాలకు చేర్చారు. ముద్రణ కేంద్రాల నుండి జిల్లాలకు,అక్కడి నుండి మండలాలకు సరఫరా కొనసాగుతోంది. ఈ ఏడాది పాఠ్యపుస్తకాల బరువు తగ్గించేందుకు సెమిస్టర్ విధానం అమలు చేసి, రెండు పుస్తకాలను కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు.ఒకటి రెండో తరగతుల్లో తెలుగు, ఆంగ్లం, గణితం, సబ్జెక్టుకు కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు. ఇలాగే వర్క్‌బుక్‌లను కలిపి మరోటి తీసుకొచ్చారు.వీరికి రెండు పుస్తకాలు మాత్రమే ఉంటాయి. 3,4,5 >>2

## 'మన మిత్ర' మరింతగా ప్రజల్లోకి

### ప్రజలకు అన్ని సేవలు వాట్సప్ గవర్నెన్స్‌లోనే అందించాలి

### ఆర్టీజిఎస్‌లో డేటా అనుసంధానం త్వరగా జరగాలి

### అధికారులకు సిఎస్ ఆదేశాలు



ఆర్టీజీఎస్ కార్యకలాపాలపైన అధికారులతో సమీక్షిస్తున్న సిఎస్ విజయానంద్

**విజయవాడ,మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లి, ప్రభుత్వ సేవలన్నీ వారు మనమిత్రలో పొందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఆయన సోమవారం ఆర్టీజీఎస్ కార్యకలాపాలపైన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ సేవల ప్రగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జూన్ 12వ తేదీలోపు మనమిత్ర ద్వారా ప్రజలకు 500 రకాల సేవలు ఇచ్చేలా అధికారులు పనిచేయాలన్నారు. ప్రజలు ఎవ్వరూ కూడా తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగనవసం లేకుండా అన్ని సేవలు మనమిత్ర ద్వారా పొందేలా చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. ఆ దిశగా మనమిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో సచివాలయ సిబ్బంది కీలక పాత్ర పోషించాలన్నారు. ఆర్టీజీఎస్‌లో డేటా అనుసంధాన ప్రక్రియ కూడా లక్ష్యాల మేరకు పూర్తయ్యేలా చూడాలన్నారు. డేటా అనుసంధానంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేలా ఆర్టీజీఎస్ సాంకేతిక సహకారాన్ని ఆయా శాఖలకు అందించడానికి వీలవుతుందన్నారు. పంచాయతీరాజ్ విభాగాధికారులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, చెత్తతొలగింపు పనుల్లో కొంత పురోగతి కనించిందని, అయితే పారిశుధ్య మరింత మెరుగుపడాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా కనిపించేలా చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఆర్టీసీ సేవల్లో కూడా మరింత ప్రగతి సాధించాలని సూచించారు. డ్రోన్ మార్ట్ వెబ్ పోర్టల్‌ను ముఖ్యమంత్రి చేతులమీదు ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పోర్టల్‌ను రూపొందిం చాలని సూచించారు. ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రఖర్ జైన్ మాట్లాడుతూ ప్రస్తుతం వాట్సాప్‌గవర్నెన్స్ ద్వారా 325 సేవలను ప్రజలకు అందిస్తున్నామని, ఈ నెలా ఖరుకు 400 సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వ ఆశయంప్రకారం జూన్ 12వ తేదీకల్లా 500 సేవలు అందిస్తామన్నారు. వాట్సాప్ ద్వారా ప్రజలు డౌన్‌లోడు చేసుకునే ధృవపత్రాల తనిఖీ కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీని సమర్థంగా ఉప యోగిస్తున్నామన్నారు. ఏపీసేవలో 14,269 ధృవీకరణ పత్రాలకు, మీ సేవలో 1240 ధృవీకరణ పత్రాలకు బ్లాక్ చైన్‌టెక్నాలజీ అమలు చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో పాత సర్టిఫికెట్లను కూడా బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా ధృవీకరించడం జరుగుతుందన్నారు. డేటాలేక్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్, డైరెక్టర్ కృష్ణతేజ్, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు, పౌరసరఫరాలశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిని కలుపుతూ విజయవాడ-గుంటూరు-తెనాలి సెమీ హైస్పీడ్ రైలు

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్ ప్రాజెక్టు కింద అమలు

**గుంతకల్లు రైల్వే,మే 19,ప్రభాతవార్త:** రాష్ట్ర నవ్యాంధ్ర రాజధాని అమరావతిని కలుపుతు వేర్వేరుగా రెండు ప్రతిపాదిత మార్గాల మీదుగా సెమీ హైస్పీడ్ సర్క్యులర్ సబర్బన్ రైలు సేవలను అందుబాటులో తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈసబర్బన్ రైలు విధానం-2017 చేపట్టేందుకు రైల్వే మంత్రిత్వశాఖ సూత్రప్రాయంగా ఆమోదించినట్లు రైల్వే వర్గాలు చెబుతున్నాయి.భారతీయ రైల్వేలో నిత్యం రద్దీగా ఉండే హౌరా-చెన్నై ఈస్ట్‌కోస్ట్ కారిడార్‌లో రైళ్ల రద్దీ,ట్రాఫిక్ కారణంగా స్థానిక ప్రజల సౌకర్యార్థం పాసింజర్ రైలు సర్వీసులను నడపడం సాధ్యం కాని పరిస్థితి. నవ్యాంధ్ర రాజధాని అమరావతికి సెమీ హైస్పీడ్ రైలుసర్వీసు వ్యవస్థ భవిష్యత్తు అవసరాలకు ఎంతో అవసరమైంది. రాబోయే భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విజయవాడ-నంబూరు-అమరావతి-గుంటూరు-తెనాలి- విజయవాడ మధ్య సెమీ హైస్పీడ్ సర్క్యులర్ సబర్బన్ రైలు సర్వీసుల ఏర్పాటు ఎంతో అవసరం. ఈ ప్రాజెక్టు యొక్క ప్రాధాన్యతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వి-జీ-టీ ప్రాంతంలో ట్రాఫిక్ సదుపాయాలను కల్పించేందుకు సబర్బన్ రైలు సేవలకై ప్రత్యేకంగా ఒక అలైన్మెంట్‌ను రూపొందించి, ఫిజిబిలిటీ,స్టడీ వివరాలతో కూడిన సమగ్రమైన ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్)ను రూపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిఎంఆర్‌సి), మెస్సర్స్ అర్బన్ మాస్ ట్రాన్సిట్ కంపెనీ(యుఎంటిసి)ని నియమించింది. ఈ సంస్థలు ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపిసిఆర్‌డిఏ) పరిధిలో వచ్చే విజయవాడ, గుంటూరు, క్రిష్ణ కెనాల్, దుగ్గిరాల, తెనాలి, వెజెండ్ల, మంగళగిరి, సత్తెనపల్లి, నూజివీడు, గుడివాడ, గన్నవరం వంటి >>2

## వల్లభనేని బెయిలు పిటిషన్‌పై విచారణ వాయిదా 2లో

## ఆ నలుగురిని కస్టడీకి ఇవ్వండి

### కోర్టును కోరిన సిట్

### లిక్కర్ స్కామ్‌లో కీలక పరిణామం

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో(లిక్కరుస్కామ్) కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితులు నలుగురిని కస్టడీకి ఇవ్వాలని విజయవాడ కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డి, ఈ కేసులో ఏ1గా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్‌గా ఉన్న బాలాజీ గోవిందప్పలను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోరారు. వీరు నలుగురిని కలిపి విచారించాల్సిన అవసరం ఉందని సిట్ బృందం పేర్కొంది. మద్యం ముడుపులు, కమిషన్ వ్యవహారంలో ఈ నలుగురికి తెలిసి కొన్ని విషయాలు జరిగాయని, అందువల్లే నలుగురిని కలిపి విచారించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అప్పుడు మాత్రమే ఈ కేసుకు తదనంతర దర్యాప్తునకు అవకాశం ఉంటుందని తెలిపింది.సిట్ పిటీషన్‌పై మంగళవారం విచారణ జరిగే అవకాశం ఉంది. మరో వైపు రాజ్‌కసిరెడ్డి వాంగ్మూలం రికార్డుచేసేందుకు అనుమతి ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విజయవాడకోర్టులో మూడురోజుల క్రితం పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌పై విచారణకు రాగా కసిరెడ్డి వాంగ్మూలం రికార్డు చేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలని ఈడీ తరపున న్యాయవాదులుకోరారు. విచారణను ఏసీబీ కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. ఇదేసమయంలో నలుగురుకీలక నిందితులకస్టడీ పిటిషన్‌పై కోర్టురేపుఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఆసక్తికరంగా మారింది.

## నాలుగు రోజులు భారీ వర్ష సూచన

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో తీవ్ర ఉష్ణోగ్రతల నడుమ మోస్తరు నుంచి వర్షాలు కురుస్తున్నాయి, ఈ అనిశ్చిత నడుమ సాధారణ అంచనాల కంటే ముందుగా నైరుతి రుతుపవనాలు ఈ నెల 24 నాటికే కేరళను తాకే అవకాశాలున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణ పరిస్దితులకు భిన్నంగా జూన్ 1కంటే ముందుగా ఈ నెల 27 నాటికి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉందని వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది. పరిస్థితులు అనుకూలంగా మారడంతో వాటి గమనం వేగంగా ఉందని, ఇవే పరిస్థితులు కొనసాగితే ఈ నెల 26 నాటికి రాయలసీమ, ఈ నెల 29 నాటికి కోస్తాంధ్రలోకి ప్రవేశిస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. 2013లో కేవలం 14 రోజుల్లోనే రుతుపవనాలు దేశమంతటా విస్తరించాయని, ఈ ఏడాది అంతకంటే వేగంగా కదులుతాయని వాతావరణ విభాగం తెలుపుతుంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు అండమాన్, నికోబార్ దీవులకు పూర్తిగా విస్తరించాయి. సాధారణం కంటే ఐదు రోజులు ముందుగానే ఈ ప్రక్రియ పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో నెలాఖరు నాటికి వేసవి దాదాపుగా ముగిసినట్లేనని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని >>2

## కారులో ఊపిరాడక నలుగురు చిన్నారులు మృతి

### విజయనగరంలో విషాదం

**విజయనగరం, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి :** విజయనగరం మండలం పరిధిలోని ద్వారపూడి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. కారు లాక్ పడటంలో అందులో చిక్కుకున్న నలుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నలుగురు చిన్నారులు ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. కానీ వాళ్ళు ఎంతసేపైనా తిరిగి రాలేదు. వాళ్ళ తల్లిదండ్రులు వెతికినా కనిపించలేదు. చివరికి స్థానిక మహిళా మండలి కార్యాలయం వద్ద ఆగి ఉన్న కారులో నలుగురు చిన్నారుల మృతదేహాలను అక్కడున్నవారు గుర్తించారు. సరదాగా ఆడుకునేందుకు కారు లోపలికి వెళ్లిన తర్వాత డోర్ లాక్ పడటంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు సమాచారం. మృతులను ఉదయ్ (8), చారుమతి (8), చరిష్మా (6), మనస్విగా గుర్తించారు. వీరిలో చారుమతి, చరిష్మా అక్కాచెల్లెళ్లు. ఒకేసారి నలుగురు పిల్లలు కన్నుమూయడంతో ద్వారపూడిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల మృతదేహాలను పట్టుకుని తల్లిదండ్రులు, బంధువులు రోదించడం ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేస్తోంది.

### నీటిగుంతలో పడి ముగ్గురు చిన్నారులు మృతి

కుప్పం మండలం దేవరాజపురంలో ఘటన 2లో


## హజ్‌యాత్రకు భారీ ఏర్పాట్లు

### మొత్తం 1630 మంది యాత్రికులు ఎపి నుంచి పయనం: మంత్రి ఎన్ఎండి ఫరూక్

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ నుండి హజ్ యాత్ర 2025 కు బయలుదేరే యాత్రికులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అత్యంత పగడ్బందీగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఎంబార్కేషన్ సెంటర్ నుంచి రెండవ విడతలో 906 మంది ఏపీ ప్రయాణికులు సోమ, మంగళవారాల్లో మూడు విమానాలలో హజ్ యాత్రకు జెడ్డాకు వెళ్తున్నారు. హైదరాబాదులోని లకడికపూల్ సెంటర్లో ఉన్న షా ఫంక్షన్ ప్లాజాలో ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమాన్ని మైనారిటీ మంత్రిత్వ శాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండవ విడత యాత్రకు బయలుదేరి వెళ్లే యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, మైనారిటీ మంత్రిత్వ శాఖ సలహాదారుడు ఎంఏ షరీఫ్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష,హజ్ కమిటీ సభ్యులు, తదితరులు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రస్తుత ఏడాది పవిత్ర హజ్ యాత్రకు మొత్తం 1630 మంది యాత్రికులు వెళ్లడం జరుగుతున్నదని అన్నారు. ఇందులో 1170 మంది హైదరాబాద్ ఎం బార్కెషన్ కేంద్రం నుంచి, 451 మంది బెం గళూరు ఎంబార్కెషన్ కేంద్రం నుంచి, మిగిలిన 9 మంది ఇతర ఎంబార్కెషన్ కేంద్రాల నుంచి బయలుదేరడం జరుగుతున్నదని వెల్లడించారు. >>2



హజ్ యాత్రను ప్రారంభిస్తున్న మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్




భవిష్యత్తులో ప్రజల అవసరాల మేరకు రాష్ట్ర రాజధాని అమరావతిని కలుపుతూ రెండు వేర్వేరు ప్రతిపాదిత మార్గాలు.

# సెమీ హైస్పీడ్ రైలు

>> పరిసర ప్రాంతాలతో పాటు చిలువూరు, దుగ్గిరాల, కొలకలూరు, తెనాలి,సంగం, పాతగుంటూరు, గుంటూరు, కొరిటెపాడు, హిందూ కళాశాల హాస్టల్, గుంటూరు సిటీ, ఎంజి ఇన్నర్ రింగ్ రోడ్డు,ఆటో నగర్, నంబూరు, కాజా, తాడికొండ, పెద్దపరిమి రిజర్వాయర్‌ల మీదుగా సెమీ హైస్పీడ్ సర్క్యులర్ సబర్బన్ రైలు సర్వీసులను నడిపేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

# భారీ వర్ష సూచన

>> కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేస్తోంది. తూర్పు మధ్య అరేబియా సముద్రంలో కర్ణాటక తీరంలో బుధవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. ఇది గురువారం నాటికి అల్పపీడనంగా, తర్వాత మరింత బలపడుతుందని అంచనా. దీని ప్రభావంతో రుతుపవనాలు మరింత వేగంగా ముందుకు కదిలే అవకాశాలున్నాయని వివరిస్తుంది. ఈ క్రమంలోనే రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం ముందుగా తెలిపినట్లే సోమవారం. చాలా చోట్ల చెదురుమదురుగా భారీ వర్షాలు నమోదయ్యే అయ్యాయి. కొన్నిచోట్ల ఎండ తీవ్రత అధికంగా నమోదు అయ్యే సూచనలు ఉన్నాయంది. ప్రకాశం, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లో ఉరుములు పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది.

ఇకప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో తెల్లవారుజాము నుంచి ఉరుములు మెరుపులతో వర్షం బీభత్సం సృష్టించింది. నగరంతో పాటు కొత్తపట్నం మండలం మోతిమాల, పాదర్తి, రంగయ్యపాలెం, ఆలూరు, అల్లూరు, ఈతముక్కల, రాజుపాలెం ఆయా గ్రామాల్లో జోరు వాన కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. నగరంతో పాటు కొత్తపట్నం గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వర్షం దెబ్బకి ఆయా కాలనీల్లో ఆటోలు వెళ్లలేకపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద పెద్ద సంఖ్యలో వాన నీరు నిలిచిపోయింది. పంటలు వేసుకునే సమయంలో ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం పంటలకు ఎంతో మేలు కలిగిస్తుందని వారు భావిస్తున్నారు.ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపాలిటీలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లా పరిషత్ పాఠశాల,మండల అభివృద్ధి కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలు నీట మునిగాయి.ఈ వాన పునాస పంటకు కొంత మేరకు ఇబ్బందికరంగానే ఉందని రైతులు వాపోతున్నారు.

# హజ్‌యాత్రకు భారీ ఏర్పాట్లు

>> ఈనెల 19,20వ తేదీలు సోమ,మంగళ వారాలలో మూడు విమానాల్లో మొత్తం 818 మంది హజ్ యాత్రికులు హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రం నుండి హజ్‌కు వెళ్తున్నట్లు తెలిపారు.మరో 88 మంది యాత్రికులు ఈనెల 27 వ తేదీ చివరి విమానంలో హజ్ యాత్రకు వెళ్తున్నట్లు తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ నుంచి కేవలం 72 మంది యాత్రికులు మాత్రమే తమ ఆప్షన్ ఇవ్వడం కారణంగా, సాంకేతిక కారణాల వలన, భారత విమానయాన శాఖ ద్వారా స్పెషల్ చార్టర్ ఫ్లైట్ వసతి కల్పించలేని పరిస్థితితులలో, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా, ముంబై ఆ 72మంది యాత్రికులను హైదరాబాద్ ఎంబార్కేషన్ నుండి బయలుదేరుటకు అనుమతించడం జరిగిందని పేర్కొన్నారు. గత నెలలో మొదటి విడతలో హజ్ యాత్రకు ఏపీ నుంచి 724మంది యాత్రికులు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాల నుండి పవిత్ర మక్కా, మదీనా పుణ్యక్షేత్రాలకు వెళ్లడం జరిగిందని తెలిపారు. ఏపీ హజ్ యాత్రికులకు సంబందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఏలాంటి లోటు పాట్లు లేకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందని మంత్రి ఫరూక్ వెల్లడించారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, వ్యాక్సినేషన్ క్యాంపులు నిర్వహించడమైనదని, కర్ణాటక,తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు, ఆయా రాష్ట్రాల హజ్ కమిటీల తో, ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశాలు కూడా నిర్వహించి ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు. పూర్తి సహకారాన్ని అందిస్తున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలకు మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు. మన రాష్ట్రం నుండే నేరుగా హజ్ కి వెళ్ళేందుకు ఏర్పాట్లు ఉంటే మరింత సౌలభ్యంగా ఉంటుందని ఒక యాత్రికురాలు కోరగా, విజయవాడ ఎంబార్కేషన్ కోరే ప్రతి హజ్ యాత్రికుడికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని మంత్రి తెలిపారు. మైనారిటీ మంత్రిత్వ శాఖ ప్రభుత్వ సలహాదారుడు ఏంఏ షరీఫ్ మాట్లాడుతూ హజ్ యాత్రికులను సాగనంపే ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. హజ్ యాత్ర ఆధ్యాత్మిక ప్రయాణం మాత్రమే కాదని,సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వాన్ని పెంపొందించే ముఖ్య సందేశమని పేర్కొన్నారు. హజ్ యాత్ర విజయవంతంగా సాగేలా అదికారులు, సిబ్బంది సహకారం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ ఈవో గౌస్ పీర్, రెండు తెలుగు రాష్ట్రాల మైనార్టీ మంత్రిత్వ శాఖలు, హజ్ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వల్లభనేని బెయిలు పిటిషన్‌పై విచారణ వాయిదా

## కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు ఆదేశాలు

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** గన్నవరం మాజీ ఎంఎల్ఏ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత వల్లభనేని వంశీ మోహన్‌కు కొన్ని కేసుల్లో బెయిలు,ముందస్తు బెయిల్ వచ్చినా. ఇంకా జైలులోనే మగ్గాల్సిన పరిస్థితి వచ్చింది.

అయితే,నకిలీ పట్టాల పంపిణీ కేసు వ్యవహారంలో వంశీ బెయిలు పిటీషన్‌పై నేడు ఏలూరు జిల్లా నూజివీడు కోర్టులో విచారణ జరిగింది. నకిలీ పట్టాల పంపిణీ కేసులో తనకు బెయిల్ ఇవ్వా లంటూ వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. నూజివీడు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు...ఆ తర్వాత వల్లభనేని వంశీ మోహన్ బెయిల్ పిటీషన్‌పై విచారణను రేపటికి వాయిదా వేసింది. కోర్టు కాగా ప్రస్తుతం గన్నవరం నియోజక వర్గంలో నకిలీ పట్టాల పంపిణీ వ్యవహారంలో విజయవాడ సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

వల్లభనేని వంశీ మోహన్ ఆయన్ని మొ దట అరెస్ట్ చేసిన కిడ్నాప్ కేసు,ఆ తర్వాత గన్నవరం టిడిపీ కార్యాలయంపై దాడి కేసు ఇలా అన్నికేసుల్లో బెయిల్,ముందస్తు బెయిలు వచ్చినా ఇప్పుడు నకిలీపట్టాల పంపిణీ కేసుల్లో వల్లభనేని వంశీమోహన్ రిమాండ్ ఖైదీగా ఉన్నారు .

# టెన్త్ పాసైతే 'మెయిన్' అంగన్‌వాడీలుగా మార్పు!

**విజయవాడ,మే 19,ప్రభాతవార్త ప్రతినిధి:** మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలనే ప్రధాన డిమాండ్ అమలు దిశగా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మంగళవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు తప్పనిసరిగటా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన ఉంది. ఇందుకనుగుణంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే పని చేస్తున్న వారిలో పది పాస్ అయిన వారిని తొలిగా ఉన్నతీకరించి ఆ కేంద్రాలకు మెయిన్ హోదా ఇవ్వాలని అధికారులు ప్రతిపాదించారు. వీరు రాష్ట్రవ్యాప్తంగా 4,600 మంది వరకు ఉన్నారని లెక్కతేల్చారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తగా మారిస్తే రూ.11,500 లభిస్తుంది. అంటే ఒక్కొక్కరికి నెలకు రూ.4,500ల చొప్పున వేతనం పెరుగుతుంది. తద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.25 కోట్ల అదనపు భారం పడుతుంది.మిగిలిన వారు పది ఉత్తీర్ణత సాధించేందుకు గడువు ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 55,700 అంగన్‌వాడీ కేంద్రాలుండగా,వాటిలో 6,837 మినీ అంగన్‌వాడత కేంద్రాలున్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వ సేవలందించేందుకు గాను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త,ఆయా ఉంటారు.మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కేవలం కార్యకర్త మాత్రమే ఉంటారు.మినీ అంగన్‌వాడీల్లో 200 వరకు ఖాళీలున్నాయి. 4,600 మినీ కేంద్రాల్లో పనిచేస్తున్న వారు పది ఉత్తీర్ణులయ్యారు. మిగతా చోట్ల విధులు నిర్వహిస్తున్న వారికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించేందుకు ఏడాది/రెండేళ్ళ గడువు ఇచ్చి ఆ లోపు అర్హత సాధించిన వారిని ఉన్నతీకరించాలని ప్రతిపాదించారు.మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 300 చోట్ల 5 మంది కంటే తక్కువ లబ్ధిదారులున్నారని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీటిలో గిరిజన ప్రాంతాలు,ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో ఉన్నవి మినహాయించి మిగిలినవి హేతుబద్ధీకరించాలని ప్రతిపాదించారు. కనీస లబ్ధిదారులు కూడ లేని చోట క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి అందరికీ ఆమోదయోగ్యమైన తర్వాతే హేతుబద్ధీకరించాలని సూచించారు. దీనిపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుంది.

# 'తులాభారం'కానుకలు 'గోవిందా'!

## ఐదేళ్లలో భారీ స్కామ్ జరిగిందంటూ సంచలనం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** వేంకటేశ్వరస్వామికి భక్తులు కోరికలు తీరిన వెంటనే ప్రియంగా చెల్లించే మొక్కుల కానుకలు పక్కదారిపట్టాయంటూ తిరుమల తిరుపతి దేవస్థానంలో సంచలనంగా మారింది. చిన్నపిల్లల నుండి వయోవృద్దుల వరకు భక్తులు కోరికలు నెరవేరిన వెంటనే తులాభారం త్రాసులో ఓ వైపు భక్తుడు, మరోవైపు నాణేలు, చక్కెర, బెల్లం, కలకండ,డ్రైఫ్రూట్స్,బియ్యం ఇలా ఏదైనా వారి బరువుకు తగ్గట్లు మొక్కుబడులుగా వేస్తారు. అంతే బరువుకు సరిపడే నగదును టిటిడికి అందిస్తారు. ఇక్కడ రెండు, ఐదురూపాయలు నాణేలు ఉంచి బరువు తూకం వేస్తారు. భక్తుడు ఎంత బరువుంటే అంత సొమ్ము నగదు రూపంలో అక్కడ సిబ్బందికి అప్పగించి మొక్కులు తీర్చుకోవడం పరిపాటి. ఈ చెల్లించిన నగదు గత ఐదేళ్లలో సగంవరకు వెంకన్న ఖజానాకు చేరలేదనేది ఇప్పుడు గుప్పుమంటున్న ఆరోపణలు. ఇలా రోజుకు ఐదులక్షల నుండి 10లక్షల రూపాయల వరకు తులాభారంకానుకలు అందుతాయనేది టిటిడి వర్గాల సమాచారం కూడా. ఈ మొత్తాన్ని ఏరోజుకారోజు దేవుని ఆదాయం లెక్కల్లో చూపాలి. అయితే గత ఐదేళ్లలో సగం ఆదాయం టిటిడికి జమకాలేదనేది ఇప్పుడు సంచలనం రేకెత్తించింది. స్వయంగా టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి తులాభారం కానుకలు స్వాహా చేశారంటూ ఆధారాలతో సహా ప్రభుత్వ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంకు ఫిర్యాదు చేయడం మరింత చర్చనీయాంశంగా మారింది. మరీ ఇదే నిజంగా అవినీతి జరిగిఉంటే దేవుని సొమ్మును స్వాహా చేసిన సూత్రధారులు, పాత్రధారులు ఎవరనేది ఇప్పుడు విజిలెన్స్ దర్యాప్తులో తెరపైకి రానున్నారు.



**తులాభారం మొక్కుబడుల లెక్కలేవీ!:** కలియుగప్రత్యక్షదైవం ,ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా సమర్పించుకునే కానుకల్లో నిలువుదోపిడీ మొక్కులు, తలనీలాలు, కాలినడక,తులాభారం అంటే ఎంతో ప్రియం. భక్తులు తమ మొక్కులను తీర్చుకోవడానికి రోజువారీగా లక్షమంది వరకు తిరుమలకు వస్తున్నారు. దేశవ్యాప్తంగానేగాక విదేశాల్లో ఉన్న భక్తులు ,ప్రముఖులు కూడా తమకు ఏదేనికష్టం వస్తే ముడుపుకట్టి తిరుమలేశునికి మొక్కుకుంటారు. కష్టాల నుండి బయటపడగానే కొండకు చేరుకుని మొక్కుతీర్చుకుంటున్నారు. ఇలా రోజువారీగా హుండీకి సుమారుగా 4కోట్ల రూపాయలు కానుకలు చేకూరుతుంటాయి. ఆ తరువాత తులాభారం మొక్కుల్లో 10లక్షల వరకు ఆదాయం వస్తుందని టిటిడి వర్గాల సమాచారం. ఆలయంలోపల మహద్వారం దాటగానే ధ్వజస్తంభానికి పక్కన తులాభారం ఉంటుంది. కోరికలు నెరవేరిన భక్తులు పిల్లలకేగాకుండా పెద్దలకు కూడా తులాభారం వేస్తారు. గత ఐదేళ్లలో తులాభారం కానుకలు సగానికిపైగా గత టిటిడి పాలకమండలి పెద్దల జేబుల్లోకి వెళ్ళిందని తాజాగా భానుప్రకాశ్‌రెడ్డి ప్రధాన ఆరోపణ. తులాభారం కానుకలు అక్రమాలపై గతంలోనే అప్పటి టిటిడి ఇఒకు కూడా ఫిర్యాదుచేసినా దర్యాప్తు చేపట్టామని, చర్యలు తీసుకోలేదని వెల్లడించారనేది ఇప్పుడు భానుప్రకాశ్ చేసిన వ్యాఖ్యలు సంలచనంగా మారాయి. రోజుకు శ్రీవారిని 70వేలమంది వరకు భక్తులు సరాసరి దర్శనం చేసుకుంటుండగా 30వేలమంది వరకు భక్తులు మొక్కుబడుల్లో తలనీలాలు సమర్పిస్తుంటారు.మరో వందమంది వరకు తులాభారం మొక్కులు తీర్చుకోవచ్చని అంచనా. గతంలో తులాభారం వద్ద బ్యాంకు కాంట్రాక్టు సిబ్బంది విధులు నిర్వహించేవారని, వారిని తొలగించినగత పాలకమండలి టిటిడి ఉద్యోగులను నియమించారన్నారు. తులాభారం త్రాసులోనూ మ్యాజిక్ చేశారని చెబుతున్నారు. రోజుకు వందమంది వరకు తులాభారం వేసిన భక్తుల సంఖ్య తగ్గించి నిధులు స్వాహా చేశారనేది ప్రధాన ఆరోపణ. ఈ సొమ్ము ఎవరికి చేరిందనేది త్వరలోనే ప్రభుత్వ విజిలెన్స్ అధికారులు తేల్చనున్నారు. ఇదే సమయంలోదేవదేవుని ఆభరణాలు భద్రంగానే ఉన్నాయా?అనే అనుమానాలు శ్రీవారి భక్తులను కలచివేస్తోంది.

# ప్రధానిమోడీ @9

>> లిచారు. దక్షిణాదిప్రపంచంలో ఆయన పాత్ర, చురుకైన దౌత్యం, పెరుగుతున్న ఆర్థిక శక్తి ఆయనను నేటి అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులలో ఒకరిగా చేశాయి. ప్రపంచంలోని టాప్ 10 శక్తివంతమైన వ్యక్తుల జాబితాను చూసుకుంటే అందులో మొదటి స్థానంలో చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ ఉన్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశానికి అధ్యక్షుడిగా ఉన్నారు. రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నారు. ఆయన నిర్ణయాలు గ్లోబల్ రాజకీయాలు. రెండోస్థానంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉన్నారు. 2000 సంవత్సరం నుంచి రష్యా అధ్యక్షుడిగా ఉన్న పుతిన్ తన దగ్గర ఉన్న సైనిక శక్తి సహజ వనరుల ద్వారా భౌగోళిక రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. రష్యాలో ఉన్న అతిపెద్ద సహజ వాయు నిల్వలు, స్పేస్ ప్రోగ్రామ్‌లు ప్రపంచంపై ఆయన ప్రభావాన్ని పెంచుతున్నాయి. ఇక మూడో స్థానంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక, సైనిక శక్తి అయిన అమెరికాను నడిపిస్తున్నారు. అమెరికన్ రాజకీయాలతో పాటు ప్రపంచ వ్యవహారాలను, ముఖ్యంగా తన బలమైన సాహసోపేతమైన ప్రకటనలతో ప్రభావితం చేస్తారు. నాలుగో స్థానంలో జర్మనీ మాజీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ తన ప్రశాంతమైన, తెలివైన నాయకత్వంతో కొనసాగారు. ఈమె యూరప్‌లోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను నడిపించారు. ఇక ఐదోస్థానంలో అమెజాన్ వ్యవస్థా పకుడు జెఫ్ బెజోస్ ప్రపంచంలోని అత్యంత ధనవంతులలో ఒకరు. ఆన్‌లైన్ రిటైల్, అంతరిక్ష అన్వేషణలో విజయం ఆయనను శక్తివంతమైన ప్రపంచ వ్యక్తిగా మార్చింది. ఆరో స్థానంలో నిలిచిన రోమన్ కాథలిక్ చర్చి మాజీ పోప్ పోప్ ఫ్రాన్సిస్ ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది కాథలి క్కులకు ఆధ్యాత్మిక నాయకుడు. ఆయన 21 ఏప్రిల్ 2025న అనారోగ్యంతో మరణించారు, మతాన్ని మాత్రమే కాకుండా ప్రపంచ విధానాలను కూడా ఈయన ప్రభావితం చేశారు. ఏడో స్థానంలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ తన ఫౌండేషన్ ద్వారా, ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, పేదరిక నిర్మూలనలో ప్రభావం చూపుతున్నారు. ఎనిమిదవ స్థానంలో సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ప్రపంచంలోనే అత్యధిక చమురు ఎగు మతి చేసే దేశాన్ని పాలిస్తున్నారు. ఆయన సౌదీ సమాజంలో సాహసోపేతమైన సంస్కరణలు తీసుకొచ్చారు.

ఇక తొమ్మిదో స్థానంలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందింది. జాతీయ భద్రత, ప్రపంచ దౌత్యంపై ఈయన బలమైన నిర్ణయాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రభా వాన్ని చూపాయి. పహల్గామ్ దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత వైమానిక దళం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరంపై దాడి చేయ డంతో ఉగ్రవాదాన్ని భారత్ సహించదని ప్రపంచానికి తెలియజెప్పారు. పదో స్థానంలో గూగుల్ సహ వ్యవస్థాపకుడు లారీ పేజ్ ఉన్నారు. ఇతను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ సర్వీసెస్‌లో గూగుల్ ద్వారా ఇన్ఫర్మేషన్ యాక్సెస్‌ను మార్చివేశారు. టెక్ ఇన్నోవేషన్‌లో అగ్రగామిగా, గ్లోబల్ డిజిటల్ ల్యాండ్‌స్కేప్‌ను రూపొందిస్తున్నారు.

# ధర్మశాల కాదు..

>> చంద్రన్‌తో కూడిన ధర్మాసనం నిరాకరించింది. పిటిషన్‌పై వాదనల సందర్భంగా భారతదేశం ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆతిథ్యం ఇవ్వగలదా మేము 140 కోట్ల మందితో ఇబ్బంది పడుతున్నాం. ఇది అన్ని దేశాల నుంచి వచ్చే విదేశీ పౌరులకు ఆతిథ్యం ఇచ్చేందుకు ధర్మశాల కాదుఅని జస్టిస్ దీపాం కర్ దత్తా అభిప్రాయపడ్డారు. యుఎపిఎకేసులో విధించిన ఏడు సంవత్సరాల జైలుశిక్ష ముగి సిన వెంటనే పిటిషనర్ వెంటనే భారతదేశం విడిచి వెళ్లాలని ఆదేశించిన మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ శ్రీలంక తమిళుడని, వీసాపై ఇక్కడికి వచ్చాడని తెలిపారు. స్వదేశంలో తన ప్రాణానికి ముప్పు ఉందని ధర్మాసనానికి చెప్పారు. పిటిషనర్ దాదాపు మూడు సంవత్సరాలుగా నిర్బంధంలో ఉన్నారని తెలిపారు. పిటిషనర్ ఓ శరణార్థి అని ఆతని భార్య, పిల్లలు ఇక్కడ భారత్‌లోనే స్థిరపడ్డారని న్యాయవాది తెలిపారు. పిటిషనర్ భార్య పలు ఆరోగ్య సమస్యలు, కుమారుడు పుట్టుకతోనే గుండె జబ్బులతో బాధపడుతు న్నారని పేర్కొన్నారు. అయితే, జస్టిస్ దత్తా పిటిషనర్ భారతదేశంలో నివసించేందుకు ఉన్న చట్టబద్ధమైన హక్కు ఏంటని ప్రశ్నించారు. ఆర్టికల్ 19 కింద స్థిరపడే హక్కు భారత పౌరులకు మాత్రమే వర్తిస్తుందని, తగిన చట్టపరమైన ప్రక్రియను అనుసరించినందున ఆర్టికల్ 21 ఉల్లంఘన జరగలేదని జస్టిస్ దత్తా పేర్కొన్నారు. పిటిషనర్ తన దేశంలో ప్రాణా లకు ముప్పు ఎదుర్కొంటున్నారని న్యాయవాది తెలుపగా వేరే దేశానికి వెళ్లండి అని జస్టిస్ దత్తా వ్యాఖ్యానించారు. ఇటీవల రోహింగ్యా కేసులోనూ జోక్యం చేసుకునేం దుకు సుప్రీం కోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే.

# లక్నో జట్టుపై ఆరెంజ్ ఆర్మీ సూపర్ విక్టరీ: ఆరువికెట్ల తేడాతో ఎల్ఎస్జీ ఓటమి

## ప్లే ఆఫ్స్‌నుంచి లక్నో నిష్క్రమణం

**లక్నో, మే 19:** ఐపిఎల్ 18వ సీజన్‌లో 61వ మ్యాచ్‌లో ఆరెంజ్ ఆర్మీఘన విజయం సాధించింది. సోమవారం లక్నోలో జరిగిన ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు లక్నోసూపర్‌జెయింట్స్‌పై ఆరువికెట్ల తేడాతో గెలిచింది. పదిబంతులు మిగిలి ఉండగానే విజయం సాధించడం ఆరెంజ్ ఆర్మీకి గర్వకారణం. తొలుత బ్యాటింగ్‌చేసిన లక్నోజట్టు ఏడు వికెట్ల నష్టానికి 205 పరుగులుచేసి ప్రత్యర్థికి 206 పరుగుల లక్ష్యం విధించింది. తదనంతరం చేపట్టిన ఆరెంజ్ ఆర్మీ బ్యాటింగ్ ప్రతిభనుచూపించి నాలుగు వికెట్ల నష్టానికి 206 పరుగులుచేసి అనుకున్న లక్ష్యం పూర్తిచేసింది. దీనితో ఆరు వికెట్ల తేడాతో ఆరెంజ్ ఆర్మీగెలిచింది. ఈ ఓటమితో లక్నోజట్టు ప్లే ఆఫ్స్ రేసు నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.



లోక్‌సభ మాజీ స్పీకర్ నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా పార్లమెంటుహౌస్ వద్ద నివాళులర్పించిన దృశ్యం

# 'సేవ'ల తీరుపై తనిఖీలు

>> పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. అదే విధంగా గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అనే అంశంలో 62 శాతం మంది లేదు అని చెప్పారు. పలు చోట్ల ఈ విషయంలో సమస్య ఉందన్నారు. నేరుగా వారి ఖాతాల్లో ముందుగానే డబ్బులు వేయడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఆర్టీసీ సేవల విషయంలో ప్రయాణికుల నుంచి ఆశిం చన స్థాయిలో సంతృప్తి వ్యక్తం కాలేదని, ఈ విషయంలో అధికారులు మరింత ప్రభావవం తంగా పనిచేయాలని సిఎం అన్నారు. బస్స్టాం డ్‌లలో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ విషయంలో ప్రయాణికుల నుంచి అసంతృప్తి వస్తోందని దీన్ని సరిచేసుకోవాలని సిఎం అన్నా రు. మంచి నీటిపై 44 శాతం, టాయిలెట్లపై 55 శాతం మంది అసంతృప్తి వెల్లడించారు.

**పంచాయతీల్లో సేవలు గతం కన్నా మెరుగు**

ఇక పంచాయతీ సేవల విషయానికి వచ్చేసరికి ఇంటి నంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే ప్రశ్నకు 60 శాతం మంది అవుననే చెప్పారు. గతంతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ మెరుగైందని సిఎం అన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు తడిచెత్త నిర్వహణ బాధ్యత అప్పగించి కంపోస్ట్ తయారీ చేపడతామని సిఎం అన్నారు.

**ప్రభుత్వ సేవల్లో డాటా అనలటిక్స్ కీలకం**

పభుత్వ సేవల విషయంలో డాటా అనలటిక్స్ కీలకమని సిఎం అన్నారు. డాటా ఆధారంగా ఆయా ప్రభుత్వ శాఖల తమ పనితీరును క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సమర్థవంతంగా విశ్లేషిస్తే ప్రభుత్వ సేవల్లో అనూహ్య మార్పులు తేవచ్చన్నారు. ఒక ప్రభుత్వ పథకం, లేదా కార్యక్రమంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్న సందర్భంలో వాటికి కారణాలను తెలుసుకుని దానికి అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రతి శాఖలో ఉన్నతాధికారులు ఆయా శాఖలపై వచ్చే డాటాపై అనలటిక్స్ ద్వారా సేవలను మెరుగుపరచాలని సిఎం సూచించారు.

**వాట్సాప్ గవర్నెన్స్‌లో జూన్ నాటికి 500 సేవలు**

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 325 సేవలు అందుతున్నాయి. మన మిత్ర ద్వారా వాట్సాప్ సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 45 లక్షల మంది ఈ సేవలను విజయవంతంగా వినియోగించు కున్నారు. జూన్ 12వ తేదీ నాటికి 500 సేవలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి కసరత్తు జరుగుతోంది. అదే విధంగా ప్రభుత్వ ప్రతిపాదిత డ్రోన్ సిటీ ఓర్వకల్ ఇండస్ట్రియల్ నోడ్‌లో 300 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ఇందులో మొదటి దశ 116 ఎకరాల్లో నెలకొల్పుతున్నారు. దీనిలో 38 సంస్థలు భాగస్వాములు అయ్యేందుకు ఆసక్తి చూపించాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిపిఆర్ సిద్ధం కాగా... టెండర్ల ప్రక్రియ జూన్ 12 నాటికి పూర్తి అవుతుంది.

# ప్రశాంత నగరంలో 'ఉగ్ర కలకలం'

**విజయనగరం , మే 19 ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రశాంతతకు మారు పేరైన విజయనగరం కలకలం రేగింది. విద్యల నగరంగా భాసి ల్లిన విజయనగరం లో ఉగ్రవాదుల కదలిక ఉందన్న వార్త జిల్లాలోనే కాకుండా ఉత్తరాంధ్రా తో పాటు రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. సిరాజ్ ఉర్ రెహ్మాన్ అనే యువకుడ్ని అరెస్టు చేసిన పోలీసులు అనంతరం కొనసాగిస్తున్న దర్యాప్తులో విస్తుపరిచే విషయాలు వెలుగులోకి రావడంతో జిల్లావాసులు దిగ్భ్రాంతికి గురవుతున్నారు. నిఘా వర్గాలకు దొరికిన సిరాజ్ తన స్నేహితులతో కలిసి హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్రపన్నాడని సమాచారం.పోలీసుల జాయింట్ ఆపరేషన్లో సిరాజ్ పట్టుబడడం, విచారణలో అతను వెల్లడించిన సమాచారం మేరకు ఓ ఇంట్లో పేలుడు పదార్థాలు పట్టుబడడం, వాటిని సీజ్ చేసిన పోలీసులు, సిరాజ్ ను హైదరాబాద్ తీసుకెళ్లి విచారించారని తెలిస్తోంది. ఈ దర్యాప్తులో హైదరాబాదులో సమీర్ అనే యువకుడి పేరు కూడా తెరపైకి రావడంతో అతన్ని కూడా అరెస్టు చేసి ఉగ్ర కోణంలో తమదైన శైలిలో దర్యాప్తు చేస్తున్న అధికారులను నమ్మలేని నిజాలు అవాక్కయ్యేలా చేస్తున్నాయి. ఈ వ్యవహారం లో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనేది దర్యాప్తు బృందాలు శోధిస్తున్నాయి.

# పిల్లలకు పుస్తకాలు

>> తరగతుల్లో గణితం, ఈవీఎస్‌ను కలిపి ఒకటి,తెలుగు,ఆంగ్లం కలిపి మరో పుస్తకంగా ముద్రించారు. ఇలానే వర్క్‌బుక్‌లను ముద్రించారు. ఈ తరగతులకు నాలుగు పాఠ్యపుస్తకాలే ఉంటాయి. 6 నుండి 9 తరగతుల వరకు తెలుగు,ఆంగ్లం,హిందీ పాఠ్యపుస్తకాలను కలిపి ముద్రించారు.మూడు భాషలను కలిపి ఒకే పుస్తకంగా తీసుకొచ్చారు. రెండు సెమిస్టర్లుగా వీటిని ముద్రిస్తున్నారు. 8,9 తరగతుల్లో జీవశాస్త్రం,భౌతిక-రసాయన శాస్త్రా లు కలిపి ఒకే పుస్తకంగా తీసుకొచ్చారు. సాంఘిక శాస్త్రంలో భౌగోళిక చరిత్ర,ఆర్థిక, పౌర శాస్త్రాలు కలిపి ఒకే పుస్తకంగా ముద్రిం చారు. అక్టోబరులో రెండో సెమిస్టరు పుస్తకాలు అందిస్తారు. సెమిస్టర్ విధానం కావడంతో పుస్తకాల సైజు తగ్గిపోయింది. పదోతరగతికి వచ్చే సరికి సెమిస్టర్ విధానం లేకుండా పుస్తకాలు ముద్రించారు.

# నీటిగుంతలో పడి ముగ్గురు చిన్నారులు మృతి

**కుప్పం, మే 19 ప్రభాతవార్త:** ఆటలాడుకునేందుకు వెళ్లిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా కుప్పం మండలం దేవరాజపురంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందినసుమతి,రాజా దంపతుల కుమార్తె షాలిని (6), వరలక్ష్మి,తిరుపతిల కుమార్తె గౌతమి (7) , యశోద, శరవణన్‌ల కుమారుడు అశ్విన్ (6)లు ఆదివారం తమ ఇళ్ల సమీపంలో ఉన్న చర్చి వద్దకు ఆడుకునేందుకు వచ్చారు. అక్కడే ఆటలాడుకుంటూ చర్చి సమీపంలో ఉన్న నీటి గుంత వద్దకు వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. స్థానికులు గమనించి హుటాహుటిన నీటి గుంతలో పడిన చిన్నారులను పైకి తేగా అప్పటికే వారు మృతి చెందిఉన్నారు. కాగా ఈ విషాద సంఘటనపై ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విషయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా సిఎం ఆదేశాలతో ప్రభుత్వం తరఫున తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల వంతున అందించాలని జిల్లా కలెక్టర్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్‌లకు ఆదేశించారు.

## వారం - వర్జ్యం

తేది : 20-05-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
సప్తమి ఉ.5.51, అష్టమి తె.4.55
ధనిష్ఠ రా.7.27
వర్జ్యం రా.2.29-తె.4.03
దు.ఉ.8.11-9.03, 2) రా.11.44-12.36
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

**వృషభం :** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం నిదానంగా దాలుస్తాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మిథునం:** శ్రమ తప్ప ఫలితం ఉండదు. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**కర్కాటకం:** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. అనుకోని ఖర్చులు ఎదురై చికాకులు పెడతాయి.

**సింహం:** కొత్త విషయాలు తెలుసుకుంటారు. అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. స్వల్ప ధనలాభం పొందుతారు.

**కన్య :** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**తుల :** శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి.

**వృశ్చికం:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి సకాలంలో పూర్తిచేస్తారు. బంధువుల నుండి శుభవార్తలు వింటారు.

**ధనుస్సు:** కుటుంబంలో ఏర్పడిన సమస్యలు కొంత వరకు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**మకరం:** విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు. ధనవ్యయం.

**కుంభం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆదాయం తగ్గుతుంది మానసిక అశాంతి.

**మీనం :** వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇరిగేషన్ పనులు, నిర్వహణ, మరమ్మతులకు రూ.344 కోట్లు

## - జలవనరుల మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు



అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** ఇరిగేషన్ పనులు, నిర్వహణ మరమ్మతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ 344 కోట్లు విడదల చేశారని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈనెలాఖరు నాటికి ఓఅండ్ఎం పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఇరిగేషన్ పనుల కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకుంటూ వర్క్స్ వెంటనే మొదలుపెట్టాలని అన్నారు. ఓ అండ్ ఎం పనులపై ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ అధికారులతో సోమవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓ అండ్ ఎం పనుల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంత పెద్ద మొత్తంలో నిధులను మంజూరు చేయటం ముదావహమన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందు అంటే, నేటి నుంచి కేవలం పది పన్నెండు రోజులు మాత్రమే ఉన్నందున తక్షణం పనులను ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉందని మంత్రి సూచించారు. ఇందుకు సూపరిండెంట్ ఇంజనీర్లు, చీఫ్ ఇంజనీర్లు నిరంతర పర్యవేక్షణ చేయటం ద్వారానే సకాలంలో పూర్తి కాగలవన్నారు. 10 లక్షలు దాటిన పనులకు ఏడు రోజుల గడువులో పూర్తి చేసే విధంగా షార్ట్ టెండర్లు పిలవాలని సూచించారు. రూ 10 లక్షల లోపు ఉన్న పనులను సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టుకోవచ్చని రామానాయుడు తెలిపారు. ఆ రకంగా ఎక్కడికి అక్కడ సాగునీటి సంఘాలను చైతన్య పరచడం ద్వారా పనులు త్వరితగతిని పూర్తయ్యేలా చైతన్య పరచాలని ఇరిగేషన్ అధికారులకు,ఎమ్మెల్యేలకు సలహా ఇచ్చారు. గత ప్రభుత్వం ఓ అండ్ ఎం పనులను గాలికి వదిలేసిందని మంత్రి విమర్శించారు. కాలవల్లో తట్ట మట్టి తీయలేదు అన్నారు. కనీస మరమ్మతులైన షట్టర్లు, డోర్లు, గేట్లకు మరమ్మతులు చేయడం మరిచిందన్నారు. కనీసం గ్రీజు కూడా పెట్టలేదు అన్నారు. గతంలో వందలు, వేల కోట్లు వ్యయం చేసి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువలు డ్రైన్స్ నిర్మిస్తే, 2019లో వచ్చిన ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలంలో కనీస మెయింటెనెన్స్ చేయకుండా గాలికి వదిలేసిందని మంత్రి రామానాయుడు విమర్శించారు. ఫలితంగా ఆ పనులన్నీ పాడు పడే పోయే విధంగా తయారయ్యాయి అని అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేసుకుంటూ ఇరిగేషన్ రంగాన్ని ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నట్టు చెప్పారు. టెలికాన్ఫెరెన్స్లో పలు జిల్లాల ఎమ్మెల్యేలు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్, కడా కమిషనర్ రామసుందర్ రెడ్డి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీఈలు, ఎస్ ఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రోడ్డుపై కుక్కను తప్పించబోయి ప్రమాదం

## పల్టీ కొట్టిన కారు.. ముగ్గురు వ్యక్తులు మృతి

**ప్యాపిలి మే19ప్రభాతవార్త:** జాతీయ రహదారిపై దూసుకుపోతున్న కారు.. సేన్ గా అడ్డు వచ్చిన కుక్క.. తప్పించ బోయిన డ్రైవర్..అదుపు తప్పిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం. నంద్యాలజిల్లా ప్యాపిలి మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కుక్క అడ్డం రావడంతో తప్పించ పోయి అదుపు తప్పి కారు పక్కనున్న చెట్లలోకి దూసుకెళ్లిన కారు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి కర్ణాటక రాష్ట్రం తుంకూరుకు కేఏ 02 ఎంకె 4525 నెంబర్ గల కారులో ఆరుగురు వెళ్ళుతుండగా ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడిన సంతోష్ (36), నవీన్(43), లోకేష్ )(35) లను డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం కర్నూ లు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వివరించారు.




# పాకాల రైల్వే జంక్షన్‌కు మహర్దశ

**పాకాల, మే 19 ప్రభాతవార్త** తిరుపతి జిల్లా పాకాల రైల్వే జంక్షన్‌కి, దామల చెరువు రైల్వే స్టేషన్‌కి కొద్ది రోజులలో మహర్దశ పట్టబోతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు ప్రత్యేక చొరవతో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సహాయ సహకారాలతో పాకాల మండలానికే మనిహారం ఈ రైల్వే డబ్లింగ్ లైన్, పాకాల మీదుగా వెళ్లే ప్రయాణికుల దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్న కల త్వరలో నెరవేరబోతోంది. ఇప్పటికే 1332 కోట్ల రూపాయలతో తిరుపతి నుండి కాట్పడి వరకు డబ్లింగ్ పనులకు కేంద్రం ఆమోదం తెలిపిన విషయం ప్రజలకు తెలుసు. కొత్తగా పాకాల నుంచి ధర్మవరం వరకు డబ్లింగ్ మరియు విద్యుదీకరణ కోసం పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఇక్కడి ప్రజలు మరియు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో టెండర్లు పూర్తిచేసుకుని క్షేత్రస్థాయిలో పనులు మొదలు కాబోతూ ఉండటం శుభ పరిణామం అని ప్రజలు అంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో ధర్మవరం పాకాల కాట్పాడి డబ్లింగ్ పనుల మొత్తానికి కలిపి 2900 కోట్లు, ధర్మవరం పాకాల విద్యుదీకరణకు 231.1 కోట్లతో పనులు ప్రారంభంకానున్నాయి. త్వరలో దామలచెరువు కేంద్రంగా మ్యాంగో, ఎక్స్పోర్ట్ కారిడార్ పనులకు కూడా వడివడిగా అడుగులు పడుతున్న సందర్భంలో ఈ ప్రాజెక్టుల వలన పాకాల దామలచెరువు రూపు రేఖలు మారి ఇక్కడి యువతకు ఉపాధి కల్పన పెరగటమే కాకుండా భూముల ధరలు పెరిగి మంచి రోజులు రావటం స్వాగతించాల్సిన విషయం అని ప్రజలు అంటున్నారు.

# మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా శైలజ బాధ్యతలు



**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఏ ఒక్క మహిళకు అన్యాయం జరిగినా, వారి హక్కులను కాలరాసేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా రాయపాటి శైలజ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ శైలజ మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా, రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని తెలిపారు. గత ఐదేళ్లలో మహిళా కమిషన్ లో ఫిర్యాదులను పట్టించుకోలేదని, పాత ఫిర్యాదుల దుమ్ముదులిపి ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అవసరమైత జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియా వేదికగా మహిళలపై అసభ్య పోస్ట్ లు పెడుతున్నారని, వారు తమ తీరు మార్చుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని రాయపాటి శైలజ హెచ్చరించారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే మహిళలపట్ల గౌరవం పెంచేలా అవగాహన సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. దీంతో ఖచ్చితంగా సమాజంలో మార్పు తీసుకురావచ్చన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ మహిళలకు అన్యాయం జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని, సమాచారం మాకు అందిన వెంటనే పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. ఫిర్యాదుల కోసం తమ శాఖ ఆధ్వర్యంలో ఒక వెబ్ సైట్ రూపొందించనున్నామన్నారు. ఈ వెబ్ సైట్ ద్వారా ఫిర్యాదులు చేయడంతో పాటు తమ ఫిర్యాదు ఏ దశలో ఉందో కూడా తెలుసుకునే ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్‌కు పూర్వ వైభవం తీసుకువస్తామని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రివర్యులు పెమ్మసాని చంద్రశేఖర్. వివిధ నాయకులకు తన కృతజ్ఞతలు తెలియజేశారు.

# పిఎస్ఎల్వి-సి61 వైఫల్యంపై రెండు బృందాలతో విశ్లేషణ కమిటీ



**శ్రీహరికోట (తడ), మే 19 ప్రభాతవార్త** పిఎస్ఎల్వి-సి61 రాకెట్ వైఫల్యంపై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విశ్లేషణ మొదలుపెట్టింది. ఫెయిల్యూర్ అనాలసిస్ కమిటీల ద్వారా లోపం ఎక్కడ జరిగిందన్న దానిపై ఆరా తీస్తున్నారు. నాలుగు దశలతో నిర్మించిన ఈ రాకెట్ మూడవ దశలో దారి తప్పింది. ఆదివారం పిఎస్ఎల్వి వైఫల్యం తర్వాత ఇటు శ్రీహరికోటతో పాటు అటు ఇస్రోలోను విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ రాకెట్ నిర్మాణంలో అత్యధిక భాగం పాలుపంచుకున్న శ్రీహరికోటలో శాస్త్రవేత్తలు తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడింది. రాకెట్ ఫెయిల్ కావడంతో పాటు అందులో ప్రయోగించాల్సిన అత్యంత విలువైన ఉపగ్రహం ఇఓఎస్09 కూడా నిర్వీర్యం కావడంతో శాస్త్రవేత్తల పనితీరును అందరూ ప్రశ్నిస్తున్నారు. అంతరిక్ష కక్ష్యలోకి వెళ్లిన ఈ రాకెట్‌లోని నాలుగో దశ, ఉపగ్రహాన్ని నిర్మూలించినట్లు అనధికార సమాచారం. అయితే ఇస్రో అధికారికంగా ఇప్పటికీ వివరణ ఇవ్వలేదు. ఈ రాకెట్ నిర్మాణం ముఖ్యంగా రెండు ఘన ఇంధన దశలు పూర్తిగా శ్రీహరికోటలోనే నిర్మించారు. ఇక్కడే ఘన ఇంధనాన్ని నింపారు. ప్రస్తుతం 101వ రాకెట్ వైఫల్యం తర్వాత కారణాలను పసిగట్టేందుకు ఇస్రో రెండు కమిటీల ద్వారా విశ్లేషణ వేగవంతం చేసింది. రాకెట్ వేగం, అతి వెళ్లిన ఎత్తు, అందులోని ఇంజన్ల పనితీరు తదితర అంశాలపై ఈ కమిటీలు అధ్యయనం చేస్తున్నాయి. మూడవ దశ మోటారులో ఇంధన ప్రవాహం గురించి, నాజిల్ సమస్యలు గురించి తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా రాకెట్ల ఫెయిల్యూర్ సమయాన ఒక దశ నుంచి మరొక దశకు మోటార్లు అంటుకోవడం వంటి చర్యల్లో ఏదయినా లోపం జరిగిందా అన్నది కూడా చర్చనీయాంశంగా ఉంది.

అసలు ఈ మోటారు డిజైన్ తయారీలో లోపాల గురించి కూడా ఆరా తీస్తున్నారు. నాజిల్ నియంత్రణ వ్యవస్థలో మూడవ దశలోపల ఉన్న పరికరాలు ఏమయినా సరిగ్గా పనిచేయలేదా అన్న దాని మీద కూడా చర్చిస్తున్నారు. మొత్తంమీద అలవోకగా తారాజువ్వల్లాగా పదే పదే ప్రయోగించిన పిఎస్ఎల్వి రాకెట్ కీలక సమయంలో మొరాయించడం కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పక తప్పని పరిస్థితి ఇస్రోది. ఇదిలావుంటే రాకెట్‌లోని నాలుగవ దశ, ఇఓఎస్ 09 ఉపగ్రహం జనావాసాలపై పడకుండా నిర్మూలించినట్లు చెప్తున్నారు. అది కూడా అధికారికంగా ప్రకటించకపోవడం విశేషం.

# త్వరలో తిరుపతి మీదుగా విజయవాడ - బెంగళూరు మధ్య వందేభారత్



**గుంతకల్లు రైల్వే,మే 19,ప్రభాతవార్త** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లోని తిరుపతి మీదుగా విజయవాడ-బెంగళూరు-విజయవాడ మధ్య తాజాగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడిపించేందుకు రైల్వే శాఖ నిర్ణయించినట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. రైల్వే వర్గాల సమాచారం ప్రకారం విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 20711వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఆయా నిర్ణీత రోజులలో ఉదయం 5-15గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి, తిరుపతి 9-45/50, బెంగళూరుకు మధ్యాహ్నం 2-15గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు నుంచి విజయవాడ వెళ్లే నెంబర్ 20712వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఆయా నిర్ణీత రోజులలో మధ్యాహ్నం 2-45గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి, తిరుపతి సాయంత్రం 6-55/7-00, విజయవాడకు రాత్రి 11-45గంటలకు చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు తెనాలి, ఒంగోలు, నెల్లూరు, చిత్తూరు, కాట్పాడి, క్రిష్ణరాజాపురం స్టేషన్లలో నిలుస్తాయి.

# కసిరెడ్డి పిటిషన్‌పై సుప్రీం కోర్టులో ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వు

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ స్కాం కేసులో తన అరెస్ట్ చట్ట వ్యతిరేకమంటూ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి దాఖలు చేసిన పిటీషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ పూర్తి అయ్యింది. తీర్పును జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం రిజర్వ్ చేసింది. హైదరాబాద్‌లో నోటీసు ఇచ్చినప్పుడు చెప్పిన కారణాలు వేరని, కస్టడీ రిపోర్టులో వేరే కారణాలను వెల్లడించారని కసిరెడ్డి తరపు న్యాయవాది వాదించారు. విజయవాడకు తీసుకొచ్చిన తరువాత అవినీతి నిరోధక చట్టం కింద కూడా కేసు నమోదు చేశారని తెలిపారు. అరెస్ట్ సమయంలో కానీ, కస్టడీ సమయంలో కానీ పీసీ యాక్ట్‌పై కసిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయలేదని, సుప్రీం పిటీషన్‌లో మాత్రం కొత్త అభ్యంతరాలను లేవనెత్తుతున్నారని ఏపీ ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపించారు. ఆంధ్రాకు చెందిన సీఐడీ వేరే రాష్ట్రంలో నోటీసులు ఇవ్వడం కూడా చెల్లవంటూ కసిరెడ్డి తండ్రి ఉపేందర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఇరు తరపు వాదనలను లిఖిత పూర్వకంగా సాయంత్రంలోగా ఇవ్వాలని సుప్రీం ధర్మాసనం తెలిపింది. విచారణ ముగియడంతో తీర్పును తరువాత వెల్లడిస్తామని సుప్రీం కోర్టు పేర్కొంది. బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆశ్రయించాలంటూ ఉన్నతన్యాయస్థానం అభిప్రాయపడింది. ఏపీ మద్యం కేసులో తన అరెస్ట్ చట్ట వ్యతిరేకమని కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, తన కొడుకు అరెస్ట్‌లో నిబంధనలు పాటించలేదని.. అంతేకాకుండా తనకు ఇచ్చిన నోటీసులు చెల్లవంటూ కసిరెడ్డి తండ్రి ఉపేందర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై ఈరోజు (సోమవారం) సుప్రీంలో విచారణ ముగిసింది. జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం ఈ కేసు విచారణను ముగించి తీర్పును రిజర్వ్ చేసింది. కసిరెడ్డి, ఉపేందర్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది మహేష్ జత్మలానీ వాదించారు. ఆంధ్రాకు చెందిన సీఐడీ వేరే రాష్ట్రంలో నోటీసులు ఇవ్వడం చెల్లదన్న వాదనలను కూడా పరిగణలోకి తీసుకోవాలని వాదించారు. అయితే కసిరెడ్డి, ఆయన తండ్రి దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్‌లను గతంలో హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఇద్దరు కూడా సుప్రీంలో సవాల్ చేశారు. వాదప్రతివాదనలు విన్న ధర్మాసనం ఇరువురి వాదనలను లిఖిత పూర్వకంగా సోమవారం సాయంత్రానికి ఇవ్వాలని ఆదేశించింది.

## విద్యుదాఘాతంతో యువకుడు మృతి

**వింజమూరు (నెల్లూరు), మే 19, ప్రభాతవార్త:** విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం వింజమూరులో చోటు చేసుకుంది. బైరవరం గ్రామానికి చెందిన బోగిరెడ్డి చిన్న ఓబుల్‌రెడ్డి(23) స్తంభానికి చేయి తగలడంతో వెంటనే విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు రాగా అతనిని వైద్యులు కాపాడేందుకు ప్రయత్నం చేశారు. గుండె స్పందన లేకపోవడంతో కాపాడలేకపోయారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి కాంగ్రెస్ అల్టిమేటం

**విజయవాడ,మే 19,ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి కాంగ్రెస్ పార్టీ ఆల్టిమేటం జారీ చేసింది. మంగళవారం లోగా తొలగించిన 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి లేకుంటే ఈ నెల 21 నుండి స్టీల్ ప్లాంట్ ఎదుటే ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఆమరణ దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఆ మేరకు ఆమె ఒక ప్రకటన జారీ చేసారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికుల ప్రయోజనాల కోసం ప్రాణత్యాగానికి సిద్ధమన్నారు.. విశాఖ ఉక్కు యాజమాన్యానిది నిరంకుశ ధోరణి అన్నారు. డిమాండ్ల సాధనపై రేపటి నుండి కార్మికులు సమ్మెబాట పడుతుంటే కనీసం దిద్దుబాటు చర్యలకు దిక్కులేదు. కార్మికుల సమస్యలు పరిష్కారించాలన్న కనికరం లేదు. దిక్కున్న చోట చెప్పుకోండనే తీరున యాజమాన్యం వ్యవహరిస్తోంది. ఇప్పటికే 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల పొట్ట గొట్టిన యాజమాన్యంమరో 3 వేల మందిని రోడ్డున పడేసేందుకు కుట్రలు చేయడం దుర్మార్గం. అన్యాయాన్ని ప్రశ్నించిన కార్మికులను సైతం ఉద్యోగాల నుండి సస్పెండ్ చేయడం దారుణం. కాంగ్రెస్ పార్టీ పక్షాన విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి ఆల్టిమేటం ఇస్తున్నాం. మంగళవారం లోగా తొలగించిన 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి. రెగ్యులర్ ఉద్యోగులకు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణం చెల్లించాలి 2021 జనవరిలో తీసుకున్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలి. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటన చేయాలి..లేకుంటే రేపటి నుండి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు మద్దతుగా ఈ నెల 21 నుండి స్టీల్ ప్లాంట్ బయట ఆమరణదీక్షకు దిగుతాం. ఆంధ్రుల హక్కు-విశాఖ ఉక్కు స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం, కార్మికుల ప్రయోజనాల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు.

# తిరుమల సమాచారం

## వెంకన్నకు మైసూరు రాజమాత భారీ కానుక

### - శతాబ్దాల తరువాత అఖండ వెండిదీపాలు సమర్పణ



**తిరుమల,మే 19ప్రభాతవార్తప్రతినిధి:** అత్యంత సంపన్నవంతమైన దేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి మైసూరురాజమాత ప్రమోదాదేవి భారీ కానుకను అందించారు. శతాబ్ధాల తరువాత మైసూరురాజు కుటుంబానికి చెందిన రాజమాత ఆలయంలోపల సన్నిధిలో (గర్భ గుడిలో) నిరంతరంగా వెలిగే సాంప్రదాయ వెండి అఖండ దీపాలను విరాళంగా సమర్పించారు. ఒక్కో వెండి అఖండం సుమారు 50 కిలోలు బరువుంటుంది. సుమారు 300 సంవత్సరాల క్రిందట అప్పటి మైసూరుమహారాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించినట్లు ఆలయ శాసనాల్లో ఉంది. మళ్ళీ మైసూరు రాజమాత ఇప్పుడువాటిని సమర్పించుకోవడం విశేషం. ఆలయంలోపల రంగనాయకుల మండపంలో ఆమె టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి భారీ వెండి అఖండాలను అందజేశారు. కార్యక్రమం అనంతరం టిటిడి అధికారులు రాజమాతకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రత్యేకంగా సత్కరించారు. రాజమాతపై ఛైర్మన్ నాయుడు ప్రశంసలు కురిపించారు. ఈ రెండు అఖండదీపాలు గర్భగుడిలో మరింత ఆధ్యాత్మిక శోభను పెంచుతాయి. ఆలయంలో నిరంతరాయంగా వెలుగుతున్న శాశ్వత అఖండ దీపాలు ప్రపంచంలో శాంతి, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా భావిస్తారు.

## శ్రీవారి ఆశీస్సులందుకున్న జస్టిస్ దుర్గాప్రసాద్



**తిరుమల,మే 19ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందుకున్నట్లు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి చిత్రపటం బహుకరించారు.

## శ్రీవారి సేవలో పార్లమెంట్ కమిటీ



**తిరుమల,మే 19ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం స్టడీ సైన్స్ టెక్నాలజీ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ భువనేశకవర్ కలిత సభ్యులతో సహా ఆలయంలోనికి చేరుకున్నారు . టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తులాభారం నిధులు స్వాహాపై విచారణ చేయండి

### - విజిలెన్స్‌ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు టిటిడి బోర్డు సభ్యుడు భానుఫిర్యాదు



**తిరుమల,మే 19ప్రభాతవార్తప్రతినిధి:** గత ఐదేళ్ళ జగన్‌ప్రభుత్వం హయాంలో తిరుమలలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని, శ్రీవారి ఆలయంలోని తులాభారం నగదును అక్కడ సిబ్బంది తస్కరించారని టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఈ అక్రమాలపై విచారణ చేపట్టి అసలు దొంగలు ఎవరో తేల్చాలని సోమవారం మధ్యాహ్నం తిరుపతిలోని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్పీ కరీముల్లా షరీఫ్‌కు ఫిర్యాదు చేశారు. టిటిడిని ధనార్జన క్షేత్రంగా మార్చి స్వామివారి ఖజానా స్వాహా చేశారంటూ గత ప్రభుత్వ పాలకులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని తులాభారం నగదు స్వాహాపై విచారణ చేపట్టి కేసు నమోదు చేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. అందుకు సంబంధించి తనవద్దవున్న ఆధారాలను విజిలెన్స్ ఎస్పీకి అందజేసినట్లు ఆయన చెప్పారు. 2019 నుండి 2024 వరకు విచారణ చేపట్టాలని ఎస్పీని కోరినట్లు భానుప్రకాశ్‌రెడ్డి తెలిపారు. గతంలోని ఉన్నతాదికారులు, విజిలెన్స్ సిబ్బందిని విచారణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తులాభారంలో జరిగిన అక్రమాలను అప్పటి టిటిడి విజిలెన్స్ అదికారులు బయటపెట్టినా గత ఉన్నతాధికారులు వాటిని బుట్టదాఖలు చేశారని గుర్తుచేశారు. భక్తులు సమర్పించిన కానుకలను సగం లెక్కలు చూపి సగం దొంగతనంగా తీసుకెళ్ళారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పరకామణిలో దొంగతనం చేసిన ఉద్యోగిని చెట్టుక్రింద పంచాయతీ చేసినట్లుచేసి ,భేషరతుగా విడిచిపెట్టారని చెప్పారు. వీటన్నిటీపై సమగ్ర విచారణ చేపట్టి అసలు దొంగలను తేల్చాలని భానుప్రకాశ్‌రెడ్డి కోరారు.

## దేవునిచెంత కల్యాణవేదికలో ఉచిత వివాహాలు

### - ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు అవకాశం

**తిరుమల,మే 19ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఆయన చెంత పేద, మధ్యతరగతి వర్గాల యువతీయువకులు ఉచితంగా కల్యాణాలు చేసుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఇందుకోసం తిరుమలలోనే పాపవినాశనమ్ మార్గంలో అత్యాధునిక సౌకర్యాలతో కల్యాణవేదికను నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ఇందుకు తెలుగురాష్ట్రాలనుండేగాక దేశం నలుమూలల నుండి కూడా యువతీయువకుల కుటుంబాలు ఆన్‌లైన్‌లోనే వారివారికి ఇష్టమైన తేదీల్లో బుక్‌చేసుకునేలా అవకాశం ఉంది. తిరుమలలో టిటిడి నిర్వహిస్తున్న ఉచిత వివాహాలకు నూతన వధూవరుల నుండి విశేష స్పందన లభిస్తోంది. 2016 ఏప్రిల్ 25నుండి 2025 మేనెల 1వరకు 26,214 వివాహాలు అయ్యాయి. ఇందులో పురోహితుడు, మంగళవాయిద్యంతోబాటు పెళ్ళిసమయంలో పసుపు, కుంకుమ, కంకణంను టిటిడి ఉచితంగా అందిస్తుంది. వివాహానికి అవసరమైన సామాగ్రిని వధూవరులే తీసుకురావాల్సి ఉంటుంది. వివాహానికి వధూవరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. పెళ్ళికి రాలేని సందర్భంలో అందుకు సంబంధించి ఆధార పత్రాలను సమర్పించాలి. వివాహానంతరం పెళ్ళికుమారుడు, పెళ్లికుమార్తెబాటు ఇరువురు తల్లిదండ్రులను 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాల ద్వారా ఆరుమందికి సుపథం క్యూలైన్ ద్వారా ఉచితంగా శ్రీవారి దర్శనం కల్పిస్తారు. దర్శనానంతరం ఆరుమందికి 6ఉచిత లడ్డూలు కౌంటర్లలో అందుకోవచ్చు. తిరుమలలోని కల్యాణవేదికలో పెళ్లిచేసుకోవాలనే యువతీయువకులు ఉచిత వివాహాలు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లోనే కల్యాణవేదిక స్లాట్స్ బుక్‌చేసుకునే సదుపాయం ఉంది. 2016 మేనెల నుండి నూతన వధూవరులకు టిటిడి కల్పించింది. ఆయా ప్రాంతాల్లోని నెట్‌సెంటర్‌లలో టిటిడి హెచ్‌టిటిపిఎస్://టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ ద్వారా బుక్‌చేసుకోవాలి. కరెంట్ బుకింగ్, ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకునే జంటలు తప్పనిసరిగా హిందూ మతస్థులై ఉండాలి. వధువుకు 18 సంవత్సరాలు, వరునికి 21 సంవత్సరాలు నిండి ఉండాలి. ద్వితీయ వివాహాలు ,ప్రేమ వివాహాలు జరుపబడవు. ఇతర వివరాలకు 0877-2263433నంబర్‌కు సంప్రదించాలి.

వార్త

నిజమైన బలం అనేది శారీరక శక్తి కాదు. ఆత్మజ్ఞానంలోనూ, మరణభయం నుంచి విముక్తి పొందడంలోనూ ఉంది.

-మహాత్మాగాంధీ

# అగ్నికీలలు ఆపలేమా?


ప్రమాదాలంటే అనుకోకుండా వచ్చేవని అందరికీ తెలిసిన విషయమే. అయినా ప్రమాదాల నివారణ, నిరోధకతలో మనమెంత వెనుకబడి ఉన్నామో ఆదివారం తెలతెలవారుతుండగా జరిగిన దుస్సంఘటన వివరాల్లోకి వెళ్తే ఎవరికైనా ఒళ్ళు జలదరిస్తుంది. భాగ్యనగరంలో భారీ అగ్నిప్రమాదంలో ఒక వ్యాపారి కుటుంబానికి చెందిన బంధు వర్గమంతా సజీవ దహనం అయ్యారన్న సమాచారం దిగ్భ్రాంతి కలిగించే విషయం. హైదరాబాద్ పాతబస్తీ చార్మినార్ ప్రాంతంలో గుల్జార్‌హౌస్ కింద అంతస్తులో కృష్ణ పెరల్స్ వ్యాపారం నిర్వహిస్తూ, మొదటి అంతస్తులో నగల వ్యాపారి నివాసం ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుఝామున జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. మొత్తం ఆహుతైన 17 మందిలో 8మంది చిన్నారులున్నారు. ఒక్కసారిగా మంటలు చెలరేగి భవనంలోకి వ్యాపించాయి. బాధితులు మంటలు, కమ్ముకున్న పొగలను దాటుకుని బయటకు రాలేక అక్కడికక్కడే దగ్ధమయ్యారు. సెలవులని తమ పిల్లలతో వచ్చిన నాలుగు కుటుంబాల సభ్యులు అగ్నికి ఆహుతిఅయ్యారు. వీరిలో చాలామంది బెంగాల్ వాసులే. వారి శరీరాలు బాగా కాలిపోయినందున చికిత్స వరకు తరలించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రమాదానికి కారణం ఎలెక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ వల్లనేనని ప్రాథమిక అభిప్రాయానికి వచ్చారు. ఈ ప్రమాద స్థలికి వచ్చిన అగ్ని మాపకదళాల వద్ద ఆక్సిజన్ పరికరాలు ఏవీ లేకపోవడం, అగ్నిమాపక సిబ్బంది సన్నద్ధతపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వెలిబుచ్చారు. ఇలాంటిదే మరో దుర్ఘటన మహారాష్ట్రలోని షోలాపూర్ పారిశ్రామిక హబ్‌లో ఒక టెక్స్టైల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరిగి 8 మంది మృతి చెందారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగినా ఎందుకు జరిగినా అగ్నికీలలకు ఊపిరి ఆగిపోతున్న దుర్ఘటనలను తలచుకుంటేనే గుండె తరుక్కుపోతోంది. కొన్ని అగ్నిప్రమాదాలు మాత్రంమానవ తప్పిదాలు, నిర్లక్ష్యం వలనే వస్తాయన్నది అంగీకరించాల్సిన విషయం. ఇలాంటి ప్రమాదాలను అరికట్టే విషయంలో ప్రభుత్వాలు అగ్నిమాపక యంత్రాంగాన్ని సిద్ధం చేయకపోతే దానికి ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అసలే వేసవికాలం. ఎక్కడో అక్కడ చిన్నదో, పెద్దదో అగ్ని ప్రమాదాలు జరుగుతాయనేది ప్రతీతి. అగ్ని మాపక దళంవారు ఈ సీజన్లో అగ్ని ప్రమాదాలు జరగ కుండా చూసేందుకు ప్రత్యేక అగ్నిమాపక వారోత్సవాలు కూడా నిర్వహించడం పరిపాటి. అయినా అగ్నిప్రమాదాల నివారణలో వారు తగినంత సమాయత్తమైన పరిస్థితి కనపడలేదు. దాదాపు జంట నగరాల్లో సంవత్సరానికి ఒక వెయ్యికి పైగా అగ్ని ప్రమాదాలు జరిగిన రికార్డు ఉంది. కాగా నేటి ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకునేసరికి ఆక్సిజన్ పరికరాలు తెచ్చుకోకపోవడంతో వారు ఏ మేరకు సన్నద్ధతలో ఉన్నదీ అర్థమోతోంది. ఆ ప్రాంతంలో చాలా భవనాలకు ఫైర్ సేఫ్టీ లేదని అగ్నిమాపకదళ ఉన్నతాధికారులే చెబుతున్నారు. వాటిని చెక్ చేయడంలో వారి బాధ్యత లేదనుకుంటున్నారా? ఈ ప్రశ్నలకు జవాబు ఎవరు చెబుతారు. చివరకు ప్రభుత్వ వైఫల్యమేనని తేల్చేస్తారు. ప్రమాదాలు వచ్చినప్పుడు మాత్రం చర్చించుకొని నిర్ణయాలు తీసుకోవడం, ఆపై నిష్క్రియతోనే మరో అగ్నిప్రమాదం జరుగకుండా చూడడంలో విభాగాలు విఫలమవుతున్నాయి. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రాణనష్టానికి దారితీసిన అగ్ని ప్రమాదాలన్నీ చేదు అనుభవాలనే మిగిల్చింది. ఈ మధ్యకాలంలో జరిగిన అగ్ని ప్రమాదాలలో ఇదే పెద్దది. ఇంతకు ముందు జరిగిన అగ్నిప్రమాదాలతో పోల్చిచూసుకుంటే ఈసారి జరిగిన ప్రాణనష్టం చాలా ఎక్కువే. కానీ ప్రమాదం జరిగిన రీతిని గమనిస్తే ఆ భవనంలో వారు నిద్రిస్తున్న సమయంలో మంటలు చుట్టు ముట్టడంతో ఎవరూ తప్పించుకోలేకపోయారు. 2023లో బజార్ఘాట్ నాలుగు అంతస్తుల నివాస భవనంలో అగ్ని ప్రమాదం సంభవించి 10 మంది మరణించారు. గ్రౌండ్ ఫ్లోర్ కార్ గ్యారేజీలో రసాయన సీసాలు పేలడం వల్ల ఈ సంఘటన జరిగింది. వెంకటేశ్వరకాలనీ అగ్ని ప్రమాదంలో నాలుగు అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించి, 10ఏళ్ల బాలిక మృతి చెందింది. మార్చి 2023లో సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఆరుగురు మరణించారు. కాంప్లెక్స్‌లోని 5వ అంతస్తులో మంటలు చెలరేగడంతో నలుగురు మహిళలతో సహా ఆరుగురు పొగపీల్చడంవల్ల ఊపి రాడక మృతిచెందారు. జనవరి 2023లో సికింద్రాబాద్ నల్లగుట్ట వద్ద ఓ బట్టల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదంలో ముగ్గురు కార్మికులు సజీవదహనమయ్యారు. సెప్టెంబర్ 2022లో సికింద్రాబాద్‌లోని ఓ బహుళ అంతస్తుల కాంప్లెక్స్లోని హోటల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. మార్చి 2022లో సికింద్రాబాద్‌లోని ఓ స్క్రాప్ గిడ్డంగిలో జరిగిన భారీఅగ్ని ప్రమాదంలో 11మంది వలస కార్మికులు ఆహుతయ్యారు. గ్యాస్ లీక్ కారణంగా కరాచీ బేకరీ ఫ్యాక్టరీలో మంటలు రేగి 15 మంది కార్మికులు క్షతగాత్రులయ్యారు. జంట నగరాల్లో జరిగిన అగ్ని ప్రమాదాలలో అధిక శాతం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనేనని తేలి నందున ప్రమాద నివారణకు నాణ్యమైన విద్యుత్ వైరింగ్, క్రమం తప్పకుండా కనెక్షన్‌ల తనిఖీ వంటి జాగ్రత్తల విషయమై వినియోగ దారులలో అవగాహన కల్పించడం ద్వారా చైతన్యం తీసుకురావాల్సిన

ఎవరిని ప్రశ్నిస్తున్నాం అన్నది గొప్ప విషయం కాదు. ఎవర్ని నిందిస్తున్నాం అనేదే బాధాకరమైన విషయం.



విలియం ఆస్లర్

ప్రతి వ్యక్తి తన కోర్కెలు, అనుభూతులు నిష్పత్తిని బట్టి బీదవారుగాని, ధనవంతులు గాని అవుతారు.



జాన్సన్

## ప్రజావాక్కు



### ఎవరు అధికులు?

**గవర్నర్,** రాష్ట్రపతికి బిల్లుల ఆమోదం విషయంలో విశేష అధికారాలుంటాయి. ఇవి రాజ్యాంగ పరంగా వచ్చినవి. అలాంటప్పుడు సుప్రీంకోర్టు కాలపరిమితిని ఎలా విధిస్తుందని రాష్ట్రపతి సుప్రీం కోర్టును వివరణ యివ్వమని సుదీర్ఘప్రశ్నావళికి సంధించడం జరిగింది. రాజ్యాంగాన్ని పరిపూర్ణంగా ఈమూల నుంచి ఆమూలకు ఎవరికి నాలుకల మీద నాట్యం చేయవు. ఒక్క ప్రధానమైన విషయం మాత్రం ఏమిటంటే ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ తీర్పు. వారికి న్యాయం చేయడం కోసం అవసరమయితే రాజ్యాంగాన్ని సవరణ చేయవచ్చు. అందుచేత సుప్రీం ఇటువంటి తీర్పునుఇవ్వవలసి వచ్చిందేమో. ఇక్కడ ఎవరు అధికులుఎవరుకారు అనేచర్చ జరగడం మంచిది కాదు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### రోడ్లపై వ్యర్థ పదార్థాలు

**గ్రామస్థాయి** నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలు వాహనాలతో ప్రయాణించే రోడ్లపై గృహనిర్మాణానికి సంబంధించిన మెటీరియల్‌ను నెలలు, సంవత్సరాల కొద్దీ రోడ్లపై ఉంచడం వలన ప్రయాణికులకు, వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రోడ్లపై చెత్త చెదారం, కంకర రాళ్లు వేసిన వారిపై స్థానిక సంస్థలు అధికారులు నోటీసు జారీ చేసి వాటిని తొలగించి సులభమైన ప్రయాణానికి కృషిచేయాలి. రాత్రిపూట ఇలాంటి రోడ్లపై నడవడం వాహనాలుప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుంది.

-ఈదునూరి వెంకటేశ్వరు, నెక్కొండ, వరంగల్ జిల్లా

### సనాతన ధర్మం

**సనాతన** ధర్మరక్షణ కోసం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఛాయమార్తాండ శనైశ్చర దేవస్థానం వద్ద మునివాహన సేవ జరిగినట్లు దళిత పీఠాధిపతి మాతా నందగిరి స్వామిని ఛాయామార్తాండ పీఠాధిపతి ఉంగరాల సుబ్రహ్మణ్యశాస్త్రి తన భుజాలపై మోసుకొంటూ ఆలయంలోకి తీసుకెళ్లి సత్కరించినట్లు పత్రికల ద్వారా తెలుస్తున్నది. ఇలాంటి చర్యల వల్ల సనాతన ధర్మ దృఢపడుతుంది. అంతేగాని అగ్రకులాల వాళ్లు, దళితులు ఒకర్నికొరు ధూషించుకుంటే దళితులు వాళ్లలో వారే చీలి కలైకలహించుకుంటే సనాతనమతం బలహీనపడుతుంది.

-రాచమడుగు శ్రీనివాసులు, హైదరాబాద్

### తాగునీటి కొరత

**ప్రస్తుతం** రాష్ట్రంలో వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో, అనేక గ్రామాలు, పట్టణాలు తాగునీటి కొరతతో తీవ్రంగా బాధపడుతున్నాయి. ప్రజలు తాగేందుకు సరిపడా నీరు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి గంభీరంగాఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులు క్షీణించడంతో పేద ప్రజల జీవితం మరింత దుర్భరమవుతోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలి. ప్రతి మండలానికి నీటి సరఫరా కోసం ప్రత్యేక ట్యాంకర్లను ఏర్పాటు చేయాలి. పాత బోర్లు మరమ్మతు చేయడంతో పాటు, అవసరమైతే కొత్త బోర్లు వేయాలి. గ్రామాల్లో నీటినిల్వకోసం పెద్దట్యాంకులు నిర్మించాలి. ఇకపోతే వరపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ వంటి దీర్ఘకాలిక ప్రణాళికలకూ ప్రాధాన్యత ఇవ్వాలి. నీరు మానవ హక్కు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలంటే, నీటి అందుబాటును ప్రభుత్వం నిర్ధారించాలి. ఈ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### కఠిన నియంత్రణ అవసరం

**మద్యం** సేవించి డ్రైవింగ్ హైదరాబాద్‌లో ప్రజల భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారింది. వాహనదారులే కాకుండా, అమాయక ప్రయాణికులు, బాటసారులు కూడా ఈ ప్రమాదానికి గురవుతున్నారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది 18 నుండి 40 ఏళ్ల మధ్యవారే. వారి రక్తంలో మద్యం స్థాయిలు ప్రమాదకరంగా ఎక్కువగా ఉన్నాయి. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మద్యం సేవించి డ్రైవింగ్ కేసులు పెరుగుతుండటం ఆందోళనకరం. మద్యం సేవించి వాహనం నడపడం కేవలం చట్ట ఉల్లంఘనే కాదు, ఇది ప్రాణాలకు ప్రమాదకరం. హైదరాబాద్‌లో మద్యం సేవించి డ్రైవింగ్‌ను అరికట్టడానికి సమగ్ర చర్యలు అవసరం.

-డాక్టర్ కృష్ణ కుమార్ వేపకొమ్మ, హైదరాబాద్

### నీతి నియమాలు పాటించాలి

**దశాబ్దాలపాటు** కాపురం చేసి పిల్లలను కని తరువాత మా మనస్సులు కలవట్లేదని విడాకుల ద్వారా విడిపోదామని నిర్ణయించుకోవడం బాధనుకలుగజేస్తోంది. వివాహ మైన నెలరోజులకే విడిపోయిన జంటలను చూస్తున్నాము. ఇలా విడిపోతే పిల్లలకు తల్లిదండ్రుల ఆలనాపాలన దక్కుతుందా? ఆదర్శం, ధర్మం, నీతి నియమాలు పాటించాలి.

-కె. అమరావతి, నల్గొండజిల్లా

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# విద్యుత్ ఒప్పందంతో ప్రజలపై పెనుభారం!

*కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ నుంచి యూనిట్ 2.49 రూపాయలకు కొనుగోలు చేసేందుకు వై సీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి నేడు యాక్సిస్ సంస్థతో 4.60 రూపాయలకు ఎలా ఒప్పందం చేసుకుంది. బహిరంగ మార్కెట్లో అంత కన్నా తక్కువ ధరకే వస్తుంది గదా! యాక్సిస్ సంస్థతో ఒప్పందం ఫలితంగా విద్యుత్ రేట్లు పెరిగి ప్రజలపైన 15 వేల కోట్ల రూపాయల దాకా భారం పడుతుంది. ఇప్పటికే ట్రూ అప్ చార్జీల పేరుతో 14వేల కోట్లకు పైగా కూటమి ప్రభుత్వం ప్రజలపై చార్జీల భారం మోపింది. పాలకులకు ప్రైవేట్ విద్యుత్ సంస్థల ప్రయోజనాలు తప్పప్రజల ప్రయోజనాలు పట్టడం లేదు. ప్రైవేట్ సంస్థలతో కుదుర్చుకున్న అన్ని విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని, ప్రభుత్వ రంగంలోనే పూర్తిగా విద్యుత్ ఉత్పత్తి జరగాలని, థర్మల్ విద్యుత్ సంస్థలకు అవసరం మేరకు బొగ్గుసప్లయ్ చేయాలని, బకాయిలు చెల్లించాలని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని రాష్ట్ర ప్రజలు ఉద్యమించాలి.*

బొల్లిముంత సాంబశివరావు

చంద్రబాబు గారి నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం ప్రైవేట్ విధానాలతో ముందుకుపోతున్నది. పోర్టులను, మెడికల్ కాలేజీలను, విద్య, వైద్యం మొదలైన వాటిని ప్రైవేట్ పరం చేయనుంది. తాజాగా నిత్యం అవసరంగా ఉన్న కరెంట్‌ను కూడా ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెడుతున్నది. అందులో భాగమే యాక్సిస్ రెన్యూవబుల్ ఎనర్జీ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్‌తో విద్యుత్ కొనుగోళ్ల గురించి చేసుకున్న ఒప్పందం. 400 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను నిర్మించి, వాటి నుంచి ఏపీ ఎస్పీడీసీఎల్ 25 సంవత్సరాల పాటు యూనిట్‌కు 4.60 రూపాయల చెల్లించి కొనుగోలు చేసేందుకు అంగీకారం తెలిపింది. ధర తగ్గించేందుకు వీలులేకుండా ఒప్పందంలో 'సిలింగ్' షరతు విధించారు. ఇంతకు ముందు కూడా యాక్సిస్ సంస్థ 5 వేల మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసుకునేందుకు 2018లో టిడిపి ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా 400 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు 2019 జనవరి 23న విద్యుత్ సంస్థలు అనుమతించాయి. దీన్ని గమనిస్తే యాక్సిస్‌తో చంద్రబాబు అనుబంధం ఏమిటో తెలుస్తుంది. 2014-18 మధ్య టిడిపి పాలనలోనే ఎస్పీడీసీఎల్ పరిధిలో 464 మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు 15 కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. దానిప్రకారం మొదటి ఏడాది యూనిట్‌కు 5.98 రూపాయల చొప్పున చెల్లించాలి. రెండవ ఏడాది నుంచి ఏటా 3శాతం పెంపుతో పదో సంవత్సరం దాకా కొనుగోలు వ్యయం పెరుగుతుంది. ఫలితంగా పదో ఏడాది నాటికి యూనిట్‌కి 7 రూపాయల పైగా చెల్లించాలి. రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ యూనిట్ 4.20 రూపాయలకే అందుబాటులో ఉన్నా 7 రూపాయలకు ప్రైవేట్ సంస్థల నుంచి కొనేందుకు టిడిపి ప్రభుత్వం ఎలా ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైయింది. 2019 సాధారణ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం టిడిపి ప్రభుత్వం లోని పీపీఏల సమీక్షతో పాటు 2019 ఎప్రిల్ 1 ముందు కుదిరిన ఒప్పందాల మేరకు ఇంకా మొదలు కాని పనులను రద్దు చేయాలని ఆదేశించింది. కొత్తగా కేంద్ర ప్రభుత్వ సంస్థ 'సెకీ' తో యూనిట్ 2.49 రూపాయల చొప్పున కొనుగోలుకు ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందాన్ని టిడిపి వ్యతిరేకించింది. యాక్సిస్ సంస్థ నుంచి తొలుత 400 మెగావాట్లకు తర్వాత మరో 774.9 మెగావాట్ల కు ఒప్పందాలు కుదుర్చుకునేలా దస్త్రాన్ని ఏపీఈఆర్‌సీఆమోదం కోసం అధికారులు పంపారు. ఆ పీపీఏల ద్వారా యూనిట్ ధర 4.28 రూపాయల చొప్పున ఖరారు చేయాలని డెవలపర్ సంస్థ విద్యుత్ నియంత్రణ మండలిని కోరింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో హైబ్రిడ్ ప్రాజెక్టుల నుంచి వచ్చే విద్యుత్ యూనిట్ 2.90 రూపాయలకు దొరుకుతుంది. అలాంటప్పుడు 4.28 రూపాయలకు ఎందుకు కొనుగోలు చేయాలి. ఈ లెక్కన ప్రతి సంవత్సరం 193.2 కోట్ల




రూపాయల అదనపు భారం ప్రజలపై పడుతుంది. గత ప్రభుత్వంలో 11.11.2022న యాక్సిస్ సంస్థ నుంచి యూనిట్ 3.50 రూపాయల చొప్పున పీపీ ఏల కొనుగోలు ఆమోదం కోసం ఏపీఈఆర్‌సీ అనుమతి కోసం డిస్కం పంపింది. ఆ పీపీఏలను ఎలా సమర్థించుకుంటారో వివరణ ఇవ్వాలంటూ డ్రాఫ్ట్ పీపీఏలను విద్యుత్ నియంత్రణ మండలి డిస్కంకి తిప్పిపంపింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం విద్యుత్ చట్టం 2003 సెక్షన్ 108 ప్రకారం యాక్సిస్ సంస్థతో పీపీఏలను ఆమోదించాలంటూ 2492024న ఏపీఈఆర్ సీకి లేక వ్రాసి, దీన్ని తిరస్కరించటానికి వీలు లేదని, ఒక వేళ తిరస్కరిస్తే చట్టం ప్రకారం ముందుకు పోతుందని బెదిరింపు ధోరణి ప్రదర్శించింది. ఆ అవసరం ఎందుకు ఏర్పడిందో తెలియదు. వైసీపీ ప్రభుత్వం పంపిన పీపీఏ ప్రతిపాదనలు తిప్పి పంపిన ఏపీఈఆర్ సీ యాక్సిస్ సంస్థతో చంద్రబాబు ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్‌పిడిసిఎల్) దాఖలు చేసిన పిటిషన్ ను మాత్రం ఆమోదించింది. యాక్సిస్‌తో ఖచ్చితంగా పీపీ ఏలు కుదుర్చుకోవాలంటూ విద్యుత్ సంస్థలను అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశించలేదు. కాని ఆ సంస్థతో పీపీఏలు కుదుర్చుకోవటానికి విద్యుత్ సంస్థలు ముందుకు వచ్చాయి. అధి కారులు కూడా ఆ సంస్థ నుంచి విద్యుత్ తీసుకోవటంచాలా చౌకనే రీతిలో వివరణ ఇవ్వటం ద్వారా పీపీఏలకు మద్దతు పలికారు. చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ అధికారుల మద్దతుతో యాక్సిస్ సంస్థకు చెందిన సౌర, పవన ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఒప్పందాలు కుదుర్చుకోవటానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే వాటి ప్రతిపాదనలను ఏపీఈఆర్ సీకి చేరాయి. విద్యుత్ యూనిట్ టారిఫ్ ఎంత ఉండాలో కూడా యాక్సిస్ సంస్థ ప్రతిపాదించింది. దాన్ని ఆంధ్రప్రదేశ్ పవర్ కో ఆర్డినేషన్ కమిటీ ( ఏపీపీ సీ సీ) ఏపీఈఆర్‌సి ఆమోదం కోసం పంపింది. దీన్ని గమనిస్తే కూటమి ప్రభుత్వ విద్యుత్ ఒప్పందం ద్వారా యాక్సిస్ సంస్థ ఎంత ప్రయోజనం పొందుతుందో తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ నుంచి యూనిట్ 2.49 రూపాయలకు కొనుగోలు చేసేందుకు వైసీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి నేడు యాక్సిస్ సంస్థతో 4.60 రూపాయలకు ఎలా ఒప్పందం చేసుకుంది. బహిరంగ మార్కెట్లో అంత కన్నా తక్కువ ధరకే వస్తుంది గదా! యాక్సిస్ సంస్థతో ఒప్పందం ఫలితంగా విద్యుత్ రేట్లు పెరిగి ప్రజలపైన 15 వేల కోట్ల రూపాయల దాకా భారం పడుతుంది. ఇప్పటికే ట్రూ అప్ చార్జీల పేరుతో 14వేల కోట్లకు పైగా కూటమి ప్రభుత్వం ప్రజలపై చార్జీల భారం మోపింది. పాలకులకు ప్రైవేట్ విద్యుత్ సంస్థల ప్రయోజనాలు తప్పప్రజల ప్రయోజనాలు పట్టడం లేదు. ప్రైవేట్ సంస్థలతో కుదుర్చుకున్న అన్ని విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని, ప్రభుత్వ రంగంలోనే పూర్తిగా విద్యుత్ ఉత్పత్తి జరగాలని, థర్మల్ విద్యుత్ సంస్థలకు అవసరం మేరకు బొగ్గుసప్లయ్ చేయాలని, బకాయిలు చెల్లించాలని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు

# పర్యావరణంపై భానుడి ప్రతాపం

డాక్టర్ మోటె చిరంజీవి

భూమిపై రోజు రోజుకు అనేక మార్పులు సంభవిస్తున్నాయి. మన దేశం సమశీతోష్ణ పరిస్థితులకు అనుకూలంగా ఉంటుంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో వాతావరణంలో అనేక మార్పులు కనిపిస్తున్నాయి. దానికి కారణం పర్యావరణ కాలుష్యం. భూమిపై వివిధ రకాల జీవులు, అవి ఏర్పరచుకునే సహజ నమూనాలు ప్రపంచ పర్యావరణం పని చేయడానికి సహాయపడతాయి. కలుషితమైన గాలి, నీరు, క్షీణించిన నేల, పట్టణ పెరుగుదల అన్నీకూడా పర్యావరణంపై ప్రభావం చూపిస్తాయి. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువులు, అతినీలాలోహిత కిరణాలు, ఏరోసాల్స్ ఓజోన్లలో దీర్ఘకాలిక మార్పులను పర్యవేక్షించడం వలన వాతావరణ మార్పులు కనబడుతున్నాయి. వేడి, పొడి కారణంగా సంభవించే అడవి మంటలు, సముద్రపు ఆమ్లీకరణ వేడెక్కడం వల్ల బ్లీచ్డ్ పగడాలు, తుఫానులు సముద్రమట్టం పెరుగుదల కారణంగా, తీర ప్రాంత వరదలు ఎడారి కరణ కారణంగా వాతావరణంలో మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీని ద్వారా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలో పెరుగుదల, అలాగే సముద్ర ఉష్ణోగ్రతలు ఎక్కువ లోతులలో పెరగడం, తరచుగా సముద్రపు వేడి తరంగాలు, పీహెచ్ విలువ తగ్గడం, సముద్రం వేడెక్కడం, మంచు పలకలు ద్రవీకరణ చెందడం, ఇవన్నీ కూడా పర్యావరణ మార్పుల వల్ల వస్తున్నాయి. రానున్న రోజులలో మన దేశం తీవ్రమైన వడగాల్పులతో ఇబ్బంది పడుతుందని వాతావరణ మార్పులపై అంతర ప్రభుత్వాల సంఘం నివేదిక గత సంవత్సరం హెచ్చరించింది. తాజాగా ప్రపంచ బ్యాంకు సైతం ఇదే విషయంపై అనేక ఆందోళనకర విషయాలను తెలిపింది. వేడిగాలుల వల్ల భారతదేశంలోని ప్రజల ఆయుష్షు తగ్గి, పెద్దసంఖ్యలో మరణాలు సంభవిస్తాయని తెలిపింది. గత సంవత్సరం దేశ రాజధాని ఢిల్లీలో



ఏప్రిల్ నెలలో 46డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైతే ఈ సంవత్సరం ఎండాకాలంలో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. 1981-1990 మధ్యకాలంలో 413 రోజులు, 2011-2020మధ్యకాలంలో 600రోజులు తీవ్ర వడగాల్పులు వీచాయని భారత పర్యావరణ విభాగం వెల్లడించింది. అనగా 1990 నుండి 2019లో భారత్‌లో వడగాల్పుల తీవ్రత 15శాతం పెరిగినట్లు లాన్సెట్ నివేదిక తెలిపింది. ఈ విధంగా ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వడగాలులు విచీ వాటి ప్రభావం అనేక వాటిపై కనిపిస్తుంది. రైతులు వివిధ కార్యాలయాల్లో సిబ్బంది పనిచేయలేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల భూమిపై ఉన్న జీవులపై కూడా ప్రభావం చూపుతుంది. కోళ్ల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం, చెరువులో పెంచే చేపల పెంపకంలో అనుకున్న స్థాయిలో కన్నా దిగుబడి తగ్గుతుంది. ఇవేకాక పాలిచ్చే జంతువులైన ఆవులు, గేదెల్లో కూడా పాల దిగుబడి తగ్గుతుంది. ఉష్ణతాపం రవాణ వ్యవస్థపై కూడా ప్రభావం చూపి, ఆహార ధాన్యాల రేట్లు పెరిగి, ప్రజలకు భారమవుతుంది. ఆహార ధాన్యాల నిలువల కోసం, వాటిని శీతలీకరణ గిడ్డంగుల్లో ఉంచడానికి, వాటిని చల్లపరచడానికి ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు అవసరమవుతాయి. తద్వారా కరెంటు బిల్లుకూడా అధికంగా వచ్చి నష్టపోయే అవకాశంవుంది. పర్యావరణంలో ఉష్ణోగ్రతల తగ్గుదల కోసం అనేక చర్యలు చేపట్టాలి. చెట్లను అధికంగా నాటడం, వాటిని రక్షించడం ద్వారా కొంతమేర ఉష్ణోగ్రతను అరికట్టవచ్చు. ఒక్కొక్క గృహానికి అనేక వాహనాలు వాడడం, ఏసీ రిఫ్రిజిరేటర్లు వాడడం వల్ల, మొబైల్‌వాడటం, వాటి టవర్ల నుండి వచ్చే రేడియేషన్ ద్వారా, ఫ్యాక్టరీల నుండి వెలువడే వ్యర్థాలను కాల్చడం ద్వారా, వాతావరణం కలుషితమై భూమిపై కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ ఎక్కువగా విడుదలై, ఓజోన్ పై ప్రభావం చూపి, భూమిపై ఉష్ణోగ్రత, వడగాలులు పెరుగుతాయి. వీటిని అరికట్టడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, క్షేత్రస్థాయిలో ప్రతిష్టంగా అమలు చేసి

# ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి ఏది?

డి. మోహన రావు

మన దేశ ఆర్థికవ్యవస్థ ఎలా నడుస్తోంది? దాని గుండె చప్పుడు ఎలాఉంది? ఈ కీలక ప్రశ్నలకు సమాధానం వెతకడానికి మనకు అనేక సూచికలు ఉన్నప్పటికీ, వాటిలో ఒకటి చాలా ప్రత్యేకమైనది. అదే కొనుగోలు నిర్వాహకుల సూచీ లేదా పిఎంఐ. ఇది కేవలం అంకెలు కాదు, మన ఆర్థిక వ్యవస్థలోని తయారీ, సేవల రంగాలలో రోజువారీగా పనిచేసే వ్యక్తుల అనుభవాల నుంచి పుట్టిన ఒక కీలక సంకేతం. వ్యాపార కార్యకలాపాలు, భవిష్యత్తుపై వారి ఆశలు ఎలా ఉన్నాయో ఇది మనకు ముందుగానే చెబుతుంది. ఇటీవలి కాలంలో ఈ సూచీ చెబుతున్న కథ భారత ఆర్థిక గమనంపై ఆసక్తికరమైన చర్చలకు తావిస్తోంది. అసలు ఈ కొనుగోలు నిర్వాహకుల సూచీ అంటే ఏమిటి? దీన్ని అర్థం చేసుకోవడం చాలా సులువు. వ్యాపార సంస్థల్లో కొనుగోళ్లు చేసే నిర్వాహకులు ఉంటారు కదా, వారే ఈ సూచీ వెనుక ఉన్నారు. వారిని ప్రతినెలా సర్వే చేసి, కొత్త ఆర్డర్లు ఎలా వస్తున్నాయి, ఉత్పత్తి పెరుగుతోందా, ఉద్యోగులను కొత్తగా తీసుకుంటున్నారా, ముడిసరుకుల సరఫరా వేగంగా ఉందా లేదా వంటి విషయాలపై వారి అభిప్రాయాలు తీసుకుంటారు. ఈ అభిప్రాయాల ఆధారంగా 0నుంచి 100 మధ్య ఒక అంకెను లెక్కిస్తారు. ఈ అంకెలో '50' అనేది చాలా ముఖ్యమైన స్థాయి. సూచీ అంకె 50 వద్ద ఉందంటే, గత నెలకు, ఇప్పటికీ వ్యాపార పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదని అర్థం. అంతా స్థిరంగా ఉంది అనుకోవచ్చు. ఒకవేళసూచీ 50కంటే ఎక్కువగా ఉంటే, అప్పుడు కథ వేరేలా ఉంటుంది. వ్యాపార కార్యకలాపాలు పుంజుకుంటున్నాయని, ఆర్థికవ్యవస్థ వృద్ధి పథంలో వేగంగా పయనిస్తోందని ఇది చెబుతుంది. ఇది చాలా మంచి వార్త. కానీ సూచీ 50కంటే తక్కువగా ఉంటే, అప్పుడు కొంచెం ఆందోళన చెందాలి. వ్యాపారాలు మందగిస్తున్నాయని, ఆర్థిక కార్యకలాపాలు నెమ్మదిస్తున్నాయని ఇది సూచిస్తుంది. ఇది ఆర్థిక వ్యవస్థకు ఒక హెచ్చరిక లాంటిది. దీని గొప్పతనం ఏమిటంటే స్థూల దేశీయోత్పత్తి, పారిశ్రామిక ఉత్పత్తి, నిరుద్యోగ గణాంకాలు వంటి అధికారిక వివరాలు వెలువడటానికి చాలా ముందే, నెల ప్రారంభంలోనే ఈ సూచీ అందుబాటులోకి వస్తుంది. అందుకే దీన్ని 'ముందస్తు ఆర్థిక సూచిక' అంటారు. మార్కెట్లో ఏం జరగబోతోందో ముందుగానే పసిగట్టడానికి ఇది ఆర్థికవేత్తలకు, విధాన నిర్ణేతలకు, వ్యాపారులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ సమాచారం ఆధారంగానే ప్రభుత్వాలు సరైన సమయంలో నిర్ణయాలు తీసుకోవడానికి, వ్యాపారాలు తమ ప్రణాళికలు మార్చుకోవడానికి, పెట్టుబడిదారులు జాగ్రత్త పడటానికి అవకాశం లభిస్తుంది. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు వంటి ద్రవ్య విధానాలను నిర్ణయించేటప్పుడు కూడా ఈ సూచీని ఒక ముఖ్యమైన సూచనగా తీసుకుంటాయి. ఈ సూచీలో ప్రధానంగా రెండు రకాలుంటాయి. వస్తువులు తయారు చేసే పరిశ్రమల కోసం 'తయారీ రంగ సూచీ', బ్యాంకింగ్, వైద్యం, ఐటీ వంటి సేవలందించే సంస్థల కోసం 'సేవల రంగ సూచీ'. ఈ రెండింటినీ కలిపి మొత్తం ఆర్థిక వ్యవస్థ స్థితిని తెలిపే 'సంయుక్త సూచీ' కూడా ఉంటుంది. ఈ



సూచీ కూడా ఒక మనిషిలాగే పరిమితులు కలిగి ఉంటుంది. ఇది కొందరు కొనుగోలు నిర్వాహకుల అభిప్రాయాల ఆధారంగా తయారవుతుంది కాబట్టి, కొన్నిసార్లు మొత్తం రంగాన్ని లేదా దేశ ఆర్థికవ్యవస్థను పూర్తిగా ప్రతిబింబించకపోవచ్చు. వారి వ్యక్తిగత అనుభవాలు, మార్కెట్ సెంటిమెంట్ ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. నెలవారీగా వచ్చే ఈ అంకెలు సరఫరా సమస్యలు వంటి తాత్కాలిక కారణాల వల్ల కూడా మారవచ్చు. అన్నిటినీ మించి, ఇది కేవలం తయారీ, సేవల రంగాల గురించే చెబుతుంది కానీ వ్యవసాయం, నిర్మాణం వంటి ఇతర ముఖ్యమైన రంగాలను పెద్దగా పట్టించుకోదు. అందుకే, పిఎంఐ కేవలం ఒక కోణాన్ని మాత్రమే చూపిస్తుందని గుర్తుంచుకొని, దాన్ని ఇతర ఆర్థిక గణాంకాలతో పోల్చి చూస్తేనే మన ఆర్థిక వ్యవస్థ పూర్తి చిత్రాన్ని అర్థంచేసుకోగలం. ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు ఈ సూచీలను సిద్ధంచేస్తున్నాయి. భారతదేశంలో, ఎస్‌పి గ్లోబల్ అనే అంతర్జాతీయ సంస్థ సేకరించిన సమాచారం ఆధారంగా హెచ్‌ఎస్బిసి ఇండియా అనే సంస్థ దీన్ని లెక్కిస్తుంది. సుమారు 400 తయారీ సంస్థలు, 400 సేవాసంస్థల నుంచి వీరు వివరాలు తీసుకుంటారు. భారత ప్రభుత్వం కూడా ఈ సూచీని చాలా ముఖ్యమైనదిగా పరిగణిస్తుంది. ఆర్థిక సర్వే వంటి అధికారిక నివేదికల్లో కూడా దీని ప్రస్తావన ఉంటుంది. ఇక తాజాగా మన దేశంలో ఈ సూచీ చెబుతున్న కథ ఆశాజనకంగా ఉంది. ఏప్రిల్ 2025 నాటికి వెలువడిన గణాంకాలు మన ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందని బలంగా సూచిస్తున్నాయి. తయారీ రంగ సూచీ గత పది నెలల్లో ఎప్పుడూ లేనంత ఎక్కువగా నమోదైంది. సేవల రంగ సూచీ కూడా మంచి స్థాయిలో ఉంది. ఈ రెండింటినీ కలిపిన సంయుక్త సూచీ అయితే గత ఎనిమిది నెలల్లో అత్యధికం. ఈ అంకెలు చూస్తుంటే, దేశీయంగా, విదేశాలలోనూ మన వస్తువులు, సేవల పట్ల ఆసక్తి, డిమాండ్ పెరుగుతున్నాయని, వ్యాపారవర్గాల్లో భవిష్యత్తుపై విశ్వాసం బలంగా ఉందని అర్థమవుతోంది. ఇదంతా ఆర్థికవ్యవస్థకు మంచి పరిణామమే. ఈ అద్భుతమైన అంకెల తెర వెనుక కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. అలాగే, పెట్టుబడి వస్తువులు వంటి కొన్ని ప్రత్యేక రంగాల్లో వృద్ధి ఇంకా పుంజుకోవాలి. ఎగుమతులు కూడా దేశీయ డిమాండ్ స్థాయికి చేరుకోవాలి. ఎక్కడ లోపాలున్నాయో గుర్తించి, ప్రభుత్వం ఆయా రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. భవిష్యత్ అంచనాలు కూడా మన ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంటుందని చెబుతున్నాయి. అంతర్జాతీయ సంస్థలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ పథకాలు, మౌలిక సదుపాయాలపై పెడుతున్న పెట్టుబడులు ఈ వృద్ధికి బలం చేకూర్చగలవు. కానీ కేవలం అంకెల్లో వృద్ధివస్తే సరిపోదు కదా. అది సామాన్యుడి జీవితంలో ప్రతిబింబించాలి. నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, పేదరికం, ద్రవ్యోల్బణం వంటి అనేకసవాళ్లు ఇంకా మన ముందున్నాయి. వీటిని అధిగమించాలంటే ఉద్యోగాలు సృష్టించే రంగాలపై పెట్టుబడి, యువతకు నైపుణ్య శిక్షణ, మౌలిక వసతుల కల్పన వంటి వాటిపై మరింతగా దృష్టి పెట్టాలి. పథకాలను ప్రకటించడమే కాదు, వాటిని సమర్థవంతంగా అమలు చేయడం చాలా ముఖ్యం. మొత్తం మీద, కొనుగోలు నిర్వాహకుల సూచీ అనేది ఒక ముఖ్యమైన దిక్సూచి లాంటిది. అది మన ఆర్థిక వ్యవస్థ ప్రయాణాన్ని ముందుగానే సూచిస్తుంది. ఇప్పుడు వస్తున్న ఆశాజనకమైన సంకేతాలను సరైన చర్యలతో మరింత బలోపేతం చేసి, ముందున్న సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటేనే స్థిరమైన, అందరికీ ప్రయోజనం కలిగించే వృద్ధిని సాధించగలం. కేవలం ఈ ఒక్క సూచీనే కాకుండా, అన్ని ఆర్థిక వివరాలను కలిపి చూస్తేనే మన ఆర్థిక వ్యవస్థ పూర్తి చిత్రాన్ని స్పష్టంగా అర్థం చేసుకోగలం. ●



# స్వర్ణాలయంపై కన్నేసిన పాకిస్థాన్

## దాయాది వ్యూహాన్ని తిప్పికొట్టిన భారత్ ఆర్మీ

**న్యూఢిల్లీ, మే 19:** ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా ఇటీవల పాక్ జరిపిన క్షిపణి, వైమానిక దాడులను భారత సాయుధ దళాలు సమర్ధంగా తిప్పికొట్టాయి. ధైర్యసాహసాలు, పరాక్రమంతో శత్రుదేశ దాడులను అడ్డుకున్నాయి. పాక్ క్షిపణులు, డ్రోన్లను మన ఎల్70, ఆకాశ్ తదితర గగనతల రక్షణ వ్యవస్థలు అద్భుతరీతిలో నేలమట్టం చేశాయి. సరిహద్దు రాష్ట్రాల్లోని అనేక నగరాలకు హాని జరగకుండా భారత సైన్యం కాపాడింది. అయితే ఆపరేషన్ సిందూర్ తర్వాత అక్కసుతో అమృత్ సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని పాక్ లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడులను ఎలా అడ్డుకున్నామో 15 పదాతిదళ విభాగం జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు. ఇంటెలిజెన్స్ నుంచి అందిన సమాచారం ప్రకారం గోల్డెన్ టెంపుల్ వంటి మతపరమైన ప్రదేశాలతో సహా భారత పౌర, సైనిక స్థావరాలను పాక్ లక్ష్యం చేసుకుంటుందని భారత సైన్యం ఊ హించింది. పాక్ సైన్యానికి ఎటువంటి చట్టబద్ధమైన లక్ష్యాలు లేవని తెలుసు. గోల్డెన్ టెంపుల్‌ను లక్ష్యంగా చేసుకొనే అవకాశాలు కనిపించాయి.

ముందుగానే ఊహించడంతో స్వర్ణ దేవాలయానికి అదనపు రక్షణ కల్పించాం. మే8న తెల్లవారుజామున గోల్డెన్ టెంపుల్ లక్ష్యంగా పాక్ డ్రోన్లు, దీర్ఘ శ్రేణి క్షిపణులను ప్రయోగించింది. ముందే సిద్ధమై ఉన్న ఇండియన్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్ పాకిస్థాన్ సైన్యం ప్రణాళికలను తిప్పికొట్టింది. స్వర్ణ దేవాలయంపై ఒక్క గీత కూడా పడకుండా అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారని మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు. పహల్గాంలో అమాయక భారత, విదేశీ పర్యటకులే లక్ష్యంగా జరిపిన ఉగ్రదాడి ఫలితంగానే ఇండియా ఆపరేషన్ సిందూర్ చేపట్టిందని కార్తిక్ తెలిపారు. ఇందులో భాగంగా పాక్, పీవోకేలోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత్ మెరుపు దాడులు చేసిందని వివరించారు. తొమ్మిది స్థావరాలలో, ఏడింటిని భారత సైన్యం ప్రత్యేకంగా నాశనం చేసిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సాయుధ దళాలు సంపూర్ణ ఖచ్చితత్వంతో అనేక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థల ప్రధాన కార్యాలయాలు ఉన్న మురిద్కే, బహవల్పూర్ వంటి ప్రాంతాలపై దాడి చేశాయని అన్నారు. భారత సైన్యం పాకిస్థాన్ సైనిక, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోలేదని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదు కొనసాగుతోంది. పాక్ కవ్వింపులకు పాల్పడితే గట్టి ప్రతిస్పందన తప్పదు. పాక్ సైన్యం లోపాలు, ఎదుర్కొన్న ఒత్తిడి గురించి తెలుసు. పాక్ సైన్యం ఏవైనా దాడులకు యత్నిస్తే వినాశకరమైన ప్రతిస్పందనను ఇస్తాం. అవసరమైతే పాకిస్థాన్‌ను పూర్తిగా నాశనం చేస్తామని కార్తిక్ తెలిపారు. మరోవైపు, పాకిస్థాన్ దాడుల నుంచి తమ ప్రాణాలు కాపాడినందుకు అమృత్ సర్ ప్రజలు ఇండియన్ ఆర్మీకి కృతజ్ఞతలు తెలిపారు. భారత సాయుధ దళాలతో భుజం భుజం కలిపి నిలబడతామని పేర్కొన్నారు.

గోల్డెన్ టెంపుల్ సహా సరిహద్దు ప్రాంతాలలోని మతపరమైన ప్రదేశాలను రక్షించడానికి సైన్యం అన్ని ప్రయత్నాలను చేసిందని కొనియాడారు. సాయుధ దళాలకు ప్రజలు తమ సామర్థ్యాల మేరకు సహాయం చేయ దానికి ప్రయత్నిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఇండియన్ ఆర్మీ స్వర్ణ దేవాలయం, నగరంలోని కొన్ని ప్రాంతాలను రక్షించిందన్నారు.



# ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని విమానాలు నష్టపోయాం?

## వివరాలివ్వాలని డిమాండ్ చేసిన రాహుల్

**న్యూఢిల్లీ, మే 19:** ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత వైమానిక దళం ఎన్ని విమానాలను కోల్పోయిందో చెప్పాలని ఎఐసిసి నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. జైశంకర్ ఈ విషయంపై మౌనంగా ఉన్నారని ఆరోపిస్తూ పలు ప్రశ్నలు సంధించారు. విదేశాంగ మంత్రి జైశంకర్ వహించడం కేవలం సమాచారాన్ని వెల్లడించకపోవడం మాత్రమే కాదు. అదొక విపత్కర పరిణామం. మరోసారి అడుగుతున్నాను. పాకిస్థాన్ పై దాడుల గురించి ఆ దేశానికి ముందే తెలియడం వల్ల ఎన్ని భారతీయ విమానాలను కోల్పోయాం? ఇది తప్పిదం కాదు. నేరం. దేశానికి నిజం తెలియాలని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. దీనికి జైశంకర్ గతంలో మాట్లాడిన వీడియోను జోడించారు. మరోవైపు, రాహుల్ గాంధీ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ మాణకం ఠాగూర్ సమర్థించారు. 2025 మే 17న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక నిర్దిష్టమైన ప్రశ్నను అడిగారు. పాక్ కు భారత్ చేసే దాడుల గురించి ముందుగానే తెలుసు కాబట్టి మనం ఎన్ని భారతీయ విమానాలను కోల్పోయాం, ఏ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోనైనా ప్రతిపక్షాలు జాతీయ భద్రత విషయాలను లేవనెత్తినప్పుడు మంత్రులు స్పందించాల్సిన బాధ్యత ఉంటుంది. అయినప్పటికీ విదేశాంగ మంత్రి జైశంకర్ మౌనంగా ఉన్నారు. ఈ నిశ్శబ్దం తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. పాక్ కు ఆపరేషన్ సిందూర్ గురించి ముందుగానే ఎందుకు సమాచారం ఇచ్చారు. ఈ కార్యాచరణ గోప్యత ఉల్లంఘనకు ఎవరు అధికారం ఇచ్చారు దీని కారణంగా మన సాయుధ దళాలు ఎలాంటి పరిణామాలను ఎదుర్కొన్నాయి ఇది దౌత్యపరమైన విషయం కాదు. శత్రువుకు ముందస్తు సమాచారం ఇవ్వడం నేరం. దేశానికి నిజం తెలియాలని మాణికం ఠాకూర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పాక్ ఉగ్రవాద వ్యవస్థలపై గురిపెట్టిన విషయాన్ని ఆపరేషన్ సిందూర్ మొదలుపెట్టడానికి ముందే కేంద్ర సర్కారు ఆ దేశానికి చెప్పి తప్పు చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం విమర్శించారు. ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేయడానికి ముందు పాక్ కు సమాచారం ఇచ్చినట్లు జైశంకర్ చెప్పినట్లు వీడియోలో ఉంది. ఆపరేషన్ ప్రారంభంలో తాము పాక్ కు ఒక సందేశాన్ని పంపించాం. పాక్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేస్తున్నామని, పాక్ సైనిక స్థావరాలపై కాదని చెప్పాం. ఈ దాడుల్లో జోక్యం చేసుకోకుండా పాక్ ఆర్మీ బయట నిలబడే అవకాశం ఉంది. ఆ మంచి సలహాను పాక్ పట్టించుకోలేదని జైశంకర్ వ్యాఖ్యానించారు. అయితే రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై భారత విదేశాంగ శాఖ ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది. ఈ వ్యాఖ్యలు వాస్తవాలను పూర్తిగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఖండించింది. ఆపరేషన్ సిందూర్ మొదలైన తొలి దశలో చేసిన హెచ్చరికను, ఆపరేషన్‌కు ముందు చేసినట్లు ఆరోపించడం తప్పుడు వ్యాఖ్యగా పేర్కొంది.



# జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

## అత్యవసర విచారణకు సుప్రీం అనుమతి

**న్యూఢిల్లీ, మే 19:** జడ్జి ఇంట్లో నోట్ల కట్టల కేసుకు సంబంధించి అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని దాఖలయిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. అంతేకాకుండా ఈ పిటిషన్ అత్యవసర విచారణకు కూడా అనుమతించింది. పిటిషనర్ న్యాయవాది మాథ్యూస్ జె నెడుంపారా తన పిటిషన్‌ను ఇద్దరుసభ్యుల బెంచ్‌కు దాఖలు చేసారు. అత్యవసర విచారణ చేయాలని అన్నారు. చీఫ్‌జస్టిస్ బీఆర్‌గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసిహ్‌ల ఆధ్వర్యంలోని బెంచ్ నెడుంపారా విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంది. లోపాలను సవరిస్తే అత్యవసర విచారణ జరుగుతుందని సీజెఐ తెలిపారు. గతంలో 14వ తేదీ సుప్రీంకోర్టు అత్యవసర విచారణకు అనుమతించలేదు. ఈనెల 8వ తేదీ సుప్రీంకోర్టు నియమించిన హౌస్‌కమిటీ తక్షణమే ఆయన్ను పదవినుంచి తొలగించాలని సిఫారసు చేసింది. రిటైర్డ్ చీఫ్ జస్టిస్ సంజీవ్‌ఖన్నా ఈమేరకు కేంద్రానికి ఆయన్ను పదవీచ్యుతిచేయాలని సిఫారసు కూడా చేసారు. అయితే జస్టిస్ వర్మ తాను వైదొలిగేందుకు నిరాకరించారు. జస్టిస్ వర్మను రాజీనామా చేయాలని కోరారని, ఆయన అంగీకరించకపోవడంతో ఆయన్ను పదవినుంచి తొలగించాలని సిఫారసులు చేసారని, అయితే ఆయన తిరస్కరించినట్లు తెలిపారు. త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికను మాజీ సీజెఐ ఖన్నా రాష్ట్రపతి, ప్రధానమంత్రులకు పంపిస్తూ తాను కూడా స్వయంగా ఆయన్ను తొలగించాలని సిఫారసులుచేసారు. త్రిసభ్య కమిటీ తన నివేదికను ఈనెల 4వ తేదీనే అందచేసింది. దీనితో చీఫ్‌జస్టిస్ వర్మను రాజీనామాచేయాలని కోరారు. ఆయన నిరాకరించడంతో పదవినుంచి తొలగించాలని సిఫారసులుచేసారు. కమిటీ తమ విచారణలో మొత్తం 45 మంది నుంచి వివరాలను సేకరించింది. వీరిలో ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా, ఢిల్లీ ఫైర్‌సర్వీస్ చీఫ్‌ల వాంగ్మూలాలు కూడా ఉన్నాయి. అలాగే కమిటీ సభ్యుల ముందు జస్టిస్ వర్మ తన స్పందన తెలియజేయడానికి నిరాకరించారు. 40 రోజుల తర్వాత కమిటీ తన నివేదికను ఇచ్చింది. గత మార్చి 25న సుప్రీంకోర్టు విచారణకమిటీ నియమించింది. జస్టిస్ షీల్‌నాగు, జస్టిస్ జీఎస్ సంధావాలియా, జస్టిస్ అనుశివరామ్ లతోకూడిన కమిటీని నియమించారు. జస్టిస్ వర్మ తన వాదనగా తాను స్టోర్‌రూమ్‌లో నగదు భద్రంచేయలేదని, తాను కాని తన కుటుంబసభ్యులు కానీ ఎవ్వరూ ఇలా చేయలేదని అన్నారు. అలాగే పట్టుబడిన సొమ్ములు తమవి కావన్నారు. తామే ఇక్కడ పెట్టాని చెప్పడం ముందస్తు వ్యూహంగా ఉందని చెప్పారు. తాను నివసించే ప్రాంతానికి ఈ స్టోర్ రూమ్ దూరంగా ఉంటుందని, మధ్యలో ప్రహరీగోడ కూడా వేరుచేసి ఉంటుందని, తనను ఇరికించేందుకే మీడియా కూడా సొంత విచారణచేసిందని ఆరోపణలు చేసారు.



# మీ క్షమాపణ నటించినట్లుగా ఉంది

## మధ్యప్రదేశ్ ఎంపికి సుప్రీంకోర్టు చీవాట్లు

**న్యూఢిల్లీ, మే 19:** కల్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షా చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి క్షమాపణలను అంగీకరించలేమని చెప్పింది. ప్రజాప్రతినిధిగా ఉన్నప్పుడు ఆచితూచి మాట్లాడాలని బాధ్యతగా ఉండాలని తెలిపింది. కొన్నిసార్లు న్యాయ విచారణను తప్పించుకునేందుకు కొందరు మర్యాదపూర్వకంగా మాట్లాడినట్లు నటిస్తారని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. మరికొన్నిసార్లు మొసలి కన్నీరు కారుస్తారని చెప్పింది. ఇందులో కున్వర్ విజయ్ షా క్షమాపణ ఎలాంటిదని న్యాయస్థానం ప్రశ్నించింది. క్షమాపణలు ఎక్కడ, ఎలా చెప్పారు. క్షమాపణ చెబుతున్నప్పుడు అందులో కొంత అర్థం ఉండాలి. కొన్నిసార్లు న్యాయ విచారణను తప్పించుకునేందుకు కొందరు వ్యక్తులు మర్యాదపూర్వకంగా మాట్లాడినట్లు నటిస్తారు. మరికొన్ని సందర్భాల్లో మొసలి కన్నీరు కారుస్తారు. ఇందులో ఏ కోవకు చెందిన క్షమాపణ ఎలాంటిది. ఏదో న్యాయస్థానం ఆదేశించింది కాబట్టి చెబుతున్నారా అన్నట్లుగా ఉంది మీ వ్యవహారం. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి మీకున్న అభ్యంతరం ఏమిటి అని ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. దేశం మొత్తం సిగ్గుపడుతోంది మీరు ఒక ప్రజాప్రతినిధిగా ఉన్నారు. ఆలోచనపూర్వకంగా బాధ్యతగా ఉండాలి. ప్రతి పదాన్ని ఆలోచించి మాట్లాడాలి. మీరు చేసిన వ్యాఖ్యల కారణంగా దేశం మొత్తం సిగ్గుపడుతోంది. మేము మీ వీడియోలను చూశాం. మీరు చాలా అసభ్యకరమైన భాషను ఉపయోగించారు. మొత్తం దేశం మన సైన్యం పట్ల గర్వంగా ఉందని తీవ్ర స్థాయిలో స్పందించింది. మంత్రి వ్యాఖ్యలపై విచారణకు మధ్యప్రదేశ్‌కు చెందని ఐపీఎస్‌లతో మంగళవారం ఉదయం 10గంటల లోపు సిట్ ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర డీజీపీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ముగ్గురు సీనియర్ ఐపీఎస్ లతో దీన్ని ఏర్పాటు చేయాలని అందులో ఒక మహిళ ఉండాలని పేర్కొంది. ఈ నెల 28 లోగా నివేదిక అందజేయాలని సిట్ ను ఆదేశించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలను వెల్లడించిన కర్నల్ ఖురేషీని ఉద్దేశిస్తూ ఆమెను ఉగ్రవాదుల సోదరి అని విజయ్ షా వ్యాఖ్యానించారు. దీనిపై తీవ్ర దుమారం చెలరేగింది. దీంతో ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు ఆయనపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆ మంత్రి సుప్రీంకోర్టును ఆశ్రయించగా తాజాగా విచారణ సందర్భంగా ఆక్షేపించింది. ప్రస్తుతానికి అరెస్టు నుంచి మినహాయింపు కల్పించిన కోర్టు విచారణకు సహకరించాలని మంత్రిని ఆదేశించింది.



# ఉక్రెయిన్ చర్చలకు వెళ్లేముందు పోప్ లియోను కలిసిన అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్

**వాటికన్‌సిటీ, మే 19:** ఉక్రెయిన్‌పై రష్యా కాల్పుల విరమణ చర్చలకు గాను వెళుతున్న అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ రోమన్‌కాథలిక్ కొత్త మతపెద్ద పోప్ లియో15ను కలుసుకున్నారు. జెడివాన్స్ మోటార్ కాన్వాయ్ వాటికన్ నగరంలోకి ఉదయం ఏడున్నర గంటలకే చేరుకుంది. వాన్స్ కూడా రోమన్ కేథలిక్‌కావడం మొదటి అమెరికా కాథలిక్ మతగురువు పోప్‌గా రావడంతో వీరిద్దరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయనతోపాటే వాటికన్ సిటీకి విదేశాంగమంత్రి మార్కో రుబియో, వాన్స్ అధికారప్రతినిది లూక్ ష్రోడర్‌లు కూడా వాటికన్‌సిటీలో పోప్‌ను కలిసారు. సోమవారం పోప్ లియో తన ప్రారంభ ప్రార్ధనలకుగాను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చినట్లు తెలిపారు. తన పాత డైకోసి పెరులోని చిక్లాయోనుంచి కూడా కొందరు క్రైస్తవ నాయకులు వాటికన్‌సిటీకి వచ్చారు. రష్యా యుద్ధంలో పక్కకుపోయింది. మానవతా ధృక్పథంతో సాయి, ఖైదీల మార్పిడి, రష్యాఅదుపులో ఉన్న ఉక్రెయిన్ చిన్నారులను అప్పగించడం వంటి అంశాలను ప్రస్తావించిన పోప్ ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపివేయాలని కోరుతూ వచ్చారు. జెడివాన్స్ సమక్షంలోకూడా ఇవే అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. శాంతిచర్చలు జరగాలని వాటికన్‌సిటీ ముందనుంచి కోరుకుంటున్నదని పోప్ లియో ఈసందర్భంగా పేర్కొన్నారు. ఆదివారం ప్రార్ధనలు ముగిసిన తర్వాత పోప్ లియోతో కొద్దిసేపు గడిపిన తర్వాత వాన్స్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యూరోపియన్ కమిషనక్ అధ్యక్షురాలు ర్సులా వాండర్‌లేయన్‌లతో చర్చల్లో పాల్గొన్నారు. మాజీ కార్డినల్ రాబర్ట్ ప్రివోస్ట్ అయిన లియో అమెరికాలోని చికాగోలో జన్మించారు. అత్యధిక కాలం పెరూలోని చిక్లాయోలోనే మతపెద్దగా గడిపారు. పోప్‌గా బాధ్యతలుచేపట్టిన మొదటిరోజునుంచి కూడా ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుక కృషి చేస్తామన్నారు. వాన్స్ చర్చల తర్వాతనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, నాటో నాయకులతో ఫోన్‌లోనే చర్చలు జరుపుతారని అమెరికా ప్రతినిధి బృందం తెలిపింది.

# నాథూలా పాస్ మీదుగా మానససరోవర్ యాత్ర

## మొదటి బ్యాచ్‌జూన్ 15న ప్రారంభం

**గ్యాంగ్‌టక్, మే 19:** కైలాస్ మానస్ సరోవర్ యాత్రను నాథూలా పాస్ మీదుగా ప్రారంభించేందుకు కేంద్రం నిర్ణయించింది. టిబెట్ స్వయం ప్రతిపత్తిప్రాంతంలో ఉన్న కైలాసపర్వత యాత్ర, మానససరోవర్ యాత్రలకు ఈసారి నాథూలా పాస్‌నే ఎంపికచేసారు. సిక్కింకు రాష్ట్రహోదా లభించి 50 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా కేంద్రం ఈనిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్రమోడీసైతం సిక్కిం రాష్ట్రహోదా వేడుకలను భారీ ఎత్తున నిర్వహించాలని నిర్ణయిస్తున్న నేపథ్యంలో నాథూలాపాస్‌మీదుగా ఈసారి కైలాస్ మానస్‌సరోవర్ యాత్రను చేపట్టాలని నిర్ణయించారు. విదేశాంగశాఖ వివరాలప్రకారం జూన్‌నుంచి సెప్టెంబరు వరకూ ప్రతి ఏటా రెండు విభిన్న రూట్లలో జరిగే యాత్ర ఈసారి నాథూలా మీదుగా భారీ ఎత్తున నిర్వహించాలని చూస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని లిపూలేఖ్, సిక్కింలోని నాథూలా ప్రాంతాలు మాత్రమే మానస్‌సరోవర్ యాత్రకు అనుకూలంగా ఉంటాయి. వేలాదిమంది హిందూ భక్తులు, జైనులు, బౌద్ధులు ఈ యాత్రకు వస్తుంటారు. మొత్తం ఈ యాత్రకోసం సుమారు పది బ్యాచ్‌ల వరకూ బయలుదేరతాయి. నాథూలాపాస్ మీదుగా జరిగే యాత్ర 21 రోజులుపాటు జరుగుతుంది. ఒక్కొక్క వ్యక్తికి రూ.2.83 లక్షలు వ్యయం అవుతుంది. వచ్చే జూన్ 15న మొదటి బ్యాచ్ ఢిల్లీనుంచి బయలుదేరుతుంది. నాథూలా సరిహద్దు మీదుగా జూన్ 20వ తేదీకి చేరుతుంది. చివరి బ్యాచ్ ఆగస్టు ఏడో తేదీ బయలుదేరి సరిహద్దుకు 12వ తేదీ చేరుతుంది. సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌నుంచి నాథూలా పాస్ పరిసరాలవరకూ సిక్కిం ప్రభుత్వం ఈ యాత్రకు విస్తృత ఏర్పాట్లుచేసింది. నాథూలా పాస్ కాబిలంగ్‌చోక్ నియోజకవర్గం ఎంపి భూటియా పరిధిలోకి వస్తుంది. గ్యాంగ్‌టక్ నాథూలా మధ్య ప్రయాణానికి కూడా ఏర్పాట్లు భారీగాచేసారు. రెస్ట్‌హౌస్‌లు, మరుగుదొడ్లను కూడా నిర్మించారు. ఈ యాత్రను భారత యాత్రీకులకోసం ప్రారంభించారు. భారత పాస్‌పోర్టులు ఉన్న వారు ఈ యాత్రకు అర్హులు. ప్రభుత్వపరంగా ఎలాంటి సబ్సిడీ, ఆర్థికసాయం వంటివి ఉండవు. కొవిడ్ 19 కారణంగా 2020లో ఈ యాత్రను సస్పెండ్‌చేసారు. అలాగే చైనా, భారత్‌లవైపులడక్‌ప్రాంతంలో నిలిచిన మిలిటరీ ప్రతిష్టంభన కారణంగా కూడా మానస్‌సరోవర్ యాత్రనునిలిపివేసారు. ఈ ఏడాది మళ్లీ పునరుద్ధరిస్తున్నారు.




# జన్‌సురాజ్ జాతీయ అధ్యక్షుడుగా ఉదయ్‌సింగ్



**పాట్నా, మే 19:** జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకులు ప్రశాంత్‌కిశోర్ మాజీ బిజెపి ఎంపి ఉదయ్ సింగ్‌ను తమ పార్టీకి మొదటి జాతీయ అధ్యక్షుడుగా ఎంపిక చేసారు. ఆయన పేరును పార్టీ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఇపుడు ఇక ప్రజల్లోకి వెళ్లడంపైనే ప్రాధాన్యతనిస్తామని, సంస్థాగత బాధ్యతలన్నీ ఉదయ్‌సింగ్, ఆరిసిపి సింగ్‌లు పర్యవేక్షిస్తారని ఆయన అన్నారు. బీహార్‌నుంచి తన పాదయాత్రను పునరుద్ధరిస్తానని ఆయన అన్నారు. ఉదయ్‌సింగ్ పార్టీకి రవాణా వసతులు కూడా పర్యవేక్షిస్తారని, ఇందుకోసం ఏర్పాటుచేసిన కమిటీ కూడా ఆయనకు బాధ్యతలు అప్పగించడంపై ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గత ఏడాది అక్టోబరు రెండో తేదీ ప్రారంభించిన జన్‌సురాజ్‌పార్టీ పూర్తిస్థాయి అధ్యక్షుడు లేకుండానే కొనసాగుతోంది. ప్రశాంత్‌కిశోర్ మొదటినుంచి కూడా ఎలాంటి పార్టీ పదవులు తనవద్ద ఉంచుకోనని, తాను చేపట్టనని కూడా చెప్పారు. మాజీ ఐపిఎస్ అధికారి మనోజ్ భర్తీని పార్టీకి వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా నియమించారు. అప్పటినుంచి కూడా పార్టీ కార్యకలాపాలు చూస్తున్నా ప్రశాంత్‌కిశోర్ మాత్రం ప్రజల్లోకి మరింతగా ఎలా చొచ్చుకుపోవాలన్న అంశంపైనే ఫోకస్ పెంచారు.

# బెంగళూరును ముంచెత్తిన భారీ వర్షాలు!



**బెంగళూరు, మే 19:** బెంగళూరులో గత మూడు రోజులు వర్షాలు దంచికొడుతన్నాయి. సోమవారం కురిసిన భారీ వర్షం కారణంగా నగరంలో గోడ కూలి 35 ఏళ్ల మహిళ మృతి చెందింది. అలాగే ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలువురి ఇళ్లు, కార్యాలయాల్లోకి వరదనీరు చేరింది. పలు చోట్ల రోడ్లన్నీ జలమయం అవ్వడంతో జనజీవనం స్తంభించిపోయింది. ఒక పక్క డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్ కూడా రద్దయిపోయింది. శాంతినగర్‌లోని సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ సీసీబీ కార్యాలయం వర్షపు నీటిలో మునిగిపోయింది. పలు కీలక పత్రాలు నీటిలో తడిసిముద్దాయ్యాయి. భద్రతా కారణాల దృష్ట్యా సీసీబీని చామరాజ్‌పేట్ నుంచి శాంతినగర్‌కు మార్చారు. కార్యాలయంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో మోకాలిలోతు నీరు చేరింది. బెంగళూరులో ఇప్పటివరకు అత్యంత వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో హోరామావులోని సాయి లేఅవుట్ ఒకటి. శనివారం కురిసిన వర్షానికి లేఅవుట్‌లో 4 నుంచి 5 అడుగుల నీటిలో మునిగిపోయింది, దీని వల్ల వీధుల్లో మోకాళ్ల లోతు నీరు చేరిందని అధికారులు తెలిపారు. హోరామావు, కావేరీ నగర్, సంపంగి రాంనగర్ సహా అనేక లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. నీటిని తొలగించడంలో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మూసుకుపోయిన డ్రైనేజీలను బాగుచేయాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు వాటిని శుభ్రం చేయలేదని నగరవాసులు పేర్కొన్నారు. బెంగళూరులో గత 24 గంటల్లో నగరంలో దాదాపు 104 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ గణాంకాలు చెబుతున్నాయి. భారీ వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపవడం వల్లే తీవ్ర నష్టం జరిగినట్లు ప్రతిపక్ష బీజేపీ ఆరోపించింది. బీజేపీ చేసిన విమర్శలపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. వర్షాల సమయంలో బెంగళూరులో ఈఇబ్బందులు కొత్తేమీ కాదని చెప్పారు. తమ ప్రభుత్వం దీర్ఘకాలిక పరిష్కారానికి కృషి చేస్తోందని చెప్పారు. బీజేపీ అధికార ప్రతినిధి అశ్వత్ నారాయణ్ గౌడ మాట్లాడుతూ, వారంక్రితం భారీ వర్షపాతం ఉంటుందని ఐఎండీ హెచ్చరించినా, ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదన్నారు. వర్షబీభత్సానికి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బాధ్యత తీసుకోవాలని విమర్శించారు.

# ఆరు దశాబ్దాల తర్వాత ఇజ్రాయెల్‌కు 'గూఢచారి' వస్తువులు



**టెల్‌అవీవ్, మే 19:** ఇజ్రాయెల్‌కు చెందిన గూఢచారి ఎలి కోహెన్‌కు సంబంధించిన వేలాది వస్తువులను 60 యేళ్ల తర్వాత సిరియా నుంచి టెల్‌అవీవ్ సొంతం చేసుకొంది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా వెల్లడించారు. ఆయన భార్య నాడియో కోహెన్‌తో నెతన్యాహు వాటిని పంచుకున్నారు. 'ఎలి కోహెన్‌ను ఉరి తీసిన 60 యేళ్ల తర్వాత నేను నాడియా కోహెన్‌ను కలిశాను. కోహెన్ వస్తువులను తీసుకొచ్చేందుకు మొస్సాద్ ఒక ప్రత్యేకమైన ఆపరేషన్ నిర్వహించింది. దాదాపు 2,500 వస్తువులను తిరిగి తీసుకొచ్చాం. అందులో కోహెన్‌కు సంబంధించిన వ్యక్తిగత వస్తువులు, ఆయన స్వయంగా రాసిన లేఖలు ఉన్నాయి. కోహెన్ ఒక హీరో. ఒక గొప్ప గూఢచారి. మా బందీలను తీసుకొచ్చేందుకు మేము అవిశ్రాంతంగా శ్రమిస్తాం' అని నెతన్యాహు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోహెన్ మృతదేహాన్ని తిరిగి తీసుకురావాలని నాడియా నెతన్యాహును కోరారు.

**ఎవరీ ఎలి కోహెన్..** ఎలి కోహెన్ ఇజ్రాయెల్‌కు చెందిన గూఢచారి. 1960లో సిరియాలోని రాజకీయ, సైనిక వ్యవహారాల్లో ఎలి కోహెన్ సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. ఆ తర్వాత సిరియా రక్షణమంత్రికి అగ్ర సలహాదారుడిగా ఎదిగాడు. 1965లో ఇజ్రాయెల్‌కు రేడియో ద్వారా సమాచారం పంపుతూ సిరియన్ నిఘా సంస్థలకు పట్టుబడ్డాడు. కొన్ని రోజు విచారణ తర్వాత అదే యేడాది మే 18న డమాస్కస్‌లో అతడిని ఉరితీశారు. అతడి మృతదేహాన్ని ఇప్పటివరకు ఇజ్రాయెల్‌కు అప్పగించలేదు. అయితే, కోహెన్‌ను టెల్‌అవీవ్‌లో హీరోగా పరిగణిస్తారు. కోహెన్ పట్టుబడిన తర్వాత సిరియన్ నిఘా సంస్థలు ఆయనకు సంబం ధించిన అనేక వస్తువులను స్వాధీనం చేసుకున్నాయి. అందులో పలు కీలక పత్రాలు, రికార్డింగ్‌లు, ఫొటోలు, వ్యక్తిగత వస్తువులు, ఇజ్రా యెల్‌లోని అతని కుటుంబానికి రాసిన లేఖలు ఉన్నాయి. వీటన్నింటినే తాజాగా టెల్‌అవీవ్ సొంతం చేసుకుంది.

ఇక, గతవారం నాలుగు దశాబ్దాలుగా కనిపించకుండా పోయిన ఓ సైనికుడి మృతదేహాన్ని సిరియా నుంచి టెల్‌అవీవ్ స్వాధీనం చేసుకుంది. అతడు 1982లో లెబనాన్-సిరియా దళాల మధ్య జరిగిన ఘర్షణల్లో మరణించినట్లు తెలుస్తోంది.

# సరిహద్దు గ్రామాల్లో ఎటుచూసినా ధ్వంసమైన ఇళ్లే

## సాయం కోసం ఎదురుచూస్తున్న నివాసితులు



**పూంచ్,రాజౌరి, మే 19:** సరిహద్దు జిల్లాలయిన పూంచ్, రాజౌరిల్లో పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పులకు వేలాది ఇళ్లు ధ్వంసం అయ్యాయి. సరిహద్దుల్లో సుమారు పదివేలకుపైగా ఇళ్లు ధ్వంసం అయ్యాయని కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సైతం అంగీకరించిన సంగతి తెలిసిందే. ప్రజలు వారి అదృష్టం అనుసరించి ఈ కాల్పులనుంచి బయటపడ్డారని, భారత్; పాకిస్తాన్ దళాల దాడుల్లో సరిహద్దుల్లో ఉన్న కుటుంబాలు భయంభయంతో గడిపాయని అక్కడి ప్రజలు చెపుతున్నారు. పూంచ్ మాజీ సెక్రటరీ జనరల్ సూర్జన్‌సింగ్ మాట్లాడుతూ కంఖామొహల్లాలో తమకు ఉన్న ఇంటిలో ఆరోజు నిద్రిస్తున్నామని, ఏడోతేదీ తమ ఇంటి పైకప్పు పైకి ఒక మోర్టార్ వచ్చిపడిందని అన్నారు. దీనితో శ్లాబ్‌మొత్తం ఛిద్రం అయిం దన్నారు. తనతోపాటు సమీపంలో ఉన్న ఇళ్లను కూడా ధ్వంసంచేసాయన్నారు. తన సోదరుడు మాజీ సైనికుడు అమర్‌జీత్‌సింగ్ తన ఇంట్లోని రెండో అంతస్తులో నిలుచుని ఉన్నాడని, పౌరు గింటి వాళ్లకు హెచ్చరికలు చేస్తూ కనిపించాడని, అయితే ఆయనే బుల్లెట్ల బారినపడి చనిపోయాడన్నారు. ఊపిరితిత్తులు, కడుపులో బుల్లెట్లు దిగి తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఆసుపత్రికి తరలించిన రెండుగంటల్లోపే చనిపోయినట్లు ఇక్రమ్ అనే మరో నివాసి చెప్పాడు. ఉత్తర కాశ్మీర్‌లోని ఊరినుంచి పూంచ్, రాజౌరి, జమ్ము జిల్లాల్లోనే ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో పాకిస్తాన్ సైన్యం దాడులకు తీవ్ర నష్టంజరిగింది. పూంఛ్‌లోని గురుద్వారా ప్రాంతంలో కూడా బాంబులు పడ్డాయని, గురుద్వారా అద్దాలు, కిటికీలను ధ్వంసంచేసాయని, గురుద్వారా సమీపంలోనే నివసిస్తున్న జగ్‌జీత్‌సింగ్ తన ఇంటి అంతస్తులు రెండింటిని కూడా పాకిస్తాన్ కాల్పుల్లో ధ్వంసం చేసారని, బెడ్‌రూమ్, గ్రౌండ్‌ఫ్లోర్ రెండూ కూడా విచ్ఛిన్నం అయ్యా యన్నారు. రాజౌరి జిల్లాలో అయితే ఏకంగా జిల్లా అదనపు కమిషనర్ రాజ్‌కుమార్ థప్పా కాల్పుల్లో ప్రాణాలు వదిలారు. ఆయన అధికారిక నివాసం రాజౌరి పట్టణంలో ఉంది. పక్కగది లోనే ఉన్న ఆయన ముగ్గురు సహాయకులు, సెక్యూరిటీ గార్డు మాత్రం తప్పించుకోగలిగారు. ఈ ప్రాంతం లోనే అనేక ఇళ్లు పాక్ కాల్పులకు విపరీతంగా దెబ్బతిన్నాయి. ఇదేవిధంగా సరిహద్దు జిల్లాల్లో వాస్తవాధీన రేఖవెంబడి ఉన్న ఇళ్లు పొలాలు కూడా విపరీతంగా దెబ్బతిన్నట్లు జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్య మంత్రిలకు నివేదికలందాయి. దెబ్బతిన్న ఇళ్ల పునర్నిర్మాణానికి సాయం చేస్తామని ముఖ్య మంత్రి ప్రకటించినా లెఫ్టినెంట్ గవర్నర్‌నుంచి మాత్రం ఎలాంటి స్పందన రాకపోవడంతో సరిహద్దుగ్రామాల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సంభాల్‌మసీదు సర్వే నిలిపివేయాలన్న పిటిషన్ తిరస్కృతి

## దిగువకోర్టు ఉత్తర్వులను సమర్ధించిన అలహాబాద్ హైకోర్టు

**లక్నో, మే 19:** హరిహరమందిరాన్ని కూల్చివేసి ఆస్థలంలో సంభాల్ మసీదు నిర్మించారని పేర్కొంటూ దాఖలయిన పిటిషన్లపై దిగువకోర్టు ఇచ్చిన సర్వే ఉత్తర్వులపై సంభాల్ షాహి మా మసీదు కమిటీ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. దిగువకోర్టు సోమవారమే ఉత్తర్వులు జారీచేసింది. అలహాబాద్ హైకోర్టు బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ దిగువకోర్టు ఉత్తర్వులను సమర్ధించారు. మసీదు సర్వేచేయాలనడం సహేతుకమేనని అన్నారు. హిందూ కక్షిదారులు దాఖలు చేసిన పిటిషన్ విచారణ అర్హమైనని అన్నారు. గత ఏడాది నవంబరు 19న సంభాల్ సివిల్‌జడ్జి ఆదిత్య సింగ్ మసీదు సర్వేకు ఆదేశించారు. ఇందుకోసం అడ్వకేట్ కమిషనర్ రమేష్‌సింగ్ రాఘవ్‌ను కూడా నియమించింది. హైకోర్టు తన తీర్పును ఈనెల 13వ తేదీ రిజర్వులో ఉంచింది. అంతకుముందు జనవరి 8వ తేదీ మసీదు సర్వేపై తాత్కాలిక స్టేను మంజూరు చేసింది.



అధికారులతో సమీక్షిస్తున్న ఇఓ

## భక్తుల సౌకర్యాలకు పెద్దపీట: ఇఓ వికె శీనా నాయక్ ఆదేశాలు

**ఇంద్రకీలాద్రి, మే 19, ప్రభాతవార్త** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారిని దర్శించుకోడానికి వచ్చే భక్తుల సౌకర్యానికి పెద్దపీట వేయాలని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థాని ఇఓ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు . సోమవారం ఆయన ఆలయాధికారులతో విస్తృతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తుల సంతృప్త స్థాయిపెంపు, గౌరవంగా మెలగడం, సాంకేతికతో భక్తులకు మెరుగైన సేవలం దించడం పై అంశాలవారీగా చర్చించి ఇంకా మెరుగ్గా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఇ కోటేశ్వర రావు, ఎఇఓలు పి చంద్రశేఖర్, ఎన్ రమేష్ బాబు, జె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

## నాణ్యతతో కూడిన వైద్యం ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి అనగాని సత్యప్రసాద్

**విజయవాడ, మే 19, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం నేషనల్ హెల్త్ మిషన్ బ్లడ్ సెల్, విజయవాడ హీమోఫిలియా సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ హయత్ ప్లేస్లో నిర్వహించిన రెండు రోజుల బ్లీడింగ్ డిజార్డర్స్ కాన్ఫరెన్స్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హీమోఫిలియా వంటి అరుదైన వ్యాధికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. హీమోఫీలియా సొసైటీ విజయవాడ చాప్టర్ కార్యదర్శి డా ఎంబిఎస్వి ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడలో 1100 మంది, విశాఖలో 900 మంది హీమోఫీలియాతో జీవనం సాగిస్తున్నారని, వీరికి వైద్య, ఆర్థిక, మానసిక, సామాజిక సాయం అందిస్తామన్నారు. సిఎంసి (నెల్లూరు), ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునోహిమటాలజి (ముంబై) వంటి కొన్ని కేంద్రాల్లో మాత్రమే అందించే జీన్స్ ఆధారిత, రోగ నిర్ధారణ సేవలందిస్తామన్నారు.

## వేగంగా 'శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు' అభివృద్ధి పనులు : మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రా ప్రాంత బౌద్ధచైతన్య గాథలను,ఒక నాటి చారిత్రక విశిష్టతను విశ్వవ్యాప్తం చేసే దిశలో "శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు "అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు ఏపీ పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకుని వస్తామని దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా ఘంటసాలలో గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన ఈ ప్రాజెక్టు గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మధ్యలోనే ఆగిపోయిందని మంత్రి తెలిపారు.కూటమి ప్రభుత్వం ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో అన్ని వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. బౌద్ధ ధర్మానికి ప్రతీకగా నిలిచే అతి కొద్ది ప్రాంతాల్లో కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని ఘంటసాల గ్రామం ఒకటి. ఈ ప్రాంత ప్రాచీన బౌద్ధ చరిత్ర నేపథ్యాన్ని గౌరవిస్తూ గతంలో టీడీపీ ప్రభుత్వం ఇక్కడ గౌతమ బుద్ధుని మహాపరి నిర్యాణానికి గుర్తుగా 2017లో శయన బుద్ధవిహార్ ప్రాజెక్టును చేపట్టింది. అప్పట్లో ప్రభుత్వం కోటిన్నర రూపాయలు కేటాయించగా ఘంటసాలకు చెందిన ప్రవాసాంధ్రుడు గొర్రెపాటి రంగనాథ్ 2.2 ఎకరాల స్థలాన్ని పర్యాటక శాఖకు విరాళంగా అందజేశారు.గతంలో టీడీపీ ప్రభుత్వ హయంలో ఈ ప్రాజెక్ట్ అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.అనంతరం 2019-24 నడుమ అసంపూర్తిగా నిలిచిపోయిన శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు స్థలంలోనే ఇటీవల నిర్వహించిన బౌద్ధ జయంతి వేడుకలు నిర్వహించామన్నారు.. రాష్ట్రంలో బుద్ధుడు నడయాడిన ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. శయన బుద్ధ ప్రాజెక్టు మనం ఇక్కడ చూస్తున్నాము.

అసంపూర్తిగా మిగిలి ఉంది. దీని విషయంలో మనం నిర్ణయం తీసుకోవాలి. అటు విశాఖపట్నంలోనూ పలు ప్రాంతాలు ఉన్నాయి. ఇవన్నీ బౌద్ధాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చాయి. ఈ ప్రాంతాలలో మరింతగా అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని మంత్రి తెలిపారు. 2017 సెప్టెంబర్ 16న ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

## పోక్సో, గ్యాంగ్ రేప్ కేసుల్లో 169 మంది నిందితులకు కఠిన శిక్షలు - డిజిపి హరీష్ కుమార్ గుప్తా

### - మహిళలపై జరిగే వ్యవస్థీకృత నేరాలను అరికట్టడానికి ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఏర్పాటు

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పలు నేరాలకు సంబంధించి ,నమోదు చేసిన క్రిమినల్ కేసుల్లో నిందితులకు శిక్షపడే విధంగా సాక్ష్యాధారాలను సేకరించడంలో పోలీసు విజయవంతమైందని ఏపీ డీజీపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు.ఆ మేరకు ఆయన సోమవారం మీడియాకు సమాచార పత్రం విడుదల చేసారు.నేర నిరూపణలో సాంకేతికత వినియోగం,చురుగ్గా సాక్ష్యాలను గుర్తించి కేసులను పటిష్టంగా రూపొందించడంలో పోలీసు అడుగులు వేస్తోందన్నారు.గడిచిన 10 నెలల్లో పోక్సో , వరకట్న హత్యలు, మహిళల హత్యలు, రేప్,గ్యాంగ్ రేప్ కేసుల్లో 169 మంది నిందితులకు న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధించడం జరిగిందని తెలిపారు. మహిళలు, బాలికల భద్రతకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. మహిళలపై జరిగే వ్యవస్థీకృత నేరాలను అరికట్టడానికి ఐజీ రాజకుమారి నేతృతంలో ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మహిళలకు శక్తి యాప్ను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. మహిళల భద్రతకై అత్యంత అధునాతన ఫీచర్లు కలిగిన 'శక్తి యాప్ ఇపుడు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో యూజర్లకు అందుబాటులో ఉండటంతో పాటుగా ప్లేస్టోర్(అండ్రాయిడ్ ఫోన్), ఐఓఎస్(ఆపిల్ఫోన్) నుండి యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. శక్తి యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 1,52,16,440 మంది శక్తి యాప్ ను తమ మొబైల్ లో డౌన్ లోడ్ చేసుకోవడం జరిగిందన్నారు. అత్యవసర సహాయం కోసం (ఎస్ఓఎస్) 11,60,146 మంది కాల్ చేయగా వీటిలో 34,192 తక్షణమే స్పందించవలసిన కాల్స్ గా నమోదు చేసుకొని, 3,193 ఎఫ్ఐఆర్ లు నమోదు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఈ యాప్ ద్వారా 242 ఫ్యామిలీ కౌన్సిలింగ్ రిక్వెస్టులు, సేఫ్ ట్రావెల్ కోసం 160,



తప్పిపోయిన పిల్లల కోసం 18 మంది ఈ యాప్ ద్వారా రిపోర్టు చేయడం జరిగిందన్నారు. మహిళల భద్రతకై రాష్ట్రవ్యాప్తంగా ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో 164 శక్తి టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## విజన్ 2047 లక్ష్యసాధనలో ప్రజా సమస్యల పరిష్కారమే తొలిమెట్టు

### - అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు :కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



**జగ్గయ్యపేట, మే 19, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047 లక్ష్యసాధనలో ప్రజా సమస్యల పరిష్కారమే తొలిమెట్టుగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అందవచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవంటూ ఎన్టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీ శ ప్రభుత్వ యంత్రాంగాన్ని హెచ్చరించారు. జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్లోగల బి కన్వెన్షన్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశతోపాటు తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కెడిసిసి బ్యాంక్ చైర్మన్గా నియమితులైన మాజీమంత్రి నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నందిగామ ఆర్డిఓ బాలకృష్ణ, గ్రామ-వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి జ్యోతి, డిఆర్డిఏ పిడి ఏఎన్వి నాంచారరావు, డిసిఓ పి లావణ్యకుమారి, డిఎస్పిలు ఏబిజి తిలక్, వెంకటేశ్వరరావు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. సభలో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో సంతృప్తి అనేది అత్యంత ప్రధానమన్నారు. సమస్య తప్పనిసరిగా పరిష్కారం అవుతుందనే భరోసాను అధికారులు కల్పించాలన్నారు. నిబద్ధత, నాణ్యమైన విధంగా అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మొత్తం 461 అర్జీలను స్వీకరించటం జరిగిందని, వీటిలో నందిగామ మండలానికి చెందినవి 38, చందర్లపాడు నుండి 8, వీరులపాడు నుండి 4, కంచికచర్ల నుండి 8, పెనుగంచిప్రోలు నుండి 56, వత్సవాయి నుండి 44, జగ్గయ్యపేట మండలం నుండి అత్యధికంగా 222, మిగిలినవి ఇతర మండలాల నుండి అందినట్లు కలెక్టర్ ప్రకటించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన మార్గనిర్దేశనం చేయటం జరిగిందన్నారు. ఈనామ్ భూముల సమస్యలలు పెండింగ్లోవున్నాయని ప్రధానంగా జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల్లో బాధితులు ఎక్కువ మందిఇబ్బందులు పడుతున్నారని రంగాపురం నరసింహారావు, బాధిత బృంద సభ్యులు కలెక్టర్కు ఫిర్యాదు సమర్పించారు.



## మల్టివేరియేట్ డేటా విశ్లేషణపై వర్క్షాప్

**శ్రీకాళహస్తి,మే 19 ప్రభాతవార్త** తిరుపతి ఐఐటి సాంకేతిక రంగంలో పరుగులు తీస్తుంది. ఈ నేపధ్యంలో రక రకాల పరిశోధనలకు పునాదులేస్తుంది. తిరుపతి ఐఐటిని సుమారు 540 ఎకరాల్లో స్థాపించటం జరిగిందని డైరెక్టర్ ప్రొఫేసర్ సత్యనారాయణ వివరించారు. సోమవారం ఇక్కడ పరిశోధనా పద్దతి మరియు మల్టివేరియేట్ డేటా విశ్లేషణపై వర్క్ షాప్ను నిర్వహించారు.ఐఐటిలోని హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం సారధ్యంలో ఐదు రోజుల వర్క్షాప్ను ఏర్పాటు చేసారు.ఈ నెల 23వ తేది వరకు నిర్వహించే కార్యక్రమాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నిర్వాహాకులు తెలిపారు.ఈ వర్క్షాప్ను విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ బహినిపతి పర్యవేక్షణలో డీన్ ప్రొఫేసర్ ముత్తుకుమార్ పళనిస్వామి ప్రారంభించారు.ఈ కార్యక్రమాలకు 50మంది హాజరయ్యారు. ఈ వర్క్షాప్కు దేశ వ్యాప్తంగా ఉన్న పిహెచ్డి ,పరిశోధనా విద్యార్థులు,ప్యాకల్టీ సభ్యులు హాజరౌతారని వివరించారు. అంతేకాక ఇంజనీరింగ్,నిర్వహణ, లైఫ్సైన్సె స్,హ్యూమానిటీస్తో సహా విభిన్న నేపథ్యాలను చెందిన వారు ఉన్నట్లు వివరించారు.సెషన్లను ఐఐటి ఫ్యాకల్టీ సభ్యులు నిర్వహిస్తారని వివరించారు.ఈ ప్రారంభ కార్యక్రమాల్లో అధ్యాపక సభ్యులు డాక్టర్ వనీత్ కశ్యప్ డాక్టర్ విష్ణు,సి,రాజన్ సమన్వయం చేసారు.

## ప్రతి పథకాన్ని ప్రజలకు అందచేస్తాం!

### కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



**కావలి (నెల్లూరు), మే 19, ప్రభాతవార్త :** ప్రతి పథకాన్ని ప్రజలకు అందచేస్తామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని దొడ్లమనోహర్రెడ్డి కళ్యాణమండపంలో సోమవారం మినీమహానాడు హోరెత్తింది. ఎన్టిఆర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల కాలంలో మృతిచెందిన టిడిపి కుటుంబసభ్యులకు నివాళులర్పించి రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. వైసిపి అరాచకాలకు తట్టుకోలేక టిడిపిలోకి వలసలు పెరుగుతున్నాయన్నారు. ఒక సిద్ధాంతంతో నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ టిడిపి అన్నారు. సంక్షేమ పథకాల ఫలాలలను ప్రజలకు అందచేస్తూ బలహీనవర్గాల అభివృద్ధికోసం ఒక అజెండాతో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు స్థాపించిన పార్టీ మన తెలుగుదేశంపార్టీ అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి నియోజకవర్గంలో దామవరం విమానాశ్రయం, రామాయపట్నం పోర్టు, బిపిసియల్ కంపెనీని నిర్మిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. అలాగే బిట్రగుంటలో వందేభారత్ సర్వీస్సెంటర్, మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్, కేంద్రీయ విద్యాలయం కావాలని నాయకులు తీర్మానించారన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి త్వరలోనే అన్ని వచ్చేలా ఏర్పాటుచేస్తామన్నారు. కావలి రూరల్ మండలానికి, అల్లూరుకు సంబంధించి రాజుపాలెం నుంచి రామాయపట్నం పోర్టువరకు అల్లూరు బైపాస్తో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్మీదుగా జాతీయరహదారి నాలుగులైన్ల నిర్మాణానికి తీర్మానం చేయడం జరిగిందన్నారు.

## విజయవాడ ఆటోనగర్లో ఉచిత కార్మిక పాఠశాల ప్రారంభం

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** కార్మికులకు ఉచిత శిక్షణ నిమిత్తం విజయవాడ ఆటోనగర్లో కార్మిక పాఠశాల ప్రారంభోత్సవం జరిగింది.ఆటోనగర్ టెక్నీషియన్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఈ పాఠశాలను ప్రముఖ న్యూరాలజిస్టు డా. గోపాలం శివన్నారాయణ ప్రారంభించారు. ముఖ్య అతిధులుగా అసోషియేషన్ అధ్యక్షులు రాజనాల బాబ్జి.,గౌరవ అధ్యక్షులు బాయన వెంకట్రావు, కార్యదర్శి టి.వి. నాగేశ్వరరావు వారితో పాటు తాడేపల్లిలో భగత్ సింగ్ లైబ్రరీ స్టడీ సెంటర్ నిర్వాహకులు ప్రొఫెసర్ బి శ్రీనివాస రావు , కార్మిక పాఠశాల బాధ్యులు రావేళ్ల లక్ష్మణరావులు పాల్గొన్నారు. కార్మిక పాఠశాల ముఖ్య నిర్వాహకులుగా ఆర్ రఘు గారు సభకు అధ్యక్షత వహిస్తూ ఆటోనగర్లో ఉచిత కార్మిక పాఠశాల ప్రారంభించాల్సి న అవసరం గురించి మాట్లాడారు. విజయవాడ ఆటోనగర్, ఆసియాఖండంలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడగా పేరుగాంచిందన్నారు. మహిళా కార్మికులతో సహా సుమారు లక్ష మంది మన ఆటోనగర్ లో జీవనం సాగిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు ఉన్నారు. కృష్ణా గుంటూరు జిల్లాల్లోని దూరప్రాంతాల నుండి కూడా శ్రామికులు రోజు ద్విచక్ర వాహనాల మీద ఆటోలలో, బస్సులలో, రైళ్ళలలో కూడా పనికి వస్తున్నారు. వీరిలో అత్యధిక మందికి తమ విద్యార్హతలు నైపుణ్యం, పర్సనాలిటీ డెవలప్మెంట్ పెంచుకోవాలన్నారు.

## వైద్యం వికటించి బాలింత మృతి

**కావలి (నెల్లూరు), మే 19, ప్రభాతవార్త :** కావలి పట్టణ ఏరియా వైద్యశాలలో వైద్యం వికటించి బాలింత రావినూతల సునీత (30) మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలతో కావలి ఏరియా వైద్యశాల దద్దరిల్లింది. న్యాయం జరిగేవరకు ఇక్కడినుంచి వెళ్లేదిలేదంటూ బాధితులు వైద్యశాల ఆవరణంలో బైఠాయించిన సంఘటన సోమవారం కావలిలో తీవ్రసంచలనం సృషించింది. వైద్యశాల ఆవరణం ఉద్రిక్తతగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. వివరాలిలా ఉన్నాయి. కుటుంబనియంత్రణ ఆపరేషన్ కోసం వస్తే వైద్యులు శవాన్ని అప్పగించారని బాధితులు గగ్గోలు పెట్టారు. కావలి మున్సిపాలిటి పరిధిలోని మద్దూరుపాడుకు చెందిన బాలింత రావినూతల సునీత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం సోమవారం కావలి ఏరియా వైద్యశాలకు వచ్చారు. థియేటర్లోకి తీసుకువెళ్లిన పది నిముషాలకే శవాన్ని ఇచ్చారని బాధితులు ఆరోపించారు. అనస్థీషియా ఇచ్చామని రికవరి అవుతుందని సెలైన్ కడుతున్నామని మాయమాటలు చెప్పి వైద్యులు మోసగించారన్నారు. అనస్థీషియా కోసం 700 రూపాయలు డబ్బులు కూడా తీసుకున్నారని బాధితులు తెలిపారు. బయటనుంచి మందులు కూడా తమచేత తెప్పించారని కుటుంబసభ్యులు రోదిస్తూ తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం మూలంగానే తమ బిడ్డ చనిపోయిందని వైద్యశాలముందు కుటుంబసభ్యులు నిరసన నినాదాలతో గందరగోళం సృష్టించారు. మృతురాలి శరీరం చల్లగా ఉందని డాక్టర్లకు చెప్పినా పట్టించుకోలేదని గగ్గోలు పెట్టారు. మృతురాలు సునీతకు రెండునెలల బాబు అని, తల్లిలేని ఈ బిడ్డ పరిస్థితి ఏమిటని కుటుంబసభ్యులు రోదించారు. నిర్లక్ష్యంగా వైద్యసేవలు అందించి శవాన్ని అందచేసిన డాక్టర్లపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## మండల కమిటీల్లో యువతకు ప్రాధాన్యత

### అమరావతి నిర్మాణానికి శ్రీకాళహస్తి నుంచి శ్రీకారం

**శ్రీకాళహస్తి,మే 19 ప్రభాతవార్త** రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మండల,పట్టణ కమిటీల్లో మూడు సార్లు పదవులు అనభవించిన వారికి గుడ్బై చెబుతున్నామని యువతకు,మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్రెడ్డి అన్నారు. భారత దేశంలోనే ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'అమరావతి నిర్మాణంలో' శ్రీకాళహస్తి ప్రజల్ని భాగస్వాముల్ని చేద్దామని ఇక్కడి నుంచి శ్రీకారం చుడుతామని ఆయన పిలుపు నిచ్చారు. ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు కడపజిల్లా కమలాపురం నియోజకవర్గంలోని సికె దిన్నెలో జరగనున్న మహానాడుకు వెళ్ళటానికి ఏర్పాట్లును సమీక్షిం చుటకు శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్రెడ్డి సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం విభజించి సుమారు 12 సంవత్సరాలైనా ఇప్పటి వరకు రాజధాని లేదన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా 'అమరావతిని రాజధానిగా' నిర్మించుటకు నిర్ణయించారన్నారు.

అయితే మన రాష్ట్రాన్ని ఐదేళ్ళ పాటు పరిపాలించిన నాయకుడు బటన్ నొక్కుడుతో అప్పుల పాల్జేసారని కాబట్టి మనం అందరం కలసి రాజధాని నిర్మాణానికి సహకరిద్దామని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. రూపాయి నుంచి మనకు ఎంత తోచితే అంత రాజధాని నిర్మాణానికి సిఎం సహాయ నిధికి పంపుతామని శాసనసభ్యుడు సుధీర్రెడ్డి పిలుపు నిచ్చారు. పరిపాలన అంతా మండల నాయకుల చేతిల్లోనే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరి పాలన అంతా ఆయా మండలాల్లోని నాయకుల చేతుల్లో పెట్టానని సుధీర్రెడ్డి వివరించారు.

## నకిలీ పేరుతో మోనికా బేడీకి పాస్పోర్టు

### -కృష్ణమోహన్రెడ్డి తహసీల్దార్గా ఉన్నప్పుడే జారీ

### - అప్పట్లో కర్నూలు ఎస్పీగా పిఎస్ఆర్ ఆంజనేయులు

**విజయవాడ,మే 19,ప్రభాతవార్త ప్రతినిధి:** రెండున్నర దశాబ్ధాల క్రితం దేశవ్యాప్తంగా,అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన అండర్ వరల్డ్ మాఫియా డాన్ అబూసలేం ప్రియురాలు,సినీనటి మోనికా బేడీకి నకిలీ పేరుతో పాస్పోర్టు జారీ చేసిన వ్యవహారం...మద్యం కుంభకోణం కేసులో తాజాగా అరెస్టైన జగన్ ఓఎస్టీ పెళ్ళకూరు కృష్ణమోహన్రెడ్డి కర్నూలు తహసీల్ధారుగా ఉన్నప్పుడే జరిగిందని సిట్ అధికారులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. ఆ దిశలోను ఆయనను విచారించేందుకు సిట్ సన్నద్ధమవుతుంది..సనా మాలిక్ కమల్ పేరిట మోనికా బేడీకీ 2001 ఏప్రిల్ 9న నివాస ధృవీకరణ పత్రాన్ని ఆయనే జారీ చేశారు. కర్నూలు లోని బాబూ గౌండ వీధిలో నివాసం ఉంటున్నట్లు తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చారు. దాన్ని అడ్డం పెట్టుకునే మోనికా బేడీ పాస్పోర్టు పొందగలిగారు. తన ప్రియుడు,1993 నాటి ముంబయి పేళుళ్ళ ఘటనలో కీలక పాత్రధారి,దేశద్రోహానికి సంబంధించి పలు కేసుల్లో అభియోగాలున్న అబూ సలేంతో కలిసి 2002లో పోర్చుగల్కు పారిపోయి, అక్కడి పోలీసులకు పట్టుబడ్డారు. ఆ తర్వాత తీగ లాగితే కర్నూలు కేంద్రంగానే ఈ నకిలీ పాస్పోర్టుల తయారీకి బీజం పడినట్లు వెలుగుచూసింది.

## లగ్జరీ హోటళ్లలో బస.. ఖరీదైన కార్లలో రాకపోకలు

### పలుమార్లు పాక్కు వెళ్లి ఐఎస్ఐ అధికారులతో భేటీలు

### దర్యాప్తులో వెలుగులోకి వస్తున్న యూట్యూబర్ జ్యోతి లీలలు

**న్యూఢిల్లీ, మే 19:** దాయాది దేశం పాకిస్థాన్కు గూఢచారిగా వ్యవహరించిందన్న ఆరోపణలపై అరెస్ట్ అయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో హరియాణా పోలీసులు దర్యాప్తు ముమ్మరంచేసారు. దేశద్రోహ కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఆమెను పాకిస్థాన్ ఐఎస్ఐ ఏజెంట్లు తమ అస్త్రంగా మలుచుకున్నట్లు పోలీసులు తేల్చారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆమె పాక్ రాయబార కార్యాలయంలో పనిచేసే అధికారితో సంప్రదింపులు జరిపినట్లు నిర్ధారించారు. ఈ మేరకు హిసార్ ఎస్పీ శశాంక్ కుమార్ సావర్ మాట్లాడుతూ జ్యోతి మల్హోత్రా సైనిక లేదా రక్షణ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం వారితో పంచుకుందని ప్రస్తుత దశలో చెప్పలేమన్నారు. కానీ, పాక్ నిఘా వర్గాలతో ఐఎస్ఐతో ఆమె నేరుగా సంప్రదింపులు జరిపారని చెప్పారు. వాళ్ల ఆమెను ఓ అస్త్రంగా చేసుకున్నారని కచ్చితంగా చెప్పగలమన్నారు. జ్యోతి ఇతర యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్స ర్లతో కూడా టచ్లో ఉన్నట్లు గుర్తించారు. వాళ్ల కూడా పీఐవోలతో సంప్రదింపులు జరుపుతు న్నారని అన్నారు. ఇది కూడా ఓ రకమైన యుద్ధమేనని తెలిపారు. ఇన్ఫ్లుయెన్సర్లను నియమించు కుంటూ వారి ప్రయత్నాలను అమలు చేస్తారని అన్నారు. జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్లో పలుమార్లు పర్యటించిందని, ఓసారి చైనాకూ వెళ్లి వచ్చిందన్నారు. ఇటీవల బహిష్కరణకు గురైన పాకిస్థాన్ అధికారి డానిష్తో కూడా ఆమె టచ్లో ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఇప్పుడు ఆర్థిక లావాదేవీలు, ప్రయాణ వివరాలు విశ్లేషిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆమె రాబడికి మించిన స్థాయిలో ఖర్చులచేసారని, ఖరీదైన రెస్టారెంట్లు, లగ్జరీ హోటళ్లలోనే బసచేసినట్లు తేలింది.చైనా పర్యటనల్లో కూడా ఆమె ఖరీదైన కార్లలో ప్రయాణించినట్లు గుర్తించారు. ఆమె ల్యాప్టాప్ సహా ఎలక్ట్రానిక్ పరికరాలపై ఫోరెన్సిక్ విశ్లేషణ చేస్తున్నారు. ఏం సమాచారం పంచుకుందనే విషయం అప్పుడు స్పష్టమవుతుందని పేర్కొన్నారు.గతంలో పూరీకి చెందిన మరో యూట్యూబర్తో జ్యోతికి ఉన్న సంబంధంపై ఒడిశా పోలీ సులు దర్యాప్తు ప్రారంభించారు. సెప్టెంబర్లో పూరీ సందర్శిం చారని, అక్కడ మరో మహిళా యూట్యూ బర్ను కలిసినట్లు గుర్తించామని ఒడిశా లోని పూరీ ఎస్పీ వినీత్ అగర్వాల్ వెల్లడించారు. పూరీకి చెందిన సదరు యూట్యూ బర్ ఇటీవల పాకిస్థాన్లోని కర్తార్పూర్ సాహిబ్ గురు ద్వారాను సందర్శించారని తేలింది. అయితే ప్రియాంక సేనాపతి అనే ఈ యూట్యూబర్ జ్యోతి తనకు కేవలం స్నేహితురాలు మాత్రమేనని యూట్యూబ్ ద్వారానే పరిచయమన్నారు. ఇదిలా ఉంటే జ్యోతి తండ్రి హ్యారిస్ మల్హోత్రా మాట్లాడుతూ యూ ట్యూబ్ విడియోల కోసం పాకిస్థాన్ వెళ్లిందన్నారు. అందుకు అవసరమైన అనుమతులు తీసుకున్నదని చెప్పిన ఆయన స్వాధీనం చేసుకున్న తమ ఫోన్లు ఇవ్వాలన్నారు. పాక్ అధికారుల పేర్లను హిందూ పేర్లతో ఫోన్బుక్లో సేవ్చేసినటు కూడా హర్యానా పోలీసులు తెలుసుకున్నారు. వాట్సాప్, స్నాప్చాట్, టెలిగ్రామ్ వంటి సాయంతోనే ఆమె సంప్రదింపులు జరిపింది. అన్నింటి కంటే ముఖ్యంగా పహల్గాంవ్లో జరిగిన దాడికి ముందే ఆమె ఆప్రాంతంలో పర్యటించి విడియోలు చేసిందని, ఆవిడియోలు వైరల్ అయిన తర్వాతనే పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర వాదుల దాడులు జరిగాయని పోలీసులు ధ్రువీకరించారు.




తలసీమియా,సికిల్సెల్ అనీమియా,హిమోఫీలియా వ్యాధులపై అవగాహన పోస్టర్లును ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

## జన్యుపరంగా వచ్చే వ్యాధులను సైతం నియంత్రించే స్థితిలో అనేక ఆవిష్కరణలు

### వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** జన్యుపరంగా వచ్చే వ్యాధులను సైతం నియంత్రించే స్థితిలో వైద్యరంగంలో అనేక ఆవిష్కరణలు అందుబాటులోకి వచ్చాయని రాష్ట్ర మెడికల్,హెల్ మినిష్టర్ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు.వీటిని రోగులకు అందుబాటులోకి తీసుకుని వచ్చే దిశలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని తమ ప్రభుత్వం ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోడీలోని కేంద్ర ప్రభుత్వం ఇందుకు పూర్తి స్థాయి సహకారం అందిస్తుందన్నారు.ఏ వ్యాధినైనా నివారించే పరిస్థితి ఉండక పోవచ్చునేమోగాని,ముందుగా గుర్తిస్తే నియంత్రించగలమన్నారు.తలసీమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫీలియా వ్యాధులు జన్యుపరంగా వచ్చేవన్నారు.వీటిపై ఇంకా ప్రజల్లో అవగాహన కల్పించాల్సి న అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుణదల హయత్ ప్లేస్ హోటల్ లో సోమవారం రక్త సంబంధిత వ్యాధుల నిర్ధారణ మరియు చికిత్సలో ఆధునిక పద్ధతులపై రెండు రోజుల శిక్షణ, అవగాహనా కార్యక్రమాన్ని నేషనల్ హెల్త్ మిషన్, హీమోఫోలియా సొసైటీ లు సంయుక్తంగా ఏర్పాటు చేశారు. రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే అగ్ర స్థానంలో నిలపాలన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అని అన్నారు. రాష్ట్రంలో దాదాపు 1900 మంది హిమోఫీలియా బాధితులున్నారని, దాదాపు 2,100 మంది తలసీమియాతోను,ఇదే సంఖ్యలో సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారన్నారు. ఇది జన్యుపరంగా వారసత్వంగా వస్తున్న వ్యాధి అని, దీనికి మందులు వాడుతూనే ఉండాల్సి న అవసరం ఉందన్నారు. వ్యాధిని ముందుగా గుర్తించడం చాలా ముఖ్యమన్నారు. బాధితుల్ని గుర్తించి వారికి క్రమం తప్పకుండా ఉచితంగా రక్త మార్పిడిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలోని 5 ఐసిహెచ్యస్ సెంటర్ల ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్నామన్నారు. వ్యాధి నిర్ణారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స, మందులు అందిస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తలసీమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫీలియా వ్యాధులు బారినపడిన వారికి నెలకు రూ. 10 వేల పెన్షన్ కూడా అందిస్తుందన్నారు. రాష్ట్రంలో 40 సంవత్సరాల లోపు ఉన్న గిరిజన ప్రాంతాల్లో ప్రజలు 19 లక్షల మందికి సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ చేయాల్సి ఉండగా 10 లక్షల 50 వేల మందికి ఇప్పటి వరకు స్క్రీనింగ్ చేశామన్నారు, ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని త్వరలోనే దీనిని పూర్తి చేయల్సి న అవసరం ఉందన్నారు. ఇందులో 19,000 మంది పైగా క్యారియర్స్ ఉన్నారన్నారు. 2,100 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యిందన్నారు. జన్యుపరమైన సికిల్సెల్ ఎనీమియా స్క్రీనింగ్ తర్వాత గుర్తింపు కార్డులిస్తున్నామన్నారు. నోడల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఇది కొత్త ఆవిష్కరణలకు దారితీసే విధంగా ఉపయోగపడుతుందన్నారు. తలసీమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ ఎనీమియా విభాగాల్లో మరింత అవగాహన కల్పించేందుకు రెండు రోజుల ఓరియెంటేషన్ వైద్యులకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. వైద్య సేవలు మరింత మందికి ఉచితంగా అందించడంతోపాటు లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# ఘనంగా పిడుగులమ్మ తల్లి జాతర మహోత్సవాలు

**కాకినాడ టౌన్ , మే 19 ( ప్రభాతవార్త ) :**



కాకినాడ సంజయ్ నగర్ లో వేంచేసిన శ్రీ శ్రీ పిడుగులమ్మ తల్లి 43వ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుచున్న ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించి తరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ 3వ వార్డు మాజీ కార్పొరేటర్ ఉమ్మి బాలాజీ పాల్గొని అమ్మవారి జాతర మహోత్సవాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజయ్ నగర్ చుట్టుపక్కల ప్రాంత ఇలవేల్పుగా వెలుగొందుతున్న శ్రీ శ్రీ పిడుగులమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు మే 17 నుండి 20 తేదీ వరకు జరుగుతున్నాయని అందులో భాగంగా ఆదివారం రాత్రి 8 గంటలకు జబర్దస్త్ ఈవెంట్ ఆర్గనైజేషన్ మరియు రేలారే రేలా కార్యక్రమం నిర్వాహకులు చే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని .సోమవారం అధిక సంఖ్యలో మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారని అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు డ్రా ద్వారా వెండి ప్రతిమను బహుకరించడం జరిగిందని. అనంతరం భక్తులకు అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారనీ తెలిపారు . ఈ కార్యక్రమంలో 93 బీసీ కులాల రాష్ట్ర అధ్యక్షులు మాకిరెడ్డి భాస్కర్ , టిడిపి సిటీ సెక్రటరీ మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత రమేష్ , ఆలయ ప్రెసిడెంట్ బాసి రమణారెడ్డి , ఉత్సవ కమిటీ చైర్మన్ పలివెల బాబ్జి , తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రజలపై మల్లన్న ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే పూజలు



**గోపాలపురం , మే 19 ( ప్రభాతవార్త ) :**

శ్రీశైలంలోని శ్రీమల్లికార్జున జ్యోతిర్లింగం శ్రీభ్రామరి శక్తి పీటంలోని మల్లన్నను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు దర్శించుకున్నారు. స్వామి వారికి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. రాష్ట్ర ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం చంద్రబాబుకు స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని ఎమ్మెల్యే ప్రార్ధించారు. ఆలయ అర్చకులు స్వామి వారి ఆశీస్సులు ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యుద్ధనపూడి బ్రహ్మారాజు, ద్వారకాతిరుమల మండల తెదేపా అధ్యక్షులు లంక సత్యనారాయణ, నాయకులు పసుమర్తి రతీష్, పోలీన శ్రీను, తదితరులు ఎమ్మెల్యే వెంట ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు.

# ప్రతిపక్ష పార్టీ ఆరోపణలను తిప్పి కొట్టడంలో వెనకబడి ఉన్నాం : సుబ్రహ్మణ్యం

**అంబాజీపేట , మే 19 ( ప్రభాతవార్త ) :**



రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్ష వైసిపి సామాజిక మాధ్యమాలు,మీడియా ద్వారా చేస్తున్న ఆరోపణలను తిప్పి కొట్టడంలో వెనకబడి ఉన్నామని, గత ఏడాది జరిగిన ఎన్నికల్లో టిడిపి మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఖచ్చితంగా అమలు చేస్తామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. అంబాజీపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు అధ్యక్షతన నియోజకవర్గ మహానాడు సోమవారం జరిగింది. ఈ మహానాడు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుబ్రమణ్యం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్థికంగా కుదేలైన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం నిలబెట్టేందుకు 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని దేశం నలుమూలలా విస్తరింపజేసిన వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని మహానాడు సమావేశంలో తీర్మానించారు. టిడిపి మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఇప్పటికే కొన్ని అమలు జరిపామని, మరికొన్ని వచ్చే నెల నుండి అమలు చేస్తామన్నారు. ఈ నెల 22న అమలాపురం కాపు కళ్యాణ మండపంలో జరిగే పార్లమెంటు మహానాడుకు నియోజవర్గ టిడిపి శ్రేణులు తరలిరావాలని రెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు.అలాగే సభ్యులు సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాలన్నింటిని ఈ నెల 27, 28, 29లో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి టీడీపీ మహానాడులో ప్రవేశపెడతామన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కో-కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. అలాగే టిడిపి సీనియర్ నాయకులు అరిగెల బలరామమూర్తి పలు తీర్మానాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తొలుత టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై డైరెక్టర్ మోకా ఆనంద సాగర్, శెట్టిబలిజి కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, మాచవరం సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, నియోజవర్గ పరిశీలకులు షేక్ సుభాన్, నాయకులు మద్దాల సుబ్బారావు, గణపతి వీర రాఘవులు, చిట్టూరి శ్రీనివాస్, దంతులూరి శ్రీను రాజు, మొల్లేటి శ్రీనివాస్, గూడాల ఫణి, అంబటి భూలక్ష్మి, సేరు శ్రీను, రవణం రాము,చిన్నం బాల విజయారావు, నేదునూరి వీర్రాజు, పెంద్ర రమేష్, చిట్టుగుళ్ల కిషోర్, సంసాని పెద్దిరాజు, మేడిది శ్రీనివాసరావు, కొప్పినీడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ర్యాలి జగన్మోహిని కేశవస్వామి శ్రవణా నక్షత్ర మాస కళ్యాణంతో సకల శుభాలు

**ఆత్రేయపురం , మే 19 ( ప్రభాతవార్త ) :**



స్వయంభు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి, గోపాల స్వామి వారి ఆలయం నందు శ్రవణా నక్షత్ర మాస కళ్యాణంను అర్చకులు, వేద పండితులు వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. తదుపరి మాస కళ్యాణం 15న జరుగుతుందని,కావున భక్తులు వివాహం, సంతానం, విద్య, ఉద్యోగం, బదిలీ, పదోన్నతి, విదేశీయానాం, ఆరోగ్యం, వ్యాపారం మొదలగు కోరికల కొరకు శ్రీ స్వామి వారి మాస కళ్యాణంలో పాల్గొవాలని, కావున భక్తులు 91 99113 34733 నంబరునకు సంప్రదించి ఆన్లైన్ ద్వారా రుసుము రూ.750/- లు చెల్లించి పూజనందు పాల్గొని. ప్రసాదం పోస్టు ద్వారా పంపిస్తామనిఆలయ కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి తెలియజేశారు.

# సుందరయ్య సేవలు మహోన్నతం



**కాట్రేనికోన , మే 19 ( ప్రభాతవార్త ) :**

ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని సిపిఎం మండల కార్యదర్శి విత్తనాల రాంబాబు,విపర్తి మోహన్ రావు ఆధ్వర్యంలో ఘణంగా నిర్వహించారు.మందుగా సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .సుందరయ్య వర్ధంతి సందర్భంగా పల్లంకుర్రు బిల్డింగ్, కనస్ట్రక్షన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వరంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, యూనియన్ అధ్యక్షులు గంజా సత్తిబాబు ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా విత్తనాల రాంబాబు, విప్పర్తి మోహన్ రావు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకుడు,మొదటి పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడని కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు,ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ రాజు,జేమ్స్ పాల్,కృష్ణ,మంగా దేవి,దివ్య భారతి, చిన్నబాబు,అర్జున్ రావు,ప్రసాద్, రమేష్,వెంకట రమణ,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ సెలబ్రేషన్' ప్రకటించిన టొయోటా కిర్లోస్కర్

**రాజమహేంద్రవరం , మే 19 ( ప్రభాతవార్త ) :**

సీజన్ కోసం తమ 'మెగా సమ్మర్ సెలబ్రేషన్' ను టొయోటా ప్రారంభించింది. ఇది దక్షిణ భారతదేశంలోని అధీకృత టొయోటా డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంటుందని టొయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ సౌత్ రీజియన్ చీఫ్ రిప్రజెంటేటివ్ వైస్‌లైన్ సిగామణి చెప్పారు. కొత్త కారు కొనడం, ఉన్న కార్లకు సర్వీసింగ్ చేయడం, సర్టిఫైడ్ యూజ్డ్ కార్లను గుర్తించటం లేదా వాహన ఉపకరణాలను అప్‌గ్రేడ్ చేయడం , ఆకర్షణీయమైన డీల్‌ను పొందటం దీనితో సాధ్యమవుతుందన్నారు. మెగా సమ్మర్ సెలబ్రేషన్' లో భాగంగా తమ "కస్టమర్-ఫస్ట్" సిద్ధాంతానికి కట్టుబడి, వేసవి నెలల్లో కొత్త టొయోటా కార్లు, టొయోటా కార్ సర్వీస్, ఉపయోగించిన కార్ల కొనుగోలుపై కస్టమర్‌లకు విలువను అందించడం ఈ ప్రచారం లక్ష్యం అన్నారు. ఈ మెగా సమ్మర్ సెలబ్రేషన్ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణలలో టయోటా యొక్క అధీకృత డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉందన్నారు. టొయోటా కిర్లోస్కర్ మోటర్‌లో అసాధారణమైన వాహనాలను అందించడంపై మాత్రమే కాదు, ప్రతి కస్టమర్ టచ్ పాయింట్‌ను సౌలభ్యం, సంరక్షణ మరియు సంతృప్తితో పెంచడానికి కట్టుబడి ఉండటం లక్ష్యం అన్నారు. 'మెగా సమ్మర్ సెలబ్రేషన్'తో, టొయోటా యాజమాన్య అనుభవానికి మరింత విలువను తీసుకురావాలని, ఈ వేడుకలో భాగంగా, తాము ఉచిత కార్ హెల్త్ చెకప్‌ను కూడా అందిస్తున్నామన్నారు. తద్వారా కస్టమర్లు నమ్మకంగా, ఉత్సాహంగా మనశ్శాంతితో ఈ వేసవిలో డ్రైవ్ చేయవచ్చు అని చెప్పారు.


# సేంద్రియ విధానంలో సాగుచేసిన పంటలను కొనుగోలు చేయాలి : ఈఓపిఆర్డి

**మామిడికుదురు , మే 19 ( ప్రభాతవార్త ) :**



సేంద్రియ విధానంలో సాగుచేసిన పంటలను కొనుగోలు చేసి రైతులను ప్రోత్సహించాలని ఈఓపిఆర్డి అడబాల శ్రీనివాస్ సూచించారు. మామిడికుదురులో సోమవారం రైతు సాధికార సంస్థ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సేంద్రీయ పద్ధతిలో సాగు చేసి పండించిన పంటల స్టాల్ ను ఆయన సందర్శించారు. సేంద్రీయ విధానంలో పండించిన ఉత్పత్తులను ఆయన కొనుగోలు చేశారు. ప్రతి ఒక్కరూ ఈ ఉత్పత్తులనే వినియోగించాలన్నారు.

# రూ.26 లక్షలతో పంట కాలువల అభివృద్ధి పనులు



**మామిడికుదురు , మే 19 ( ప్రభాతవార్త ) :**

మామిడికుదురు మండల పరిధిలోని పంట కాలువల అభివృద్ధికి రూ.26 లక్షల నిధులు మంజూరయ్యాయని ఇరిగేషన్ ఏఈ సుందర్ సింగ్ పేర్కొన్నారు.మానేపల్లి నుంచి పాశర్లపూడి వరకు పది కిలోమీటర్ల పొడవున కాలువలో పూడిక తీత పనులకు రూ.10 లక్షలు మంజూరు చేశారు.ఈ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. మామిడికుదురులో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మరో రూ.పది లక్షలు మంజూరయ్యాయన్నారు. మగటపల్లి లూటుకుర్రు కాలువల పూడికతీతకు రూ. ఆరు లక్షలు మంజూరు చేశారు.

## పాశర్లపూడిలంకలో డ్రిల్లింగ్ పరిశోధనలు



**మామిడికుదురు , మే 19 ( ప్రభాతవార్త ) :**

మామిడికుదురు మండలం పాశర్లపూడి లంక లోగ్యాస్ నిక్షేపాలకోసం ఓఎన్జిసి డ్రిల్లింగ్ పరిశో ధనలు చేపట్టింది.ఈ-2000-3 రిగ్గుతో ఇక్కడ డీవియేషన్ ప్రక్రియ ద్వారా వైనతేయ గోదావరి నది అంతర్భాగంలోకి డ్రిల్లింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సైట్‌లో రెండు బావులనుంచి గ్యాస్ ఉత్పత్తి అవుతుంది.మరో బావి నిరుపయోగంగా మారిం ది.అదే సైటులో నాలుగవ బావిలో డ్రిల్లింగ్ చేస్తున్నారు. 2, 910మీటర్ల లక్ష్యం మేరకు డ్రిల్లింగ్ చేయాల్సిఉంది.

## రావులపాలెంలో వాడపల్లి వెంకన్న ముఖద్వార నిర్మాణానికి శంకుస్థాపన



**రావులపాలెం , మే 19 ( ప్రభాతవార్త ) :**

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్లో ముఖద్వార నిర్మాణానికి సోమవారం శంఖుస్థాపన చేసారు. కళా వెంకట్రావు విగ్రహా సమీపంలో ఊబలంక వైపు వెళ్ళే రోడ్డు ప్రారంభంలో ముఖద్వారం నిర్మాణానికి దాత సి.ఎం.ఆర్ ఛైర్మన్ మావూరి వెంకటరమణ దంపతులు, దేవస్థానం డిప్యూటీ కమిషనర్, కార్య నిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధర రావు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## "పాడా" లో పీజీఆర్ఎస్ కు 49 అర్జీలు



**పిఠాపురం , మే 19 ( ప్రభాతవార్త ) :**

పిఠాపురం ఏరియా డవలప్మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి పాల్గొని, ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా పాడా పీడీ చైత్ర వర్షిణి మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ అంశాలపై 49 అర్జీలు అందాయన్నారు.ఇందులో రెవెన్యూ -13, మునిసిపాలిటీ-25, ఇతర శాఖలు -11 వచ్చాయని,ఆమె తెలిపారు. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీ వసంత మాధవి, పిఠాపురం కమిషనర్ కనకారావు, తహసీల్దార్ గోపాలకృష్ణ,ఇతర శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులు మానుకోవాలి : జమ్మలమడక నాగమణి

**కాకినాడ రూరల్ , మే 19 ( ప్రభాతవార్త ) :**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులు మానుకొని, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పరిపాలన సాగించాలని వైకాపా రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. లిక్కర్ కుంభకోణంలో మాజీ ఐఏఎస్ అధికారి జగన్మోహన్ రెడ్డి పర్సనల్ సెక్రెటరీ ధనుంజయ రెడ్డిని, కృష్ణమోహన్ రెడ్డి లను అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం కూటమి ప్రభుత్వ కక్షసాధింపు ధోరణికి అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అన్నారు. కేవలం జగన్మోహన్ రెడ్డి మీద కక్ష సాధింపులో భాగంగానే చంద్రబాబు ప్రభుత్వం జగన్ అనుచరులను, వైసిపి నాయకులను వేధిస్తుందని, కూటమి ప్రభుత్వానికి ప్రజలు అధికారం ఇచ్చింది రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని చూసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అని అయితే ఈ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలి కక్ష పూరిత ధోరణిలో వైసీపీ నాయకులపైన గత ప్రభుత్వం లో పని చేసిన అధికారుల పైన మంత్రులపైన అక్రమ కేసులు బనాయిస్తుందని అన్నారు. ఇకనైనా కక్షపూరిత రాజకీయాలు మాని ప్రజా సంక్షేమం, అభివృద్ధి పైన దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

# మైనర్లు వాహనాలు నడిపితే సిజ్ చేస్తాం : ఎస్ఐ అవినాష్



**కాట్రేనికొన , మే 19 ( ప్రభాతవార్త ) :**

మైనర్ లు బైకులు,ఇతర వాహనాలను నడిపితే ఉపేక్షించేది లేదని,ఆయా వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామని కాట్రేనికొన ఎస్ఐ అవినాష్ హెచ్చరించారు.ఇటీవల కాలంలో సమీప ప్రాంతాల్లో మైనర్‌లు వాహనాలు నడుపుతు ప్రమాదాల బారిన పడుతున్న ఘటనపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పి స్పందించారు. పోలీసు స్టేషన్ల పరిధిలోను గ్రామాల్లో వాహన తనిఖీలు చేపట్టి మైనర్ల డ్రైవింగ్‌ను నియంత్రించాలని ఆదేశాలిచ్చారని తల్లిదం డ్రులు కూడా తమ పిల్లలకు స్కూటీలు. బైకులు ఇవ్వడం మానుకోవా లన్నారు.లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు.18ఏళ్లలోపు మైనర్ లు బైకులు,స్కూటీల డ్రైవింగ్ కు దూరంగా ఉండాలని, ప్రమాదాల నివారణ లక్ష్యంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

# అంతర్జాతీయ ధరలకే కోకో గింజలను కొనుగోలు చేయాలి

**అంబాజీపేట , మే 19 ( ప్రభాతవార్త ) :**



అంతర్జాతీయ ధరలకే కోకో గింజలను కొనుగోలు చేయాలని, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి తరువాత అధికంగా సాగు చేస్తున్న కోకో గింజల కొనుగోళ్లకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర కోకో సాగురైతు సంఘ సహాయ కార్యదర్శి కొప్పిశెట్టి ఆనందవెంకటప్రసాద్ డిమాండ్ చేశారు. అంబాజీపేట కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో జిల్లా కోకో రైతుల సమావేశం జిల్లా బీకేఎస్ అధ్యక్షులు చేకూరి సూర్య నారాయణ రాజు అధ్యక్షతన సోమ వారం జరిగింది. ఈ సందర్భం గా ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం కోకో సాగు కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి రైతులను ప్రోత్సహిస్తుం దని, కాని కోకో గింజల విషయంలో కొనుగోళ్ళ కేంద్రాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కేవలం కొన్ని ప్రవేట్ కంపెనీలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు నచ్చిన ధరలకే కొనుగోళ్లు చేస్తున్నారని దీని వల్ల రైతులు తీవ్రనష్ట పోతున్నారన్నారు.

కోకో రైతులకు పెట్టుబడులు కూడా రావడంలేదన్నారు. కోకో గింజలకు ప్రస్తుతం అంతర్జాతీయ ధర కేజీ రూ.940లు ఉండగా ప్రైవేట్ వ్యక్తులు కేజీ రూ.500లోపు కొనుగోళ్ళు చేస్తున్నారని, అంతర్జాతీయ ధరకే కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా విదేశీ గింజల దిగుమతులు నిలుపుదల చెయ్యాలని ధరలు నిర్ణయించే వరకూ రైతులు,కంపెనీలు కొనుగోళ్ళు,అమ్మకాలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కోకో రైతుల సంఘం అధ్యక్షులు ఉప్పుగంటి భాస్కరరావు, రైతులు దంగేటి గిరిధర్, అడబాల రాజమోహన్, రెడ్డి రామకృష్ణ, అయ్యగారి శ్రీనివాస్, సరెళ్ళ అప్పారావు, ప్రకాష్, సమయవంతుల పండు తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి కి ఐదు బంగారు పంచ పాత్రలు, వెండి కంచం బహుకరణ




**ఆత్రేయపురం , మే 19 ( ప్రభాతవార్త ) :**
ప్రముఖ పుణ్యక్షేత్రం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి కొత్తపేట వాస్తవ్యులు మంతెన వెంకట సూర్య సుబ్బరాజు కుటుంబ సభ్యులు శ్రీ స్వామి వారికి 209.84 మిల్లీ గ్రాముల ఐదు బంగారు పంచ పాత్రలు,318 గ్రాములు వెండి కంచం సోమవారం దేవస్థానం డిప్యూటీ కమీషనర్, ఈఓ నల్లం సూర్య చక్రధరరావు, అర్చకులు కు అందజేశారు. ముందుగా వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద అచీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, ప్రసాదలను అందజేశారు.

## ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్

**కాకినాడ టౌన్ , మే 19 ( ప్రభాతవార్త ) :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన ఏపి ఈఏపిసెట్-2025 ఆన్లైన్ ప్రవేశ పరీక్ష మొదటి రోజు మే 19వ తేదీ సోమవారం నుండి రాష్ట్రవ్యాప్తంగా మరియు హైదరాబాద్లో ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఏపి ఈఏపి సెట్ చైర్మన్ మరియు ఉపకులపతి ప్రొ. సిఎస్ఆర్కే.ప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్ఎకె. ప్రసాద్ యూనివర్శిటీ అధికారులు, ఏపి ఈఎపిసెట్ కన్వీనర్ ప్రొ.వి.వి. సుబ్బారావు, కో-కన్వీనర్లు మరియు కో-ఆర్డినేటర్లతో కలిసి సెట్ కోర్ను విడుదల చేసి పరీక్ష నిర్వహణా తీరును పరిశీలించారు.మొదటి రోజు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మరియు హైదరాబాద్లో ప్రారంభమైన ఏపి ఈఏపి సెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఈఏపిసెట్ చైర్మన్ మరియు ఉపకులపతి ప్రొ. సిఎస్ఆర్ కె. ప్రసాద్ తెలిపారు.అగ్రికల్చర్ %డ% ఫార్మశీ విభాగానికి సంబంధించి మొదటి రోజు సోమవారం ఉదయం 20,461 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 18,724 మంది పరీక్షకు హాజరయ్యారని, 1737 మంది గైర్హాజరైనట్లు కన్వీనర్ ప్రొ.వి.వి. సుబ్బారావు తెలిపారు. మొత్తం 91.51 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. అలాగే సోమవారం మధ్యాహ్నం 20,456 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 18,931 మంది పరీక్షకు హాజరయ్యారని, 1525 మంది గైర్హాజరు కాగా మొత్తం 92.54 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. మొత్తంగా 40,917మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 37,655 మంది పరీక్షకు హాజరయ్యారని, 3262మంది గైర్హాజరు కాగా 92.03శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.అలాగే కాకినాడ జిల్లాలో అగ్రికల్చర్ & ఫార్మశీ విభాగానికి సంబంధించి మొదటి రోజు సోమవారం ఉదయం 922 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 844మంది పరీక్షకు హాజరయ్యారని, 78 మంది గైర్హాజరైనట్లు కన్వీనర్ ప్రొ.వి.వి. సుబ్బారావు తెలిపారు. మొత్తం 91.54శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. అలాగే సోమవారం మధ్యాహ్నం 923 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 869మంది పరీక్షకు హాజరయ్యారని, 54మంది గైర్హాజరు కాగా మొత్తం 94.15 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. మొత్తంగా 1845 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1713మంది పరీక్షకు హాజరయ్యారని, 132మంది గైర్హాజరు కాగా 92.85 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు తెలియజేశారు.

## సర్పంచ్ ల గౌరవాన్ని పెంచిన ప్రధాని నరేంద్ర మోడీ



**కొత్తపేట రూరల్ , మే 19 ( ప్రభాతవార్త ) :**
పల్లెలే దేశానికి పట్టు కొమ్మలు గ్రామాల అభివృద్ధి చెందుతేనే దేశం ప్రగతి సాధిస్తుంది అవి ఆరోగ్యంగా ఉంటేనే దేశం సౌభాగ్యంగా ఉంటుందని మహాత్ముడు కలలను నిజం చేసేందుకు గ్రామ పంచాయితీలకు నేరుగా నిధులు వేసి స్వచ్ఛత మెరవాలి పల్లెలు మురవాలని పంచాయితీలకు నేరుగా నిధులిచ్చిన ఘనత బిజెపిదేనని రాష్ట్ర కార్యవర్గసభ్యులు పాలూరి సత్యానందం అన్నారు. కేంద్రప్రభుత్వం పంచాయితీలకు ఆనాడు నేరుగా నిధులిచ్చి అభివృద్ధిచేస్తే ఈనాడు గ్రామ సర్పంచులకే ఉపాధి నిధుల చెల్లింపులు చేసేలా పవరిచ్చిన ఘనత ప్రధాని నరేంద్రమోడీదేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ఆదేశం రాష్ట్రంలో ఉపాధి నిధులను గ్రామ సర్పంచుల ఆధ్వర్యాన చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆర్థిక వికేంద్రీకరణ విభాగం డైరెక్టర్ రామ్ ప్రతాప్ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఎపి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల కోసం మెటీరియల్ సప్లైదారులకు చెల్లించే నిధులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఒ) ద్వారా చెల్లించే విధానం 2021లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే ఈ విధానం సరికాదని కేంద్ర మంత్రిత్వశాఖ సర్పంచులు ద్వారా చెల్లించడానికి ఆదేశాలు వచ్చాయన్నారు.

## పదిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి ఆర్థిక సాయం

**అంబాజీపేట , మే 19 ( ప్రభాతవార్త ) :**
మండలంలోని ముక్కామల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి 500 మార్కులు సాధించి, కొత్తపేట ప్రభుత్వ కాలేజీలో ఇంటర్మీడియట్ చేరిన సాకా దుర్గాభవానికి సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి కుమార్డు బండారు మల్లిబాబు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. ముక్కామల జెడ్పీ హైస్కూల్లో 500 మార్కులకు పైగా సాధించిన పదవ తరగతి విద్యార్థులు ఐదుగుర్ని సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చదువుపై మక్కువ ఉన్న దుర్గాభవానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవడంతో మల్లిబాబు ఆర్థిక సాయం



అందించి ప్రోత్సహించారు.ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని దుర్గా భవాని తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్యులు రంగారావును సత్కరించిన వాకర్స్ హెల్త్ క్లబ్

**కోనసీమ బ్యూరో , మే 19 ( ప్రభాతవార్త ) :**
అంతర్జాతీయ కుటుంబ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ గొలకొటి రంగారావు కుటుంబ సభ్యులను వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షతన సత్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, ఏవీపీ గోకర కొండ నాగేంద్ర, సెక్రెటరీ బురగాయల శివరామకృష్ణ, ట్రెజరర్ పడాల నాయుడు, ఉపాధ్యక్షులు నూకల సత్యనారాయణ, చింతలపూడి సత్తిబాబు, గుర్రం రామకృష్ణ, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పట్నాల రమణ, వాసిరెడ్డి సుబ్రమణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

**మండపేట రూరల్ , మే 19 ( ప్రభాతవార్త ) :**
నాగుల చెరువు గ్రామంలో శ్రీ గోపాల కృష్ణ స్వామి, శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవం ఘనంగా జరిగింది.కపిలేశ్వరపురం మండలం నాగుల చెరువు గ్రామంలో శ్రీ గోపాల కృష్ణ స్వామి విగ్రహ జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. శ్రీ వీరాంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవ కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మండపేట నియోజక వర్గ వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి శ్రద్ధలతో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ, ఈ ప్రతిష్ఠ ఉత్సవం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందిస్తుందని పేర్కొన్నారు.

## కొత్తపేట తెలుగుదేశం పార్టీ మహానాడు

**కొత్తపేట రూరల్ , మే 19 ( ప్రభాతవార్త ) :**
కొత్తపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మహానాడు సోమవారం కొత్తపేట కాపు కళ్యాణమండపం నందు రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా నియోజకవర్గంలో 56,789 నందు సభ్యత్వాలు నమో దయ్యాయి. నియోజకవర్గంలో 262 పోలింగ్ బూత్ లు గాను 8,396 మంది కుటుంబ సంక్షేమ సారదులుగా నియమితులయ్యారు. 262 బూత్ లకు కన్వీనర్లు, 262 మంది బూత్ కో కో కన్వీనర్లు నియమితులయ్యారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి 51 యూనిట్ లకు 51 మంది యూనిట్ ఇన్చార్జిలు ,51 మంది కో ఇన్చార్జిలు నియామకం జరిగింది. నియోజకవర్గంలో 10 క్లస్టర్ లకు గాను పదిమంది క్లస్టర్ ఇన్చార్జిలు, పదిమంది కో ఇంఛార్జిలు నియమితులయ్యారు. ఒక పోల్ కోఆర్డినేటర్ నియామకం జరిగింది. 57 గ్రామాలకు గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి నియమించుకోవడం జరిగింది. కార్యవర్గాలను ఎంపిక చేశాం. గ్రామస్థాయిలో మెయిన్ కమిటీతో పాటు తెలుగు మహిళ, తెలుగు యువత, బిసి సెల్, ఎస్సీ సెల్, తెలుగు రైతు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నియమించుకున్నామన్నారు. మండలాలకు సంబంధించి అధ్యక్షుడు, ప్రధాన




కార్యదర్శితో పాటు ఇద్దరు ఉపాధ్యక్షులు, ముగ్గురు కార్యనిర్వాహక కార్యదర్శిలు, ముగ్గురు కార్యదర్శిలు కోశాధికారితో కలిపి పదిమంది కమిటీ ఏర్పాటు చేయవలసింది.తదుపరి మండలంలో 14 అనుబంధ సంఘాలు ఏర్పాటు చేసుకుందాం అన్నారు. కొత్తపేట నియోజకవర్గ పార్టీ అనుబంధ సంఘాలను ఏర్పాటు చేసుకొని జిల్లా కమిటీ ,జిల్లా అనుబంధ సంఘాలను పూర్తి చేస్తామన్నారు. మహానాడులోపు కమిటీలను పూర్తిగా ప్రకటించడం జరుగుతుందన్నారు. తొలుత పార్టీ అధ్యక్షుడు ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఈ సంవత్సరం కాలంలో మృతి చెందిన 2024-2025 మధ్య చనిపోయిన నేతలకు సంతాపం ప్రకటించారు. పార్టీ కొన్ని తీర్మానాలు ఆమోదం తెలిపింది.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్రేయపురం మండల తెలుగు యువత అధ్యక్షులుగా వెచ్చా అనిల్, ఎన్నిక



**ఆత్రేయపురం , మే 19 ( ప్రభాతవార్త ) :**
ఆత్రేయపురం మండల టిడిపి పార్టీ తెలుగు యువత అధ్యక్షులు గా వెచ్చా అనిల్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కొత్తపేట మినీ మహానాడు కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో తెలుగు యువత అధ్యక్షులుగా వెచ్చ అనిల్, ని ఏకగ్రీవంగా ఎన్నోకోవడం పట్ల కుటమి నాయకులు జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు ముదునూరి వెంకటరాజు మాజీ మండల అధ్యక్షులు ముల్లపూడి భాస్కరరావు నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## ఐఎఫ్ఎస్ కు ఎంపికైన ములగపూడి వాసి లవ కుమార్

**రౌతులపూడి , మే 19 ( ప్రభాతవార్త ) :**
కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలం, ములగపూడి గ్రామానికి చెందిన చింతకాయల లవ కుమార్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్కు ఎంపికయ్యారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 49 సాధించినట్లు వెల్లడించారు. ఈ అత్యుత్తమ ర్యాంకు సాధించి, ఫారెస్ట్ సర్వీస్ కు ఎంపికైన లవ కుమార్ తల్లిదండ్రులు వీర సర్వ చక్రవర్తి, వీర వరహాలు ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా కుటుంబీకులు సంతోషం వెలిబుచ్చారు. గ్రామంలో బాణ సంచాలు పేల్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, కుటుంబీకులు ఉబ్బితబిబ్బయ్యారు. కష్టానికి ఫలితం దక్కిందని తల్లిదండ్రులు చక్రవర్తి, వరహాలు వెల్లడించారు.




## బూర రాజుకు వీల్ చైర్ బహుకరణ



**అమలాపురం టౌన్ , మే 19 ( ప్రభాతవార్త ) :**
కూనవరం గ్రామంలో చిటిమనేని బూర రాజుకు వీల్ చైర్ ఆకుల బుజ్జి ధన సహాయంతో అందించారు. ఈ కార్యక్రమంలో కూనవరం తెలుగుదేశం గ్రామ ప్రెసిడెంట్ ఆకుల రాము, పండు వెంకటేశ్వర రావు మారిశెట్టి చిన్న, ఆకుల నాగభూషణం సుందర్నీడి కొండయ్య, ముచ్చర్ల అబ్బులు సాపిరెడ్డి రాజు,ఆకుల వెంకటరత్నం,ఆకుల లక్ష్మణ్ ఆకుల దొరబాబు దివ్య కృష్ణ జద్దు దొరబాబు సుందరి మనోహర్ బూసి కొండ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు నియోజకవర్గ మహానాడులో కదం తొక్కిన పసుపు సైన్యం

**- 18 అభివృద్ధి తీర్మానాలు ఆమోదం**
**- ముఖ్య అతిధులు గా నియోజకవర్గ పరిశీలకులు మెట్ల, యనమల, పేరాబత్తుల, జ్యోతుల, నక్కా**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , మే 19 ( ప్రభాతవార్త ) :**
కాకినాడ జిల్లా, అన్నవరంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ మహానాడు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి యనమల రామ కృష్ణుడు ముఖ్య అతిథి కాగా, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్,జిల్లా పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్,నియోజవర్గ టిడిపి పరిశీలకులు మెట్ల రమణబాబు,మీసాల రాజు, మహాసేన రాజేష్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. వేలాదిగా కార్యకర్తలు తరలి వచ్చారు. ముందుగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ జ్యోతి ప్రజ్వలన చేసి టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, తదుపరి స్వర్గీయ వరుపుల రాజా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ప్రత్తిపాడు నియోజకవర్గంలో మరణించిన నేతలకి రాష్ట్ర టిఎన్టియుసి ఉపాధ్యక్షులు వెన్నా శివ సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా, నాయకులంతా నివాళులర్పించారు.అనంతరం నియోజవర్గ స్థాయిలో టిడిపి నాయకులు 18 తీర్మానాలు ప్రవేశపెట్టగా వాటిని ఎమ్మెల్యే ఆమోదించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్ఆర్జిఎస్ ద్వారా మారుమూల గ్రామాల నుండి మెయిన్ రోడ్డుకు కలుపుతూ సిమెంట్ రోడ్లు,తారు రోడ్లు నిర్మాణం, అలాగే గిరిజన గ్రామాలలో విద్య, వైద్యం, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. నియోజకవర్గం లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి కార్యకర్తల సహకారం మరువలేనిదన్నారు. త్వరలోనే ఏలేరు ప్రాజెక్టు ఆధునికీకరణ, లిఫ్ట్ ఇరిగేషన్, అన్నదాత సుఖీభవ క్రింద ఎన్టీఆర్ జలసిరి వంటి రైతు ప్రయోజన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందు పరచిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగష్టు 15 నుంచి ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలల ఏర్పాటు జరుగుతుందని, తన భర్త స్వర్గీయ వరుపుల రాజా అహర్నిశలు నియోజకవర్గ అభ్యున్నతికి పాటుపడేవారని, ఆయన ఆశయ సాధనకు తన వంతు శాయ శక్తులా కృషి చేస్తానన్నారు.

**40వ మహానాడు ను విజయవంతం చెయ్యాలి యనమల**

ఈ నెల 27, 28, 29 తేదీలలో కడప జిల్లాలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని పోలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించి 43 సంవత్సరాలు అయ్యిందని, అప్పట్లో స్వర్గీయ యన్టీఆర్ మహానాడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, కోవిడ్ లో తప్ప ప్రతీ సంవత్సరం మహానాడు కార్యక్రమాన్ని




ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. మహానాడు ద్వారా ప్రజలలో పార్టీ పట్ల నమ్మకం పెరుగుతుందన్నారు. దీనికి ప్రతీ కార్యకర్త సైనికులు వలే కృషి చేయాలన్నారు. గత ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అన్ని విధాలా అధోగతి పాల్జేసారనీ, తమ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని, సంపద సృష్టించి, నిరుద్యోగాన్ని రూపుమారుస్తారన్నారు.ఈ కార్యక్రమంలో జ్యోతుల నవీన్, నక్కా ఆనందబాబు, మెట్ల రమణ బాబు తదితరులు ప్రసంగించారు. పర్వత సురేష్,ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి,గంటిమళ్ళ రాజ్యలక్ష్మి,,బొమ్మిడి సత్యనారాయణ, మెరపల నర్సయ్య, పసుపులేటి చక్రి, పలివెల సతీష్, యాళ్ల జగదీశ్, బొదిరెడ్డి గోపి,మూది నారాయణస్వామి,అంబటి బుజ్జి, లొండ లోవరాజు,బ్యాంకు రాజు,ఇళ్ల అప్పారావు,కీర్తి సుభాష్,యిటంశెట్టి సూర్య భాస్కర్,సూతి బాబులు, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు,అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రత్తిపాడు సిఐ సూరి అప్పారావు నేతృత్వంలో బందోబస్త్ నిర్వహించారు.



## ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షులుగా కూసం పూడి రామకృష్ణంరాజు (బాబు )



**ఆత్రేయపురం , మే 19 ( ప్రభాతవార్త ) :**
ఆత్రేయపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా. కూసం పూడి రామకృష్ణంరాజు (తాడిపూడి బాబు) ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. కొత్తపేట మినీ మహానాడు కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో నాలుగు మండలాల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు తెలుగు రైతు అధ్యక్షులుగా కరుటూరి వరప్రసాద్ , ఐ, డిపి అధ్యక్షులుగా మధు, తెలుగు యువత అధ్యక్షులుగా వెచ్చ అనిల్, బీసీ సెల్ అధ్యక్షులుగా మిద్దె రామకృష్ణ , ఎస్సీ సెల్ అధ్యక్షులుగా పాలింగి రవిచంద్ర లను నాయకులు కార్యకర్తలు ఏకగ్రీవంగా నియమితులయ్యారు ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు ముదునూరి వెంకటరాజు మాజీ మండల అధ్యక్షులు ముల్లపూడి భాస్కరరావు నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు

KAKINADA MUNICIPAL CORPORATION
'e' PROCUREMENT NOTIFICATION
Roc No. 2703/2025/E2. Dated: 17.05.2025
Tenders invited through ap e procurement platform for 18 works with an estimated contract value of Rs. 82,75,455/- from the eligible contractors in the following manner.
**Eighteen Works for an amount of Rs. 82,75,455/-**
Last date and time for downloading bid documents: **Dt:05-06-2025 upto 10-00 AM**
Last date and time for submission of bids: **Dt:05-06-2025 upto 10-30 AM**
Tender Inviting Authority: **Commissioner, Municipal Corporation, Kakinada**. Mail: **kkd_mplcorp @yahoo.com**, Call Centre Phone: **0884-2357722**
Further details can be seen at 'e' procurement market place **@ www.apeprocurement.gov.in**
Sd/- **Smt. Bhawna,** I.A.S,
Commissioner,
Municipal Corporation,Kakinada

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# ప్రభుత్వ బడిలో మెరుగైన విద్య




**సామాజిక మాధ్యమాలను వినోదం కోసం వాడుతున్నవారు ఎంతమంది ఉన్నారో.... విద్య. వైద్య, సేవా రంగాలపై సామాన్యులకు అవగాహన కల్పించడానికి వాడేవారూ అంతే మంది ఉన్నారు. పర్దాసింగి అలివేలిమంగ (సుధ) కూడా ఆ కోవకే చెందుతారు. ఇన్స్టా, వాట్సాప్లను ఉపయోగించి ఆమె ఏం చేస్తున్నారంటే...**

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చే తల్లిదండ్రుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. పట్టణాలే కాదు... పల్లెల్లోనూ ప్రైవేట్ స్కూళ్లంటేనే మక్కువ. మెరుగైన విద్య అందడం లేదని, పిల్లలు వెనకపడుతున్నారని రకరకాల కారణాలు. ప్రభుత్వ స్కూళ్లు దేనిలోనూ తీసిపోవని, ఇక్కడా... పిల్లలకు కావాల్సిన సౌకర్యాలన్నీ ఉన్నాయని చెప్పాలనుకున్నారు. ఈమెది పాడేరు దగ్గర పెదబయలు. 'నాన్న నిత్యానందం కార్పెంటర్. అమ్మ సూర్యకాంతమ్మ... నాన్నకు పనుల్లో సాయం చేస్తారు. నాకు ఇద్దరు తమ్ముళ్లు. అమ్మానాన్నలు పనిచేస్తేనే పూటగడిచేది. అన్‌సీజన్‌లో ఎన్నో ఇబ్బందులు. అందుకే చిన్న వయసులోనే నన్ను హాస్టల్లో చేర్చారు. గిరిజన ప్రాంతం కావడంతో మాకు చదువుకునే అవకాశాలు చాలా తక్కువ. ఇక్కడికి టీచర్లు రారు. వచ్చిన వాళ్లేం మాట్లాడేవారో మాకు అర్థమయ్యేది కాదు. పైగా ఇంటి మీద దిగులు. 'చదువుకోకే నేనిలా ఇన్ని కష్టాలు పడుతున్నా' అని అమ్మ చెప్పే మాటల్ని ధైర్యంగా గుర్తుచేసుకునేదాన్ని.

**అందెనఉ 'మిస్ యనిక్'...**

నా చదువంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే గడిచింది. ఇక్కడ పిల్లలు పడే కష్టాలు నాకు తెలుసు. పెద్దయ్యాక టీచర్ కావాలని నిర్ణయించుకుంది అందుకే... నాలా ఆర్థిక స్థిరత్వం లేని చాలామంది ప్రభుత్వ స్కూళ్లకు వస్తారు. వారికి మెరుగైన విద్య అందాలనే లక్ష్యంతో ఈ వృత్తిని ఎంపిక చేసుకున్నా. 2014లో అనుకున్న లక్ష్యాన్ని సాధించా. ప్రస్తుతం విశాఖపట్నం పెందుర్తిలోని పినగాడి మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్నారు. అప్పటికీ ఇప్పటికీ ఎన్నో మార్పులు. పిల్లలు లేక ప్రభుత్వ బడుల్ని మూసేయాల్సిన పరిస్థితి. డబ్బు ఉన్నా లేకున్నా ప్రైవేటు స్కూళ్లను ఆశ్రయించే వారి సంఖ్య పెరుగుతోంది. మేం ప్రతి ఏడాది అడ్మిషన్ల సమయంలో ఊరంతా తిరిగి మా బడిలో పిల్లల్ని చేర్చమని చెబుతాం. ఒక్కొక్కరి నుంచీ ఒక్కో స్పందన. అందులో చాలామంది... మేం చదివే స్కూల్లో చాలా యాక్టివిటీలు చేస్తారు... ఇంగ్లీష్ మాట్లాడతారు. ఇక్కడ ఉంటే పిల్లలకి అవేవీ తెలియదు అన్నారు. అప్పుడే అనిపించింది... మనం ఎందుకు అలా చేయకూడదు అని. అందుకే పిల్లలకి... కమ్యూనికేషన్, ఇంగ్లీష్, డ్రెస్సింగ్, నడవడిక లాంటి పాఠాల్ని ఆటలుగా చేసి చెప్పడం మొదలుపెట్టాం. బడివరకే పరిమితమైతే గ్రామంలో ఎలా తెలిసేది. ఇప్పుడంతా వాట్సాప్ స్టేటస్ కదా... అందుకే వీడియోలు తీసి స్టేటస్ పెట్టేదాన్ని. అప్పుడే మా స్నేహితురాలు ఒకామె... ఇన్‌స్టాలో వీడియోలు చేయండి... ప్రభుత్వ స్కూళ్లలోనూ టీచర్లు ఇంత బాగా చెబుతున్నారనే సందేశం అందరిలోకీ వెళుతుందని సూచించింది. అప్పుడే 'మిస్ యునిక్' పేజ్‌ను మొదలు పెట్టా. ప్రారంభించిన మూడు నెలల్లోనే మంచి స్పందన వచ్చింది. ఊర్లోనూ చాలామంది మాకు ఫాలోయర్లు ఉన్నారు. వాళ్లంతా మా ప్రయత్నాన్ని అర్థం చేసుకుని, ఈ ఏడాది మా బడిలో చేరేవారి సంఖ్య పెరిగితే... మా శ్రమకు విజయం దక్కినట్లే అనే సుధ.. మ్యాథ్స్, సబ్జెక్టుల్ని పిల్లలందరికీ అర్థమయ్యేలా టిప్స్ అండ్ ట్రిక్స్‌తో చెబుతున్నారు. ప్రతి సబ్జెక్టులోని మెలకువల్ని ఆటల రూపంలో నేర్పుతున్నారు. అంతేకాదు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ పాఠాలూ బోధస్తున్నారు. □

# ఇండియా చాలా నచ్చింది



**గ్లోబలైజేషన్ వల్ల ఈ రోజు ప్రపంచం ఓ కుగ్రామంలా మారిపోయింది. ప్రయాణ సౌకర్యాలు పెరగడంతో దేశాల సరిహద్దులు దాటడం సాధారణ అంశమైంది.**

ఈ చదువు, ఉద్యోగాల కోసమే కాకుండా ట్రావెలింగ్ చేయడానికి కూడా విదేశాలకు వెళ్లే వారి సంఖ్య పెరిగింది. అలాగే విదేశాల నుంచి మన దేశానికి వచ్చి వివిధ ప్రాంతాలను సందర్శిస్తే వారి సంఖ్య పెరుగుతోంది. అలా మనదేశానికి వచ్చిన కొంతమంది మహిళలు ఇక్కడి సంస్కృతికి ముగ్ధులవడమే కాకుండా శాశ్వతంగా ఇక్కడే ఉండడానికి ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఇటీవలే ఓ అమెరికన్ మహిళ తన పిల్లలను కోరుకుంటున్నట్లు చెప్పడంతో ఇక్కడ వార్తల్లో నిలిచింది. తాజాగా డెన్మార్క్‌కు చెందిన యాస్టిడ్ ఎస్మెరాల్డ్ అనే అమ్మాయి కూడా ఇలాంటి అభిప్రాయాన్నే చెబుతూ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ చేసింది. అది కాస్తా వైరల్‌గా మారింది. ఇంతకీ ఈ అమ్మాయి ఇండియాలో ఎందుకు సెటిల్ అవ్వాలనుకుంటోందో తెలుసుకుందామా...

**వేసవి మాత్రమే హాయి..!**

డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగెన్‌కు చెందిన యాస్ట్రిడ్ పది నెలల క్రితమే భారత్‌కు షిఫ్ట్ అవ్వాల నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం తన ఇల్లు, ఉద్యోగం, స్నేహితులనీ వదులుకుని భారత్‌కు వచ్చింది. ఈ పది నెలల సమయంలో ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు పలు ప్రాంతాల్లో పర్యటించింది.. ఈ క్రమంలో ఇక్కడి ప్రజలు, భిన్న సంస్కృతులకు ఆకర్షితురాలైనట్లు పలు సందర్భాల్లో ఇన్‌స్టాగ్రామ్లో పంచుకుంది. 'జీవితంలో కొత్తదనం కావాలంటే మార్పు తప్పనిసరి. అయితే అందుకు కోపెన్హాగెన్ ఇక ఏమాత్రం సరైన ఎంపిక కాదనుకున్నా, ఇల్లు, ఉద్యోగం, స్నేహితులు.. ఇలా అన్నిటిపై ప్రేమ ఉన్నా సిటీ అంటే బోర్ కొట్టింది. ఎందుకంటే వేసవిలో మాత్రమే ఇక్కడ బాగుంటుంది. ఆ తర్వాత అంద మళ్లీ ఎప్పుడు సమ్మర్ వస్తుందా? అని ఎదురుచూస్తుంటాం అని రాసుకొచ్చింది యాస్ట్రిడ్. మార్పు కోసం శోధించిన యాస్ట్రిడ్ తన అభిరుచులకు ఇండియా సరిగ్గా సరిపోతుందని భావించింది. అయితే ఎలాంటి ప్రణాళికలు లేకుండానే భారత్‌లో ఆమె అడుగుపెట్టిందట. ఇప్పటి వరకు 10 నెలల పాటు మన దేశాల్లోని వివిధ ప్రాంతాలను సందర్శించిన ఆమె తాను సరైన నిర్ణయాల్లో ఇదీ ఒకటని అంటోంది. గోవా బీచ్‌లు, ముంబయి మార్గాలు, కేరళ అందాలతోపాటు రిషికేశ్‌లోని ఆధ్యాత్మిక ప్రాంతాలనూ సందర్శించింది. తన అనుభవాలను ఇన్‌స్టాగ్రామ్లో పంచుకునే యాస్ట్రిడ్.. తాజాగా చేసిన పోస్ట్ వైరల్‌గా మారడంతో వార్తల్లో 10 నిలిచిపోయింది. 'ఇప్పుడు సంతోషంగా ఉంది. ఈ ప్రయాణంలో ఇండియా నాకు ఎన్నో దారులను చూపించింది దేశంలోని భిన్నత్వం, వన్య సంపదని చూసి మొదట్లోనే ఆకర్షితురాలినయ్యా.. ఆ తర్వాత ఇక్కడ ప్రజలు, సంస్కృతి, ప్రకృతి ప్రేమలో పడిపోయా. ఈ సమయంలో భారత్ నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి కొత్త దారులు చూపించింది. అంతేకాదు.. నా ప్రయాణంపై నమ్మకం కలిగించింది. కర్మ సిద్ధాంతానికి సంబంధించిన వివిధ వాస్తవాలను ఇక్కడే తెలుసుకోగలిగారు. వీటన్నింటికీ నేను కృతజ్ఞురాలిని. మరోనెల పాటు ఇక్కడే ఉండి, సమ్మర్ని యూరప్లో గడుపుతాను. మళ్లీ వర్షాకాలం తర్వాత ఇండియాకు వస్తాను. మీలో ఎవరైనా ఇండియాలో ఉంటే ఆలస్యం చేయకండి. భారత్ నా జీవితాన్ని ఎంతో మార్చింది' అంటూ భారత్‌పై ఉన్న ప్రేమను వ్యక్తపరిచింది. ఈ పోస్ట్‌కు దాదాపు 4 లక్షల వీక్షణలు రావడం గమనార్హం.

**యోగాసనాలు వేస్తూ...**

యాస్ట్రిడ్కు భారతపై ఎంత మక్కువ ఉందో ఆమె వేసే యోగాసనాలే చెప్పేస్తాయి. 2014 నుంచి యోగా సాధన చేస్తోన్న ఆమె.. ఇక్కడికి వచ్చిన తర్వాత సంప్రదాయ యోగాకు సంబంధించి శిక్షణ కూడా తీసుకుంది. ఈ క్రమంలో కఠినమైన యోగాసనాలు కూడా సులువుగా వేస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకోవడమే కాకుండా పలు రకాల టిప్స్‌ని కూడా షేర్ చేస్తుంటుంది. □

## చెలి చిట్కా

ఎండు కొబ్బరిని సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్ల చల్లీ ఫ్రిజ్‌లో ఉంచాలి.

# నిమ్మతో నిగనిగలాడే అందం ..

**నిమ్మ వల్ల కేవలం ఆరోగ్యపరంగానే కాకుండా సౌందర్యపరంగా కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయి. అందుకే ముఖవర్ఛస్సుని ఇనుమడింపజేసుకోవడానికి వేసుకునే ఫేషియల్స్ దగ్గర్నుంచి మడమల పగుళ్లను నివారించడం వరకు ఇలా ప్రతి పనిలోనూ నిమ్మరసాన్ని ఉపయోగిస్తుంటాం.**



**చుండ్రు సమస్యకు చెక్..**

వాతావరణంలో క్రమంగా పెరుగుతున్న కాలుష్యం, ఇతరత్రా కారణాల వల్ల చుండ్రు సమస్య రోజురోజుకీ రెట్టింపవుతోంది. ఈ సమస్యను దూరం చేసుకోవడానికి వివిధ రకాల హెయిర్‌ప్యాక్స్ కూడా పెట్టుకుంటూ ఉంటాం. కానీ నిమ్మకాయతో దీన్నుంచి సులభంగా విముక్తి పొందవచ్చు. నీరు, అల్లం రసం, నిమ్మరసం, ఆలివ్ నూనె కొద్దికొద్దిగా తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి ఆరే వరకు ఉంచాలి. బాగా ఆరిన తర్వాత షాంపూతో తలస్నానం చేస్తే సరి.

**సహజసిద్ధమైన క్లెన్సింగ్‌లా..**

నిమ్మలో సహజసిద్ధమైన క్లెన్సింగ్ గుణాలు ఉంటాయి. వీటి వల్ల చర్మం బాగా శుభ్రపడి ప్రకాశవంతంగా కనిపిస్తుంది. ఇందుకోసం మన చేయాల్సిందల్లా నిమ్మకాయని రెండు ముక్కలుగా చేసి ఒక

దాంతో ముఖం, మెడ మీద 5 నిమిషాల పాటు బాగా రుద్దాలి. తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మంలో లోతున ఉన్న మురికి కూడా తొలగి పోయి ప్రకాశవంతంగా మారుతుంది. అలాగే ముఖం మీద వచ్చే మొటిమలు, వాటి వల్ల ఏర్పడే మచ్చల సమస్యకు కూడా నిమ్మరసం చక్కని పరిష్కారం చూపుతుంది.

**జిడ్డును తగ్గిస్తుంది..** ఒక్కొక్కరి చర్మతత్వం ఒక్కోలా ఉంటుందన్న విషయం తెలిసిందే. అయితే జిడ్డు చర్మతత్వం ఉన్న వాళ్లకు మిగతా వారి కంటే చర్మ సంబంధిత సమస్యలు కాస్త ఎక్కువగా ఉంటాయి. అందుకే జిడ్డుదనం తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి. ఇందుకు నిమ్మరసం చక్కగా ఉపయోగపడుతుంది. చర్మంలో సహజంగా ఉత్పత్తయ్యే నూనె స్థాయులను క్రమబద్ధీకరించడంలో ఇది ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఇందుకోసం నీళ్లలో కొద్దిగా నిమ్మరసం కలిపి దూదితో ముఖానికి రాసుకోవాలి. □

# పానీపూరీ ఎప్పుడంటే అప్పుడే..



పానీపూరీ మనందరికీ చాలా చాలా ఇష్టమైన స్ట్రీట్ ఫుడ్. రోజూ తిన్నా విసుగేయదు. మరి పానీపూరీ వీధుల్లోనే ఎందుకు తినాలి? దుమ్మూధూళీ లేకుండా ఇంట్లోనే తింటే బాగుంటుంది. కదూ! పూరీల ప్యాకెట్ కొనుక్కోవచ్చు కానీ.. పానీ ఎలా అనుకుంటున్నారా? అదేం కష్టం కాదు, తేలిగ్గా ఇంట్లోనే చేసుకోవచ్చు. ఎలా గంటారా.. రెండున్నర టేబుల్ స్పూన్ల ఎండిన పుదీనా ఆకుల పొడి, రెండు టేబుల్ స్పూన్ల వేయించిన జీలకర్ర, చెంచా చొప్పున మిరియాల పొడి, సైంధవ లవణం, ధనియాల పొడి, అర చెంచా చొప్పున శొంఠి పొడి, ఆమ్‌చూర్ పౌడర్, పంచదార, కాస్త ఇంగువ, చిటికెడు సిట్రిక్ యాసిడ్ క్రిస్టల్స్‌ను తీసు కోవాలి. చేయడం కూడా మహాసులభం.. వీటన్నిటినీ కలిపి గ్రైండ్ చేస్తే చాలు ఘుమఘుమలడే 'పానీపూరీ మసాలా' ఆయారైపోతుంది. పొడి మాత్రం బరకగా లేకుండా చాలా మెత్తగా ఉండాలి. లేదంటే సరిగ్గా కలవదు. దీన్ని తడి లేని సీసాలో మాత్రం బరకగా లేకుండా చాలా మెత్తగా ఉంచాలి. లేదంటే సరిగ్గా కలవదు. దీన్ని తడి లేని సీసాలో భద్రం చేసుకుంటే పానీపూరీ తినదలచినప్పుడు కప్పు నీళ్లల్లో అర చెంచా చొప్పున కలిపితే సరిపోతుంది. □

# అది టెక్స్ రిలేషన్‌షిప్ మాత్రమే..

ఇరువురి మధ్య కేవలం ఫోన్‌లో సమాచారం ఇచ్చిపుచ్చుకొనే బంధం ఉంటే దాన్ని టెక్స్ రిలేషన్‌షిప్ అని పిలుస్తున్నారు. అంటే రోజంతా ఎదుటివారి వివరాలను తెలుసుకోవడానికీ, తమ గురించి చెప్పడానికీ మెసేజ్‌లనే వాడుతున్న వారితో స్నేహం లేదా ప్రేమ బంధం ఉందని భావించొద్దంటున్నారు నిపుణులు. అలాంటి దాన్ని బలమైన బంధంగా ఊహించకోవద్దనీ హెచ్చరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా బంధా లేర్పడుతున్న ఈ కాలంలో కాలక్షేపం కోసం ఎదుటివారిని ఇలా మెసేజ్‌లతో మభ్యపెట్టే వాళ్లూ ఉంటారు. ప్రతి చిన్న విషయాన్నీ మెసేజ్ చేస్తూ, మాట్లాడటానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదంటే అవతలివారు మీతో ఎటువంటి బంధాన్నీ కొన సాగించడం లేదని ముందుగానే అర్థం చేసుకోవాలి. ఎదుటివారికి మీరు టైంపాస్ కావొచ్చు. లేదా మిమ్మల్ని తమ సమాచారంతో మాత్రమే మోసగిస్తూ.. దాన్ని స్నేహంగా చెప్పుకొంటూ ఉండొచ్చు. ఇటువంటి బంధాల నుంచి వీలైనంత త్వరగా బయట పడటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



**స్నేహంతో కాదు..** ఉదయాన్నే 'హలో' పలకరింపుతో మొదలుపెట్టి రాత్రి నిద్రపోయేవరకూ మీ గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటే మీరు ఆలోచించాల్సిందే అవతలివారికి మీపై ప్రేమ ఉందనుకుంటే అది మీ అపోహ అవుతుంది. వర్చువల్‌గా మాత్రమే మీతో స్నేహం చేయడానికి వారు ఆసక్తి చూపిస్తుంటారు. దాన్ని ప్రేమ అనుకుంటూ ఊహల్లోకి జారితే మాత్రం ఆ తర్వాత మీరు కుంగుబాటుకి గురవడం ఖాయం. ఎందుకంటే ఇలాంటి వాళ్లే, మీరు కలిసి మాట్లాడదామన్న వెంటనే సాకులు చెబుతారు. ఇలా వాళ్ల తప్పించుకున్నప్పుడు మీరు తీవ్ర వేదనకు గురికావాల్సి ఉంటుంది. ఎన్నిసార్లు అడిగినా కలవడానికి ఆసక్తి చూపించకుండా, ఫోన్‌లో సమాచారంతో మాత్రమే బంధాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తుంటే నమ్మకపోవడం. □

# పనులతోనే ఆరోగ్యం

**వ్యాయామం అవసరం. అయితే కొందరు మహిళలు.. ఇంటి పనులూ, బాధ్యతలతోనే సమయం అంతా అయిపోతుంది. వర్కవుట్లు చేసే తీరిక మాకెక్కడిది అంటారు. వ్యాయామం అనగానే జిమ్‌కో, యోగా తరగతులకో వెల్లనక్కర్లేదు. సులువుగా ఇంట్లోనే చేయగలిగే కొన్ని కసరత్తులు ఉన్నాయి. వాటిని మీ రోజువారీ పనులతోనే పూర్తి చేయొచ్చు. అదెలాగంటారా?**

◆ ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచినా.. ఎక్కడో ఒక చోట సర్దాల్సినవి కనిపిస్తూనే ఉంటాయి. పండగలు, ప్రత్యేక సందర్భాలూ తరచూ వస్తూనే ఉంటాయి. వీటికోసం ఓ రోజు ప్రత్యేకంగా పెట్టుకునే బదులు. రోజూ కాసేపు ఇందుకోసం సమయం కేటాయించండి. పైనున్న అరల్లోని వస్తువుల్ని తుడిచి పెట్టడానికి కుర్చీలెక్కొద్దు. కాలి మనివేళ్లపై నిలబడి చేతులు పైకెత్తి అల్మరాలను శుభ్రపరచండి. ఇలా పది నుంచి పదిహేను నిమిషాల పాటు సమయాన్ని దీనికోసం కేటాయించుకోండి. ఇలా చేస్తే శరీరానికి ఫ్లెక్సిబిలిటీ అలవడంతోపాటు మీ షెల్ఫ్‌లు ఒద్దికగా కనిపిస్తాయి. ఒకేసారి రెండింటికీ పరిష్కారం లభిస్తుంది.

◆ నీళ్లను రెండు లీటర్ల సీసాలో పోసి రోజూ ఉదయం ఓసారి, సాయంత్రం ఓసారి వాటిని అరచేతిలో పెట్టుకుని మిద్దెమీదకు తీసుకెళ్లండి అక్కడ మొక్కలకు పోయండి. ఇలా రెండు మూడు సార్లు పైకీ, కిందకీ ఎక్కిదిగడం వల్ల కండరాలు దృఢంగా మారడమే కాదు.. నీళ్ల బరువుకి చేతులూ టోన్ అవుతాయి.

◆ గంటలు గంటలు ఫోన్‌లు, ఛాటింగ్‌లు, నెట్ బ్రౌజింగ్ మనలో చాలామందే చేస్తుంటారు. మరి ఇలాంటప్పుడు పడుకుని, కూర్చుని



మాట్లాడొద్దు. వీలైనంతవరకూ అటూ ఇలూ నాలుగు అడుగులు వేస్తే మంచిది. అంతగా టివి చూస్తే ఊబకాయం పెరుగుతుందని అనేక అధ్యయనాలు ఇప్పటికే వెల్లడించాయి. దీనికి కారణం కదలకుండా కూర్చోవడం, అందులో లీనమై అధికంగా తినడం వంటివే. మరి అలా కాకూడదనుకుంటే ఓ పనిచేయండి. ఈ సారి టివి చూసేటప్పుడుచేతిలో రిమోట్ లేకుండా చూసుకోండి. దాంతో ఛానెల్ మార్చాలనుకున్నప్పుడల్లా లేచి నాలుగడుగులు వేస్తారు. అలానే మీకు దగ్గర్లో నీళ్ల సీసాను పెట్టుకుంటే తినడానికి బదులు నీళ్లు తాగడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.

◆ రోజూ ఉదయాన్నే పళ్లు తోమిన తరవాత అద్దంలో చూస్తూ పెద్దగా నవ్వండి. నిటారుగా నిలబడి వెనక్కి తలను వంచి ఇంటి పైకప్పును చూస్తూ ఓ పదిసార్లు పెద్దగా నోరు తెరవడం. మూయడం చేస్తుండాలి. దీని వల్ల డబుల్‌చిన్ సమస్య దూరమవుతుంది. మెడనొప్పులు, స్పాండిలైటిస్ సమస్యలు ఉన్నవారు దీనికి దూరంగా ఉండటం మంచిదే. □

# శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి

ఆధ్యాత్మికం

భగవదాంశ సంభూతులు, నిర్వికారులు, నిర్మోహక నిరంజనులు, వేద శాస్త్ర జ్ఞాన విశ్వాలోక కల్యాణ గుణోపేతులు, నడిచే దైవ నామాంకితులు అయిన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారికి శతకోటి ప్రణామములు. ఎవరి నామస్మరణ మాత్రమున సకల మనోవికారములు అంతరించి, వైరాగ్య భావనలు జీవం పోసుకుంటాయో, ఎవరి ధ్యాన మాత్రమున సకల దేవతల అనుగ్రహం సిద్ధిస్తుందో, ఎవరి కరుణాకటాక్ష వీక్షణముల వలన పరబ్రహ్మ సిద్ధి కలుగుతుందో వారే జగద్గురువులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు. లోకోద్ధరణకై పరమాత్ముడు తన విభూతులతో జగద్గురువులను సృజన చేస్తాడు. లోకంలో అణగారిపోతున్న ధర్మాన్ని పునరుద్ధరించటానికి వారి మాధ్యమంగా అవతారం ధరిస్తాడు. కలియుగంలో పరమాత్ముని దివ్య తేజోమయ నిజ స్వరూప దర్శనం సాధ్యం కాదు. అది యుగ ధర్మం. అందుకే దైవాంశ సంభూతులు జన్మించి లోకోపకారానికై కృషి చేస్తారు. కంచి పరమా చార్యులుగా కీర్తి గడించారు. శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రీ మరియు మహాలక్ష్మీ దంపతులకు అనూరాధా నక్షత్రము లో 1894 మే 20వ తేదీన తమిళనాట విల్లుపుర గ్రామము నందు చంద్రశేఖరేంద్రులు జన్మించారు. లమ 13వ ఏట కంచి కామకోటి పీఠానికి 68వ అధిపతిగా నియుక్తులైనారు. మతాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తింపచేసిన మహనీయులు పరమాచార్యులు. భారతదేశానికి రాజ్యాంగ నిర్మాణం చేసే సమయంలో తాతాచారి అనే పెద్దకు వచ్చిన ఆహ్వానం మేరకు మతసంస్థలకు రాజ్యాంగ రక్షణ అవసరమన్న స్వామి ఆశయాన్ని రాయబార వర్గంలోని ముఖ్యుడైన సోరెన్సన్ మహోదయునికి వివరించారు. స్వామి ఒక్క క్షణం ధ్యానంలో మునిగి, ఆ తరువాత మతాన్ని ప్రాథమిక హక్కుగా పరిగణిస్తూ చట్టం చేయమని బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరుతూ వినతి పత్రం తయారు చేయమని భక్తులకు ఆదేశించారు. ఆ తరువాత ఢిల్లీ వెళ్ళి సోరెన్ సన్‌కు విజ్ఞాపన పత్రం అందించటం, రాజ్యాంగంలో మత స్వాతంత్ర్యపు హక్కు స్థానం సంపాదించటం జరిగింది. 1927వ సంవత్సరంలో భారత స్వాతంత్ర్య సమరానికి సారధ్యం వహిస్తున్న మహాత్మా గాంధీ దక్షిణ భారత పర్యటన చేస్తున్నారు. ఆ సమయంలో గాంధీజీ పరమాచార్యులను దర్శనం చేసుకున్నారు. గాంధీగారి లక్ష్యం నెరవేరాలని స్వామి మనసున తలచుకున్నారని, అది నెరవేరిందని మనం ఊహించు కోగలం. ఈ రోజు శ్రీశ్రీశ్రీ జగద్గురువులు చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి ఆరాధనలో భాగంగా వారిని స్మరించుకుంటే, వారు సనాతన ధర్మానికి చేసిన కృషికి కృతజ్ఞత తెలిపినవారమౌతాము. వర్ణింపనలవికాని అనేక లీలలు వారి జీవితంలో కాన వస్తాయి. సదా గోసేవలో తరించేవారు. వారు ఎక్కువ సమయం గోశాలలో గడిపేవారు. 1994 జనవరి 8న స్వామి శివ సాన్నిధ్యం చెందారు. వారు ప్రత్యక్షంగా, భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ వారి అనంత లీలా విభూతులు ఇప్పటికీ అనేక మంది భక్తులకు అనుభవయోగ్యమే. శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్రుల దివ్య ఆశీస్సులు మనందరిపై ఉండాలని కోరుకుంటూ..

**-డా. దేవులపల్లి పద్మజ**

# తమ నైపుణ్యాలను తాము గుర్తించలేరు..

**కొంత మంది అమ్మాయిలు ఆఫీసులో బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తిస్తారు. ప్రాజెక్టు పనులన్నీ సమయానికి పూర్తి చేస్తారు. అయినా తను సరిగ్గా పనిచేయలేదని బాధపడుతారు. సామర్థ్యాన్ని ప్రదర్శించలేకపోతున్నా అనుకుంటూ కుంగుబాటుకు గురవుతారు. ఇంపోస్టర్ సింద్రోమ్‌గా పిలిచే ఈ సమస్య నుంచి బయట పడటానికి నిపుణులేం చెబుతున్నారంటే..**

మనలోనే ఎక్కువ..



ఆఫీసు పనుల్లో తాము చెప్పినంత గొప్పగా ఫలితాలను చూపించలేకపోతున్నామనే ఆలోచన, వేదన మగవారికన్నా మహిళల్లోనే ఎక్కువగా ఉంటుందట. ఈ సింద్రోమ్ ఉన్నావారు సరిగ్గా పనిచేయక పోయినా ఎందుకు తమను ఉద్యోగం నుంచి తీయడం లేదు అని ఆలోచిస్తుంటారట. అయితే ఇదేమీ మానసిక అనారోగ్యం కాదని, అందరిలోనూ అప్పుడప్పుడూ కనిపించే సమస్యే అంటున్నారు నిపుణులు. ఇటువంటి ఆలోచనల నుంచి స్వీయ ప్రయత్నంతో తేలిగ్గానే బయట పడొచ్చంటున్నారు.

**గుర్తించలేక..** ఈ సమస్య ఉన్నవారు తమలోని ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించలేరు. ఇతరుల అంచనాలకు తగ్గట్లు జీవించలేకపోతున్నామనే వేదన కూడా వీరిని వెంటాడుతుంది. ఇందుకు ఆ మహిళలు పెరిగిన వాతావరణం, బాల్యంలో ఎదుర్కొన్న అనుభవాలు కూడా కారణం కావొచ్చు అంటున్నారు మానసిక నిపుణులు. అలాగే పనిచేసే చోట లింగవివక్ష, ఆడవాళ్లు ఎక్కువ పనిచేయలేరంటూ తక్కువ బాధ్యతలు అప్పజెప్పడం వంటివీ వారిలో ఇంపోస్టర్ సింద్రోమ్‌కు దారి తీస్తాయట.

**బయట పడొచ్చు....** మనల్ని ప్రభావితం చేస్తున్న భావోద్వేగాలను ముందుగా గుర్తించాలి. గతంలో సాధించిన విజయాలను వరసగా పుస్తకంగా రాయడం ద్వారా అది మన 'పరఫార్మెన్స్ ట్రీ'గా మారుతుంది. అప్పుడప్పుడు దాన్ని పునఃపరిశీలన చేస్తుంటే ఆ విజయాలన్నీ మన ప్రత్యేకతను గుర్తుచేస్తుంటాయి. స్వీయ ప్రశంస నేర్చుకుంటే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చు. అలాగే భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి ధ్యానం యోగా వంటివి చేస్తే క్రమంగా ఈ సమస్యను దూరంగా ఉండొచ్చు. □

# 'సూర్య 46' ప్రారంభం

విభిన్న చిత్రాలు, పాత్రలతో వివిధ భాషల ప్రేక్షకులకు చేరువయ్యారు తమిళ అగ్ర కథానాయకుడు సూర్య. తెలుగులోనూ ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందనున్న ద్విభాషా చిత్రం కోసం ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరితో సూర్య చేతులు కలిపారు. కేవలం ప్రకటనతోనే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇది సూర్య నటిస్తున్న 46వ చిత్రం. అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.33గా తెరకెక్కనున్న ఈ చిత్రం.. నేడు హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ తరంలో అత్యంత ప్రతిభగల దర్శకులలో ఒకరిగా వెంకీ అట్లూరి పేరు తెచ్చుకున్నారు. భావోద్వేగ లోతును, వాణిజ్య విలువలను చక్కగా మిళితం చేసే కథకులలో వెంకీ అట్లూరి ఒకరు. సార్/వాతి, లక్కీ భాస్కర్ వంటి అద్భుతమైన సినిమాలతో వరుస ఘన విజయాలను సొంతం చేసుకొని ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు మరో అద్భుతమైన కథతో అలరించడానికి సూర్యతో చేతులు కలిపారు. తెలుగునాట సూర్యకు ఉండే ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆయన కెరీర్‌ను మలుపుతిప్పిన గజిని సినిమా నుంచి భారీస్థాయిలో అభిమానులను ఏర్పరచుకున్నారు. పాత్రలు, కథల ఎంపికలో వైవిధ్యం చూపించే సూర్య.. ప్రేక్షకులకు ఎప్పటికప్పుడు కొత్తదనం అందిస్తూనే ఉంటారు. ఇప్పుడు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రూపుదిద్దుకుంటున్న తన 46వ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ కావడానికి



సన్నద్ధమవుతున్నారు. ప్రేమలు చిత్రంతో యువతకు చేరువైన యువ సంచలనం మమిత బైజు కథానాయికగా నటిస్తుండటం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ అని చెప్పవచ్చు. ఈ చిత్రంతో రవీనా టాండన్ తెలుగు సినిమాల్లోకి పునః ప్రవేశం చేస్తున్నారు. సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవల సార్, లక్కీ భాస్కర్, అమరన్, వీర ధీర సూరన్ చిత్రాలకు ఆకట్టుకునే సంగీతాన్ని అందించి విలక్షణమైన సంగీత దర్శకుడిగా తనదైన ముద్ర వేశారు జి.వి. ప్రకాష్ కుమార్. ఇప్పుడు వెంకీ అట్లూరితో మరోసారి కలిసి పనిచేస్తున్నారు. వెంకీ అట్లూరి గత చిత్రాలు సార్, లక్కీ భాస్కర్ విజయాల్లో జి.వి. ప్రకాష్ సంగీతం కూడా కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. రాబోయే సూర్య చిత్రంలో భావోద్వేగం మరియు మాస్ అప్పీల్‌ను మిళితం చేసే సౌండ్‌ట్రాక్‌తో ఆ ట్రెండ్‌ను కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. అద్భుతమైన విజువల్స్‌కు పేరుగాంచిన నిమిష్ రవి ఛాయాగ్రహణం అందిస్తున్నారు.

# 'భైరవం' ట్రైలర్ లాంచ్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుత స్పందనతో, పాజిటివ్ బజ్‌తో ముందుకు దూసుకెల్తుతోంది. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మించారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతీలాల్ గాడా సమర్పిస్తున్నారు. ఈ సినిమా మే 30న వేసవి సీజన్‌లో బిగ్గెస్ట్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మూవీ టీం థియేట్రికల్ ట్రైలర్ ఏలూరులో గ్రాండ్‌గా లాంచ్ చేశారు. భారీ సంఖ్యలో అభిమానులు ప్రేక్షకులు హాజరైన ఈ వేడుక చాలా సక్సెస్ ఫుల్‌గా జరిగింది. కథాంశం గ్రామస్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీక అయిన పవిత్ర వారాహి ఆలయం చుట్టూ తిరుగుతుంది. రాష్ట్ర అండ్‌మెంట్ మంత్రికి ఆ ఆలయం భూములపై కన్నపడి, వాటిని వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగించాలనే ప్రయత్నం చేస్తాడు. ఈ క్రమంలో గ్రామ శాంతి భంగం అవుతుంది. అప్పుడు ముగ్గురు స్నేహితులు కలసి, ఆలయాన్ని, దాని వారసత్వాన్ని రక్షించేందుకు బలంగా నిలబడతారు. వారి మధ్య ఉన్న బంధం, ధైర్యం గ్రామ ప్రజలకు ఆశను నింపుతుంది. కమర్షియల్ వాల్యూస్‌తో కూడిన కథను దర్శకుడు విజయ్ కనకమేడల ఎక్స్ యిటింగ్, ఇంపాక్ట్ ఫుల్‌గా ప్రెజెంట్ చేశారు. తొలి షాట్ నుండి చివరి ఫ్రేమ్ వరకు సినిమాను ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పాత్రలో వెర్స టాలిటీ చూపించి అదరగొట్టారు, ముఖ్యంగా శివ తాండవం సీక్వెన్స్, చివరిలో వచ్చే యాక్షన్ సన్నివేశంలో అద్భుతంగా కనిపించారు. మంచు మనోజ్ ఇంటెన్స్ క్యారెక్టర్ కట్టిపడేశారు నారా రోహిత్ కూడా తన పాత్రను పవర్‌ఫుల్‌గా పోషించి ఆకట్టుకుంటారు. ఈ ముగ్గురు నటుల పర్ఫార్మెన్స్ అద్భుతంగా నిలిచింది, ప్రతి ఒక్కరికి సమానంగా స్కోప్ ఇచ్చిన దర్శకుడికి క్రెడిట్ దక్కుతుంది. ఆదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్ళై పాత్రలు పర్ఫెక్ట్‌గా వున్నాయి. హరి కె వేదాంతం కెమెరా వర్క్ సినిమాకు విజువల్ గ్రాండ్‌నెస్ తీసుకొచ్చింది. శ్రీ చరణ్ పాకాల ఇచ్చిన నేపథ్య సంగీతం ఎమోషన్ ని ఎలివేట్ చేసింది. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైన్, చిన్నా కె ప్రసాద్ ఎడిటింగ్ మరింత బలాన్ని ఇచ్చాయి. సత్యర్షి, తూమ్ వెంకట్ డైలాగ్స్ పవర్‌ఫుల్‌గా ఆకట్టుకున్నాయి. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ పెన్ స్టూడియోస్ నిర్మాణ విలువలు ఉన్నంతగా వున్నాయి. యాక్షన్, ఎమోషన్స్ సమర్థంగా మేళవించిన ఈ ట్రైలర్, ఒక పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుందని సూచిస్తోంది. గ్రాండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. అందరూ ట్రైలర్ ఎంజాయ్ చేయడం చాలా హ్యాపీగా ఉంది. ట్రైలర్ లానే సినిమా కూడా చాలా అద్భుతంగా ఉండబోతుంది. అందరూ సినిమాని సపోర్ట్ చేసి ఘన విజయాన్ని అందించాలని కోరుకుంటున్నాను. చాలా ప్రేమించి ఇష్టపడి కష్టపడి మంచి ఎక్స్పీరియన్స్ ఇవ్వాలని చేశాం. మే 30న భైరవం మీ అందరి ముందుకు వచ్చి మీ అందరిని అలరిస్తుంది.



# శ్రియా ఫిట్నెస్ సీక్రెట్ ఇదే..

ఒకప్పుడు ఆమె పాన్ ఇండియా హీరోయిన్. తెలుగు, తమిళంలో అగ్ర హీరోలతో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి స్టార్ డమ్ సంపాదించుకుంది. బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసిన ఈ ముద్దుగుమ్మ తెలుగులో ఒకప్పుడు టాప్ హీరోయిన్. మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, ఎన్టీఆర్, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ఇప్పుడు సినిమాల్లో సహాయ నటిగా కొనసాగుతుంది. తెలుగులో ఒకప్పుడు టాప్ హీరోయిన్. మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, ఎన్టీఆర్, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ఇప్పుడు సినిమాల్లో సహాయ నటిగా కొనసాగుతుంది. ప్రస్తుతం శ్రియా వయసు 42 సంవత్సరాలు. ఇప్పటికీ కుర్ర హీరోయిన్లకు పోటీగా ఏమాత్రం తరగని అందంతో మెస్మరైజ్ చేస్తోంది శ్రియా. ఈ క్రమంలోనే తాజాగా తన ఫిట్నెస్, డైట్ ప్లాన్ రివీల్ చేసింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం శ్రియా వయసు 42 సంవత్సరాలు. ఇప్పటికీ కుర్ర హీరోయిన్లకు పోటీగా ఏమాత్రం తరగని అందంతో మెస్మరైజ్ చేస్తోంది శ్రియా. ఈ క్రమంలోనే తాజాగా తన ఫిట్నెస్, డైట్ ప్లాన్ రివీల్ చేసింది ఈముద్దుగుమ్మ. ప్రతిరోజు కఠినమైన వ్యాయమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తానని తెలిపింది శ్రియా. అలాగే తన దిన చర్యలో యోగా కచ్చితంగా ఉండాల్సిందే అని.. మానసిక ప్రశాంతత కోసం నిత్యం యోగాసనాలు చేస్తానని తెలిపింది. ప్రతిరోజు కఠినమైన వ్యాయమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తానని తెలిపింది శ్రియా. అలాగే తన దిన చర్యలో యోగా కచ్చితంగా ఉండాల్సిందే.



# మరోసారి ఆడియన్స్ ముందుకు విశ్వక్ సేన్


ఒక్క సినిమా హీరోయిన్ ఫేట్ మార్చేస్తుంది అని చాలా మంది కథానాయికల కెరీర్‌లో ప్రూవ్ అయ్యింది. ఇప్పుడు అదే తరహాలో ఒక హీరోయిన్‌ని ఓవర్ నైట్ స్టార్‌ని చేసింది. అంతకుముందు నుంచి సినిమాలు చేస్తున్నా కూడా ఒక సినిమాలో అది కూడా ఆమె చేసిన సెకండ్ హీరోయిన్ రోల్‌తో సూపర్ పాపులర్ అయ్యింది. ఇంతకీ ఎవరా హీరోయిన్ అంటే డ్రాగన్ బ్యూటీ కయదు లోహార్ అని తెలుస్తుంది. కోలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించిన అమ్మడు శ్రీవిష్ణు చేసిన అల్లూరి సినిమాలో హీరోయిన్‌గా చేసింది. ఐతే అప్పుడు అసలేమాత్రం జనాల దృష్టిలో పడని కయదు రీసెంట్‌గా ప్రదీప్ రంగనాథ్ చేసిన డ్రాగన్ సినిమాతో అదరగొట్టేసింది. సినిమాలో ప్రదీప్ ఫస్ట్ హాఫ్ అనుపమని లవ్ చేస్తాడు సెకండ్ హాఫ్‌లో కయదుతో పెళ్లికి రెడీ అవుతాడు. డ్రాగన్ సినిమాలో కయదు ఎంట్రీ మామూలుగానే అనిపించినా సినిమా నడుస్తున్నా కొద్దీ ఆమె నచ్చేస్తుంది. ఒకదశలో కయదుతో ప్రేమలో పడేలా చేస్తుంది. ఇక అమ్మడి గ్లామర్ షోకి కూడా కుర్రాళ్లు ఫిదా అయిపోయారు. సో అలా కయదు లోహార్ డ్రాగన్ సినిమాతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమా రిలీజ్ తర్వాత ఆమె సోషల్ మీడియా ఫాలోవర్స్ కూడా బీభత్సంగా పెరిగారు. మరోపక్క కయదు లోహార్ తెలుగులో విశ్వక్ సేన్ సరసన ఫంకీ సినిమాలో ఛాన్స్ అందుకుంది. ఆ సినిమాతో అమ్మడు మరోసారి తెలుగు ఆడియన్స్ ముందుకు వస్తుంది. ఐతే సౌత్ ఆడియన్స్‌ని ఎప్పటికప్పుడు వాచ్ చేస్తున్న ముంబై మేకర్స్ కయదు మీద ఉన్న ఈ బజ్ చూసి ఆమెని అక్కడ సినిమాల్లోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారట. ఓ విధంగా ఇది గొప్ప విషయమని చెప్పొచ్చు. డ్రాగన్ సినిమాతో కయదు నిజంగానే తన సత్తా చాటి అదరగొట్టే ఛాన్స్‌లు అందుకుంటుంది. అమ్మడు ఇటు సౌత్‌తో పాటు బాలీవుడ్‌లో కూడా ఛాన్స్ అందుకుంటే మాత్రం అక్కడ ఆడియన్స్‌ని కూడా తన బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తుందని చెప్పొచ్చు. నిజంగానే కయదు బాలీవుడ్ షిఫ్ట్ అయితే మాత్రం అక్కడే టాప్ రేంజ్‌కి వెళ్లే ఛాన్స్‌లు ఉన్నాయనిచెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.



# 'కలివి వనం' పోస్టర్ రిలీజ్

ఏఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిర్మాతలుగా రాజ్ నరేంద్ర రచనా దర్శకత్వంలో పూర్తి తెలంగాణ పల్లెటూరి బ్యాక్ డ్రాప్‌లో చిత్రీకరించిన సినిమా కలివి వనం. ఈ చిత్రానికి జియల్ బాబు సినిమా చేయగా మదీన్ ఎస్కె సంగీతం అందించారు. రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్ర నాథ్, శ్రీ చరణ్, అశోక్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించగా హీరోయిన్‌గా నాగదుర్గ ఈ చిత్రం ద్వారా పరిచయం కానున్నారు. కాసర్ల శ్యామ్, మాట్ల తిరుపతి, కమల్ ఇస్లవంత్ ఈ చిత్రానికి పాటలు అందించారు. ఈ చిత్రం వనములను సంరక్షించుకునే కాన్సెప్ట్‌తో తెలంగాణలోని జగిత్యాల జిల్లాలోని గుత్రాజుపల్లి ప్రాంతంలోని సారంగాపూర్ అడవులలో చిత్రీకరించడంజరిగింది. ఇప్పటికే తెలంగాణ విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో వచ్చిన బలగం, పొట్టేల్ వంటి చిత్రాలు లాగా ఈ చిత్రం కూడా మంచి విజయం సాధిస్తుందని చిత్ర యూనిట్ ఎంతో బలంగా నమ్ముతున్నారు. ఇప్పటికే ఈ చిత్రం షూటింగ్ ఇంకా పాటలను పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా యూట్యూబర్ మీడియా మిత్రులు, శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో కొండగట్టు బృందావన్ రిసార్ట్‌లో ఈ చిత్ర పోస్టర్ లాంచ్ ఘనంగా చేయడం జరిగింది. ముఖ్యంగా మై విలేజ్ షో శ్రీకాంత్, చందు, ధూమ్ ధాం ఛానల్ రాజు, యూట్యూబ్ స్టార్ టోనీ క్విక్, అచ్యుత్ మార్వెల్, వెంకట్ జోడు, బబ్లూ, శివమెరుపుల, మోనిక డింపుల్ తదితరులు పోస్టర్ లంచ్ కార్యక్రమాలకు హాజరైచిత్రయూనిట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





రమ్య పసుపులేటి నయా లుక్

# 'ఏస్' ట్రైలర్ విడుదల

వెర్సటైల్ యాక్టర్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా ఏస్ అనే చిత్రం మే 23న ఆడియెన్స్ ముందుకు రానుంది. దర్శక, నిర్మాత అరుముగ కుమార్ ఈ మూవీని 7సిఎస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కించారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతికి జోడిగా రుక్మిణి వసంత్ నటించారు. ఈ చిత్రాన్ని మే 23న రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో తెలుగు హక్కుల్ని శ్రీ పద్మిణి సినిమాస్ దక్కించుకుంది. శ్రీమతి పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్ మీద బి.శివ ప్రసాద్ 'ఏస్' సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేయబోతున్నారు. మే 23న రిలీజ్ కాబోతోన్న ఈ మూవీ ట్రైలర్‌ను కాసేపటి క్రితమే సోషల్ మీడియాలో వదిలారు. ఏస్ ట్రైలర్‌లో.. నా పేరు బోల్ట్ కాశీ అంటూ హీరో తనని తాను పరిచయం చేసుకోవడం.. ఆ పేరు ఏంటి? అలా ఉందేంటి? అంటూ యోగిబాబు కామెడీ చేయడం, హీరో హీరోయిన్ల పరిచయం, మలేసియాలో జరిగే ఇల్లీగల్ కార్యకలాపాలు, చేజింగ్ సీన్స్, యాక్షన్ సీక్వెన్స్ అన్నీ అదిరిపోయాయి. జూదం అనేది ఉప్పెనలాంటిది.. క్లైమాక్స్ గుర్తుంది కదా అంటూ యోగి బాబు చెప్పే కామెడీ డైలాగ్ బాగుంది. హీరో వేసే ప్లాన్ ఏంటి? అసలు దేని కోసం పోరాటం చేస్తున్నాడు? అనే ఆసక్తిని రేకెత్తించేలా ట్రైలర్‌ను కట్ చేశారు. ఏస్ ట్రైలర్‌లో సామ్ సిఎస్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. కరణ్ బి. రావత్ కెమెరా వర్క్ చాలా రిచ్‌గా కనిపించింది. ఇక ఈ మూవీని మే 23న భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు.



నటీనటులు: విజయ్ సేతుపతి, యోగి బాబు, రుక్మిణి వసంత్, దివ్య పిళ్లై, బబ్లూ పృథ్వీరాజ్, బి.ఎస్. అవినాష్, ముత్తు కుమార్, రాజ్ కుమార్, డెనెస్ కుమార్, ఆల్విన్ మార్టిన్, ప్రిసిల్లా నాయర్, జాస్పర్ సుపయా, కార్తీక్ జే, నాగులన్, జహ్రినారిస్ తదితరులు.

సాంకేతిక బృందం
నిర్మాత, దర్శకుడు: ఆరుముగకుమార్
బ్యానర్: 7సిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై. లిమిటెడ్.

# ఈ బర్త్‌డే నాకు చాలా ప్రత్యేకమైనది..
# 'డియర్ ఉమ' ఫేమ్ సుమయా రెడ్డి

తెలుగమ్మాయి హీరోయిన్‌గా, రచయితగా, నిర్మాతగా మొదటి చిత్రంతోనే మంచి గుర్తింపును సంపాదించడం అంటే మామూలు విషయం కాదు. కానీ అనంతపురం అమ్మాయి సుమయా రెడ్డి మాత్రం డియర్ ఉమ అంటూ మొదటి ప్రాజెక్ట్‌తోనే హీరోయిన్‌గా, కథా రచయితగా, నిర్మాతగా ప్రశంసల్ని అందుకున్నారు. డియర్ ఉమ చిత్రానికి థియేటర్లో ఎంత మంచి రెస్పాన్స్ దక్కిందో అందరికీ తెలిసిందే. వైద్య వ్యవస్థలోని లోపాల్ని ఎత్తి చూపుతూ తీసిన డియర్ ఉమ సినిమా అన్ని వర్గాల ఆడియెన్స్‌ను ఆకట్టుకుంది. ఇక హీరోయిన్‌గా తొలి చిత్రంతోనే సుమయా రెడ్డి అందరినీ మెప్పించారు. ఆమెలో మంచి రైటర్ ఉన్నారని ప్రశంసలు దక్కాయి. తాను నమ్మిన కథ కోసం నిర్మాతగా మారి సినిమాను తీసి సక్సెస్ కొట్టిన తెగువను అందరూ మెచ్చుకున్నారు. సుమయా రెడ్డి తన పుట్టిన రోజు వేడుకల్ని ఫ్యామిలీతో ఘనంగా జరుపుకున్నారు. ప్రస్తుతం ఆమె వరుస ప్రాజెక్టులతో ఆడియెన్స్ ముందుకు వచ్చేందుకు సిద్దం అవుతున్నారు. సుమ చిత్రా ఆర్ట్స్ బ్యానర్‌లో కొన్ని చిత్రాలు, హీరోయిన్‌గా మరి కొన్ని ప్రాజెక్టుల్ని ఆమె ఆడియెన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నారు. త్వరలోనే అన్ని ప్రాజెక్టుల వివరాల్ని ప్రకటించనున్నారు.



# 'జూనియర్' నుంచి సాంగ్ లాంచ్ ఈవెంట్

కర్ణాటక మాజీ మంత్రి, ప్రముఖ పారిశ్రామికవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయం అవుతున్న మూవీ 'జూనియర్'. వారాహి చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం ఒక లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా రాధా కృష్ణ దర్శకత్వంలో రూపొందుతోంది. ఈ చిత్రంలో టాప్ హీరోయిన్ శ్రీలీల కథా నాయికగా నటిస్తోంది. మేకర్స్ ఇటీవల ప్రకటించిన ప్రకారం ఈసినిమా జూన్ 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తూ ఫస్ట్ సింగిల్ లెట్స్ లివ్ దిస్ మోమెంట్‌ను విడుదల చేశారు. టైటిల్‌లో చెప్పినట్టే, ఎనర్జిటిక్, సెలబ్రేషన్ స్పిరిట్‌తో నిండిపోయింది. జీవితం, ప్రేమ, సంగీతం - అన్నిటినీ కలిపే ఫీలింగ్‌తో, రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఎనర్జీ ఈ పాటను మరింత రిచ్‌గా కంపోజ్ చేశారు. డీఎస్పీ హై ఎనర్జీతో, ఫుట్ టాపింగ్ బీట్‌లతో పాటను కంపోజ్ చేశారు. ఎలక్ట్రానిక్ మ్యూజిక్‌తో బ్లెండ్ అయిన ఈ ట్యూన్‌లో యువతను ఆకట్టుకునే విబ్రెన్సీ ఉంది. జస్ప్రీత్ జాజ్ వాయిస్ ఈ పాటకి శక్తినిచ్చింది. శ్రీమణి రాసిన సాహిత్యం ఎమోషన కలిగించేలా ఉంది. విజువల్‌గా ఈ పాటలో కిరీటి, శ్రీలీల మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కిరీటి గ్రేస్‌ఫుల్ డాన్స్ మూవ్స్‌తో ఆకట్టుకుంటున్నారు. కొరియోగ్రాఫర్ విజయ్ పొలాకి రూపొందించిన కొరియోగ్రఫీ అదిరిపోయింది. కలర్‌ఫుల్ సెట్స్‌పై గ్రాండ్‌గా చిత్రీకరించిన ఈ పాట విజువల్‌గా కూడా అద్భుతంగా కనిపిస్తుంది. ఈ సినిమాతో జెనీలియా మళ్లీ రీఎంట్రీ ఇస్తున్నారు. అలాగే కన్నడ సినిమా ఐకాన్, క్రేజీ స్టార్ డాక్టర్ రవిచంద్రన్ ఒక ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి అన్ని విభాగాల్లోనూ ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంటిల్ కుమార్ సినిమాకు విజువల్ గ్రాండియర్ అందించగా, రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ప్రొడక్షన్ డిజైన్ కోసం రవీందర్, యాక్షన్ కోసం ఇండియా టాప్ స్టంట్ కొరియోగ్రాఫర్ పీటర్ హైన్ పని చేశారు. డైలాగ్స్ కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని రాయగా, నిరంజన్ దేవరమనే ఎడిటర్. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఒక లైవ్ కాన్సర్ట్ చేస్తున్న ఆనందం కలిగింది ఈ వేడుక చూస్తుంటే. ఈ సినిమాలో పార్ట్ కావడం చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్ రాధాకృష్ణ సినిమాని చాలా ప్రత్యేకంగా తీశారు. స్క్రిప్ట్ చాలా యూనిక్‌గా ఉంటుంది. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. వెరీ ఎమోషనల్ అండ్ టచ్చింగ్ స్టోరీ. శ్రీమణి చాలా అద్భుతమైన సాహిత్యం రాశారు. ట్యూన్‌కి బ్యూటీని యాడ్ చేశారు. సెంథిల్ ఈ సినిమాకి వర్క్ చేయడం మరో హ్యాపీ మూమెంట్. ఈ సినిమాకి ఆయన బిగ్గెస్ట్ పిల్లర్. రవిచంద్రన్ ఈ సినిమాల్లో పార్ట్ కావడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. రవిచంద్రన్ తెలుగు చాలా అందంగా ఉంది. తెలుగు వర్షన్‌కి ఆయనే డబ్బింగ్ చెప్పాలని కోరుకుంటున్నాను. సాయిగారి బ్యానర్‌లో వర్క్ చేయడం ఒక హానర్‌గా భావిస్తున్నాను.



# 5,364 ఇందిరమ్మ ఇళ్లకు రూ. 53.64 కోట్లు చెల్లింపు

## ఇప్పటివరకు 20,104 ఇళ్ల గ్రౌండింగ్

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మఇండ్ల నిర్మాణానికి ఎన్నిఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయిన మేరకు ప్రతి సోమవారం నిధులు విడుదల చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాస రెడ్డి తెలిపారు. బేస్ మెంట్ పూర్తిచేసుకున్న 1383 ఇండ్లకు ,గోడలు పూర్తియిన 224 ఇండ్లకు సోమవారం 16.07 కోట్ల రూపాయిలను విడుదల చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు బేస్ మెంట్, గోడలు పూర్తిచేసుకున్న 5,364 లబ్దిదారులకు రూ,53.64 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. సోమవారం జూమ్ మీటింగ్ ద్వారా లబ్దిదారుల చెల్లింపులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ కింద 47,335 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా ఇప్పటి వరకు 20,104 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని వీటిలో5140 ఇండ్లు బేస్‌మెంట్, 300 ఇండ్లు గోడల నిర్మాణం వరకు మరో పది ఇండ్లు శ్లాబ్‌లవరకు పూర్తయినట్లు చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమ చేస్తున్నామని తెలిపారు.బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు,శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షలరూపాయిలు,ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామన్నారు.వానాకాలాన్ని దృష్టిలోపెట్టుకొని వీలైనంత త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**5వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు 10వేల దరఖాస్తులు**

రాష్ట్రంలో భూపరిపాలనను మరింత మెరుగుపరచడానికి ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సిఎం నాయకత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని రెవెన్యూ,హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జతపరచడం తప్పనిసరి చేశామని,ఈ విధానాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకురావడానికిపెద్దసంఖ్యలో సర్వేయర్ల అవసరాన్ని గుర్తించామన్నారు.ఇందుకోసం ఐదువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించగా 10,031 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై సోమవారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 26వ తేదీ నుంచి గచ్చిబౌలి లోని సర్వే ట్రైనింగ్ అకాడమీ ( గితిలి.లీ) లో రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం వలన గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు భూ వివాదాలను పరిష్కరించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం వలన గ్రామీణ ప్రాంతాలలోఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు భూ వివాదాలను పరిష్కరించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. డిజిటలైజేషన్ ఆఫ్ విలేజ్ మ్యాప్స్ టిజిఆర్ఏసి (తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్) ద్వారా సర్వే రికార్డులను (మ్యాపులు) డిజిటలైజేషన్ చేస్తున్నామన్నారు. ప్రయోగాత్మకంగా నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని లింగాల గ్రామం, జగిత్యాల జిల్లా మాల్యాల మండలంలోని తక్కలపల్లి, ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి మూడు గ్రామాలలో ఈ ప్రక్రియను రెండు రోజుల్లో ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఈడిజిటల్ మ్యాప్ లను ఎక్కడినుండైనా సులభంగా యాక్సెస్ చేయవచ్చని, మాన్యువల్ పద్ధతుల కంటే వేగంగా మరియు తక్కువ ఖర్చుతో ఖచ్చితమైన సమాచారం పొందవచ్చన్నారు.డిజిటల్ మ్యాపింగ్ ద్వారా భూక్షేత్రాల పరిమాణం,ఆకృతి వంటి వివరాలు ఖచ్చితంగా పొందవచ్చన్నారు.ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెరగడంతో పాటు మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. పునరుద్ధరణ, భద్రత డిజిటల్ రూపంలో భద్రంగా నిల్వ చేయవచ్చు కాలానుగుణంగా అప్డేట్ చేయవచ్చన్నారు.



సిద్దిపేటలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# ముష్కర మూకల నుంచి దేశ రక్షణకు ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలి

## తిరంగా ర్యాలీలో మెదక్ ఎంపి రఘునందన్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** దొంగ దెబ్బతీసిన పాకిస్థాన్ ముష్కర మూకలకు ఆపరేషన్ సిందూర్ పేరిట ప్రధాని మోడీ నాయకత్వంలో సైనికులు తగిన గుణపాఠం చెప్పారని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం..త్రివిధ దళాలకు వందనం అంటూ ప్రధాని మోడీ, భారత సైనికులకు సంఘీభావంగా సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బిజెపి నాయకులు,ఆర్ఎస్ఎస్, భజరంగదళ్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు జాతీయ జెండాను చేతబూని నినాదాలు చేశారు. వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలోని శివాజీ చౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ లాల్ కమాన్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రధాని మోడీ నాయకత్వమే దేశానికి రక్ష అన్నారు. కుహన లౌకిక వాదులకు తగిన గుణపాఠం చెప్పాల్సిన అసమయం అసన్నమైందన్నారు. ప్రధాని మోడీ మెకిన్ ఇండియా నినాదం దేశంలోనే తయారైన క్షిపణులు శత్రు దేశాల క్షిపణులను కూల్చి వేశాయన్నారు. ముష్కర ముఖల నుంచి దేశాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరితో పాటు యువత భాగస్వాములు కావాలన్నారు.

# ఎంపిహెచ్‌ఎ(ఫిమేల్) రాతపరీక్ష ఫలితాలు విడుదల

## 1,931 పోస్టులకు 20,600 మంది అభ్యర్థులు హాజరు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. అందులో భాగంగా సోమవారం మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(ఫిమేల్) పోస్టులకు సంబంధించిన రాతపరీక్ష ఫలితాలను తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. ఉద్యోగాల భర్తీలో స్పీడ్ పెంచిన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు వరసగా వివిధ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తూ వస్తోంది. 10 రోజుల వ్యవధిలోనే 732 ఫార్మసిస్ట్(గ్రేడ్-2), 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేయగా.. సోమవారం ఎంపీహెచ్‌ఏ(ఫీమేల్) రాత పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. 1931 పోస్టులకుగానూ, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సిబిటి) విధానంలో పరీక్షను నిర్వహించగా.. పరీక్షకి 20,600 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులకి సంబంధించిన మార్కుల జాబితా బోర్డు వెబ్ సైట్‌లో అందుబాటులో ఉందని, హాల్‌టికెట్, ఇతర వివరాలు ఎంటర్ చేసి మార్కులు చెక్ చేసుకోవాలని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సూచించింది. ఇందుకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టును త్వరలోనే విడుదల చేయనున్నట్టు బోర్డు ప్రకటించింది.




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న అంబటి కృష్ణమూర్తి

# అంబటి, అనుచరులపై సంజీవరెడ్డి వర్గీయులు దాడి

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 19, ప్రభాతవార్త:** ఐఎన్‌టియుసి (రాహుల్‌గాంధీ) జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, అతని అనుచరులపై సోమవారం మధ్యాహ్నం పట్టపగలు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాజ్యసభ మాజీ సభ్యుడు, ఐఎన్‌టియుసి మాజీ నేత జి.సంజీవరెడ్డి వర్గీయులు దాడి చేశారు. అంబటి కృష్ణమూర్తిపై చంద్రశేఖర్, ఆయన వర్గీయులు దాడి చేయడంతో అంబటి అనుచరులు ఈ దాడిని అడ్డుకున్నారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకుని రెండు వర్గాలను విడదీశారు. దీంతో అంబటి కృష్ణమూర్తి వర్గం ప్రెస్‌క్లబ్‌లోని వేదికపైన కూర్చొని మాట్లాడటానికి సిద్ధమైంది. ఇంతలో సంజీవరెడ్డి వర్గీయులు ద్వారం వద్ద నిలబడి అసభ్యకరమైన పదజాలలతో దూషించారు. సంజీవరెడ్డి జిందాబాద్, ఐఎన్‌టియుసి జిందాబాద్ అంటూ నినాదాలు చేసి అక్కడే బైఠాయించారు. కార్యకర్తలు వీరంగం వేయడంతో అక్కడ పరిస్థితి రణరంగంగా మారింది. అంబటి అనుచరులు ప్రెస్‌క్లబ్‌లో కట్టిన బ్యానర్‌ను తీసివేయాలని, ఐఎన్‌టియుసి పదాన్ని ఉపయోగించ రాదంటూ సంజీవరెడ్డి వర్గీయులు పట్టుబట్టారు. అక్కడే ఉన్న పోలీసులు, జర్నలిస్టులు సంజీవరెడ్డి వర్గీయులకు చాలా సేపు నచ్చచెప్పినా వినిపించుకోలేదు. చివరకి పోలీసుల హెచ్చరికలతో వారు బయటకు వెళ్ళిపోయారు. సంజీవరెడ్డి అనుచరుడు చంద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఐఎన్‌టి యుసి(ఆర్) జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ తమపై దాడి చేసిన జి.సంజీవరెడ్డి అనుచర గుండాలపై ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జనక్‌ప్రసాద్ బృందం తనపైన చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, నిరాధారమైన అసత్య ఆరోపణలను వెంటనే ఉపసంహరించుకోవాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే చట్టపరమైన చర్యలు వారిపైన తీసుకోకతప్పదని హెచ్చరించారు.

# విచ్ఛిన్నసభగా మారిన బిఆర్ఎస్ రజతోత్సవ సభ

## మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ రజతోత్సవ సభ ఆపార్టీకి విచ్ఛిన్న సభలా మారిందని మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో విలేఖరులో మాట్లాడుతూ బి ఆర్ ఎస్ అంటే కేసీఆర్ కి బాపు రాష్ట్ర సమితి,కొడుకు కేటీఆర్ కి బి ఆర్ ఎస్ అంటే బేటా రాష్ట్ర సమితి అయ్యింది. కవితకు బిఆర్ఎస్ అంటే భేటీ రాష్ట్ర సమితి అయ్యింది.హరీష్ రావు కి బిఆర్ఎస్అంటే బతీజా (మేనల్లుడు) రాష్ట్ర సమితి అయ్యిందని చలోక్తి విసిరింది. ఎల్ ఒ పి ఇస్తే కష్టపడతా అన్నట్లు హరీష్ రావు వైఖరి కనిపిస్తుందని అన్నారు.కెటిఆర్‌కన్నా హరీష్ రావు కి ఎమ్మెల్యేల మద్దతు ఎక్కువ ఉందని అన్నారు.పార్టీ గడ్డమీద పడేందుకు కలసి పోదాం అని కేసీఆర్ కేటీఆర్ కి చెప్పాడు.లోపల ఎన్ని ఇబ్బందులు ఉన్నా బయటకి మంచిగా ఉందాం అనుకున్నారని ఆయన వివరించారు.అసెంబ్లీ ప్రతిపక్ష నేత పదవి హరీష్ రావు కి ఇస్తే, రాజకీయ గండంగా భవిష్యత్ లో మారుతాడు అని కెటిఆర్ కి స్పష్టత ఉందని సామ రామమోహన్‌రెడ్డి అన్నారు.కెసిఆర్ ఆలే నరేంద్ర నుంచి ఈటెల రాజేంద్ర వరకు పార్టీలో నుంచి ఎవరిని ఎలా బయటకి పంపారో హరీష్‌కి తెలుసు జాగ్రత్తగా వుండాలని సామ సలహా ఇచ్చారు.

కేటీఆర్‌తో హరీష్ రావు సంధి చేసుకుంటే,హరీష్ రావు కి రాజకీయ భవిష్యత్ ఉండదని జోస్యం చెప్పారు.ఒక వేళ ప్రతిపక్ష నేత పదవి ఇస్తే బీజేపీ తో చేతులు కలిపి కేటీఆర్ రాజకీయ భవిషత్ ఖతం చేస్తాడని అని అన్నారు.పదేళ్ల జిల్లాలను కుటుంబ సభ్యులు వాటాలు వేసుకొని లూటీ చేశారు.బిఅరెస్ నాయకులు ఎవరి ఉనికికోసం వారు చదరంగం ఆడు తున్నారని అన్నారు. కెసిఆర్ ఫ్యామిలిలో కలహాలు తారస్థాయికి చేరాయి. కేటీఆర్ మాటలు నమ్మి హరీష్ వెనక్కి తగ్గితే, ఆయన ఖేల్‌ఖతం, హరీష్‌కి పోస్ట్ వస్తే కేటీఆర్ ఖతమని అన్నారు. కాంగ్రెస్‌ను తిట్టే సాకుతో వైఫల్యం చెందిన అం శాలపైనే హరీశ్‌రావు మాట్లాడుతున్నారు.

# దోస్త్‌లో 63,305 మంది రిజిస్ట్రేషన్

## 42,934 మంది దరఖాస్తులు అప్‌లోడ్

## 30 నుంచి జూన్ 6 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవకాశం

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో.. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025లో సోమవారం సాయంత్రం వరకు 42,934 మంది దరఖాస్తు చేసుకున్నారు. దోస్త్‌లో ఇప్పటి వరకు 63,305 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారిలో 53,161 మంది పేమెంట్ చేశారు. వారిలో తమ పూర్తి వివరాలతో 42,934 మంది దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు. ఇప్పటి వరకు 31,577 మంది తమకు ఏ కాలేజీలో సీటు కావాలని కోరుతూ వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. రేపటి(బుధవారం-మే 21) వరకు మొదటి విడతలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 22 వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 29న సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 30 నుంచి జూన్ 6 వరకు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని దోస్త్ అధికారులు ఇప్పటికే షెడ్యూల్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. 2024-25 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 1066 కాలేజీల్లో 4,49,449 సీట్లు అందుబాటులో ఉండగా.. ఈ ఏడాది అదికాస్త 1057 కాలేజీల్లో 4,57,724 సీట్లకు పెరిగింది. డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీబీఎంలలో అడ్మిషన్లు ఇవ్వనున్నారు. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీల్లో అడ్మిషన్లను దోస్త్ ద్వారా చేపట్టనున్నారు. రూ. 200తో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రాష్ట్రంలోని 1057 డిగ్రీ కాలేజీలు ఉండగా.. వాటిలో 143 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలున్నాయి. విద్యార్థి ఫోన్ నంబర్ ఆధార్‌తో లింక్ అయి ఉంటే నేరుగా దోస్త్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆధార్‌తో ఫోన్ నంబర్ లింకు కాకుంటే తల్లి లేదా తండ్రి ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి టీ యాప్ పోలియో మొబైల్ యాప్ ద్వారా ఫోటో అథెంటికేషన్‌ను చేసుకోవడానికి వీలవుతుంది. 7901002200 నంబర్‌కు హాయ్ అని పంపిస్తే దోస్త్ మెను రావడమే కాకుండా ఎలా దరఖాస్తు చేసుకోవాలో చెబుతుంది. ఫేస్‌బుక్ అకౌంట్‌తోపాటు, ట్విట్టర్ అకౌంట్‌కూడా ఓపెన్ చేశారు. అలాగే దోస్త్ యూట్యూబ్ ఛానల్‌లో హెల్పింగ్ వీడియోలను కూడా చూడవచ్చు. రెండో విడత రిజిస్ట్రేషన (రూ.400తో) మే 30 నుంచి జూన్ 8వరకు అవకాశం కల్పించారు. వెబ్ ఆప్షన్లు మే 30 నుంచి జూన్ 9 వరకు.. జూన్ 13న సీట్ల కేటాయింపు చేయనున్నారు. సెల్ఫ్ రిపోర్టింగ్ జూన్ 13 నుంచి జూన్ 18 వరకు చేయాల్సి ఉంటుంది. ఇక మూడో విడత రిజిస్ట్రేషన్ (రూ.400తో) జూన్ 13 నుంచి జూన్ 19 వరకు అవకాశం కల్పించగా.. జూన్ 13 నుంచి జూన్ 19 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. వారికి సీట్ల కేటాయింపు జూన్ 23న చేయనున్నారు. సీటు పొందిన వారు జూన్ 23 నుంచి జూన్ 28 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. జూన్ 30 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం క్లాసులు ప్రారంభించడానికి అధికారులు అకడమిక్ క్యాలెండర్‌ను సిద్ధం చేశారు.

# జిబిఆర్ క్రిప్టో కాయిన్స్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** యేడాది క్రితం దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన జిబిఆర్ క్రిప్టో కరెన్సీ కేసులో మరో ఇద్దరు నిందితులను సిఐడి అధికా రులు అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన వారి సంఖ్య ఐదుకు చేరింది. దీనికి సంబంధించిన వివరాలను సిఐడి డిజి శిఖా గోయల్ సోమవారం మీడియాకు వెల్లడించారు. గత ఏడాది హైదరాబాద్ కేంద్రంగా వెలుగు చూసిన జిబిఆర్ క్రిప్టో కరెన్సీ అనే సంస్థ 1200 నుంచి 1400 మంది అమాయకుల నుంచి అధిక వడ్డీ, మంచి లాభాల పేరిట 95 కోట్ల రూపాయలను వసూలు చేసి బోర్డు తిప్పేయగా దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు సిఐడి అధికారులు తెలంగాణ డి పాజిటర్ల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు,

ఈ కేసులో అసలు నేరగాడు జిబిఆర్ కంపెనీ అధినేత కుర్రిమేల రమేష్ గౌడ్‌తో పాటు అతని భార్య కుర్రిమేల ఉమారాణి, వీరి సన్నిహితుడు రవి కుమార్ రెడ్డిలను ఆరు నెలల క్రితం అరెస్టు చేశారు. కాగా ఈ కేసులో పరారీలో వున్న ఎ11 నిందితుడు సైనిక్‌పూరికి చెందిన కొడవకంటి సుధాకర్ (42), వనస్థలిపురం నివాసి ఎ12 నిందితుడు కర్నాటి రమేష్ రెడ్డి (49)లను ఆదివారం నాడు అరెస్టు చే శారు. వీరిద్దరి నుంచి రెండు సెల్‌ఫోన్లను జప్తు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించారు. ఈ కేసులో పరారీలో వున్న మిగతా వారి కోసం గాలిస్తున్నారు. కాగా ఈ తరహా గోల్‌మాల్ సంస్థల పట్ల ప్రజలు జాగ్రత్తగా వుండాలని సిఐడి డిజి శిఖా గోయల్ కోరారు.

# కిషన్‌రెడ్డి.. ప్రజాసేవ దృక్పథం పెంచుకో

## భారతమాత హారతి దుర్ఘటనపై సిఎం విమర్శలు చేయలేదు

## పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** కిషన్ రెడ్డి రాజకీయం చేయడం మానుకో సర్వీస్ చేయడం నేర్చుకో ప్రజాసేవ దృక్పథం పెంచుకో అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డి హితవు చెప్పారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ భారత మాతకు హారతి సందర్భంగా ట్యాంక్‌బండ్ లో టపాకాయలు కాల్చితే ముగ్గురు అనుకోకుండా చనిపోతే సిఎం రేవంత్ రెడ్డి విమర్శలు చేశారా?,గుజరాత్ లో బ్రిడ్జి కూలిపోతే 140 మంది చనిపోతే రాహుల్ గాంధీ రాజకీయం చేశారా? కిషన్ రెడ్డి నీవెందుకు అనుకోకుండా జరిగిన ప్రమాదం పై రాజకీయం చేస్తున్నావు అని ఆయన నిలదీశారు. చర్ల పల్లి రైల్వే స్టేషన్ ఈదురు గాలి కే రేకులు




పడిపోలేదా? ప్రకృతి వైపరీత్యం అని మేం స్పందించలేదే అని ఆయన ప్రశ్నించారు.గుల్జార్ హౌస్ లో ఘటన జరిగిన నిమిషాల్లోనే చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారని అన్నారు. అగ్ని ప్రమాదంలో 17 మంది చనిపోవడం బాధాకరమే సిఎం రేవంత్ కూడా వాళ్ళను బతికించే ప్రయత్నం చేశారని అన్నారు.సిఎం అక్కడికి వెళ్తే,జరగాల్సిన సహాయక చర్యలకు ఇబ్బంది కలుగుతుందనే ఫోన్ లోనే ఆదేశాలు ఇచ్చారని జగ్గారెడ్డి వివరణ ఇచ్చారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి గా కాకుండా,బాధ్యత లేని లీడర్ గా మాట్లాడినట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి ఎందుకు అలా మాట్లాడారు అంటే ఈ మధ్య కేటీఆర్ ఏం చెప్తే అదే కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారు నాకు ఒకరు చెప్పారు బహుశా అందుకే ఆయన అలా మాట్లాడి ఉంటారని అనిపిస్తుంది. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు నాకు విచిత్రం అనిపించింది అని అన్నారు. సిఎం రేవంత్ ఆదేశాలతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ దామోదర రాజ నర్సింహాల, ఎంపి అనిల్ యాదవ్,మేయర్ విజయలక్ష్మి.... సంఘటన స్థలం నుండి పోస్టుమార్టం అయ్యే వరకు ఆసుపత్రిలోనే ఉన్నారని గుర్తుచేశారు.గుల్జార్ హౌస్ లో 17 మంది మృతి చెందటం బాధాకరం వార్త తెలిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే జిహెచ్‌ఎంసి అధికారులను అలెర్ట్ చేశారని తెలిపారు.

# సంజయ్ ఏ పార్టీనో స్పీకర్‌ను అడిగితే తెలుస్తుంది

## జగిత్యాలలో కలిసి పనిచేయడానికి ఆయన ఎవరు?: మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** సంజయ్ ఏపార్టీనో స్పీకర్‌ను అడిగితే తెలుస్తోంది,జగిత్యాలలో కలిసి పని చేయడానికి సంజయ్ ఎవరు? అని మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీనో నాకు తెలియదు? నేను చాలా సీనియర్‌ని నాకు జగిత్యాల డెవలప్‌మెంట్ మీద అవగాహన ఉందని అన్నారు. జగిత్యాల లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆహ్వానించాం అభివృద్ధికి నిధుల ఇస్తానని పొంగులేటి చెప్పారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కుల, జనగణన చేస్తామనటం హర్షించదగ్గ విషయం అని ఆయన అన్నారు. స్థానిక సంస్థలలో బిసిల ప్రాతినిధ్యం పెరిగేలా రిజర్వేషన్ శాతం పెంచడానికి బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ కేంద్రానికి లెటర్ రాసే విధంగా ఆర్ కృష్ణయ్య చొరవ తీసుకోవాలని జీవన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బలహీన వర్గాలకు సామాజిక న్యాయం కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ముందు ఉంది అని ఆయన చెప్పారు. కులగణన చేయడం తో బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆలోచన అని ఆయన అన్నారు. రాహుల్‌గాంధీ ఆలోచన ప్రకారం తెలంగాణ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి కులగణన చేసి మండలిలో, అసెంబ్లీలో ఆమోదం పొంది గవర్నర్‌తో స్క్రూటిని కి ఆమోదం లభించిందని అన్నారు. లీగల్‌గా ఇబ్బందులు కలగొద్దని కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. 9వ షెడ్యూల్‌లో చేర్చితే బలహీనవర్గాల, విద్యార్థులకు, ఉద్యోగులకు 42 శాతం రిజర్వేషన్ కలుగుతుంది. ఇప్పుడు బాల్ కేంద్ర ప్రభుత్వం కోర్టులో ఉంది. ఒబిసిల రిజర్వేషన్లు కూడా రాష్ట్రాలకు అనుగుణంగా చేయాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

# మూడు సమాచార కమిషనర్ల పోస్టులు బిసిలకే కేటాయించాలి

## లేదంటే ప్రభుత్వంపై యుద్ధభేరి : జాజుల హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమాచార శాఖ కమిషన్‌కు నియమించిన ఆరుగురు కమిషనర్ల పోస్టుల్లో ఒక్కరూ కూడా బిసిలు లేరని, మిగిలిన 3 కమిషనర్ల పోస్టులను బిసిలకే ఇవ్వాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమిషనర్ పదవుల నియామకాల్లో బిసిలకు చేసిన అన్యాయంపై ప్రభుత్వం సమీక్ష చేసుకుని చేసిన తప్పును సరిదిద్దుకుని 48 గంటల్లోగా ఆ 3 కమిషనర్ పోస్టులను బిసిలకే కేటాయించి న్యాయం చేయాలని ఆయన కోరారు. లేదా రాష్ట్రంలో ప్రభుత్వంపై బిసిల 'యుద్ధభేరి' మోగిస్తారని, బిసిలు నిప్పులాంటి వారని సద్వినియోగం చేసుకుంటే ఉపయోగపడతారని, లేకపోతే ఇంటికొకరు నింపులా మండుతారని హెచ్చరించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాజుల శ్రీని వాస్‌గౌడ్ మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం జనాభా దామాషా ప్రకారం నామినేటేడ్ పదవుల్లో మా వాటా మాకేందుకు ఇవ్వరని ప్రశ్నించారు. బిసిలకు అన్యాయం జరుగుతుంటే కాంగ్రెస్ పార్టీలోని బిసిలకు ఎందుకు స్పంచడం లేదన్నారు. ఈ సమా వేశంలో బిసి నేతలు బాలగాని బాలరాజ్‌గౌడ్, ప్రొఫెసర్ ఎం.భాగయ్య, యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, కనకాల శ్యాం తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆఫర్లు

## సిమెంట్, స్టీలు ధరలు భారీగా తగ్గింపు

## కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్న అధికారులు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు ఊరటనిచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఉక్కు ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం నిర్మాణ సంస్థలతో చర్చలు జరుపుతోంది. మార్కెట్ ధరల కంటే తక్కువకు సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు కోరింది.త్వరలోనే దీనిపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.ఇందిరమ్మ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షలఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ హౌసింగ్ స్కీమ్ లబ్ధిదారులకు ఊరటనిచ్చే చర్యలు చేపడుతోంది. ఈ పథకం కింద ప్రభుత్వం ఇల్లు కట్టుకునే వారికి నాలుగు దశల్లో రూ. 5 లక్షలను వారి ఖాతాల్లో జమ చేస్తుంది. ఇప్పటికే ప్రతి జిల్లాలోనూ మండలాల వారీగా అర్హులను ఎంపిక చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పునాది పనులు కూడా చేపట్టలేని వారికి ప్రభుత్వం శుభవార్త తెలిపింది.ఇంటి నిర్మాణానికి అధికంగా అవసరమయ్యే సిమెంట్,ఉక్కు ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.తక్కువ ధరలకు సిమెంట్, ఉక్కు సరఫరా చేయాలని కోరుతూ నిర్మాణ సంస్థలతో ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. మార్కెట్ ధరల కంటే ఎంత తక్కువకు సరఫరా చేయగలరో తెలియజేస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. పరిశ్రమల ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, పరిశ్రమల ఇన్చార్జి కమిషనర్ మల్సూర్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతం ఇటీవల సిమెంట్, ఉక్కు సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి దాదాపు 15 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో సిమెంట్ బస్తా ధర రూ. 320 ఉండగా, పథకం కోసం రూ. 260కి సరఫరా చేయాలని అధికారులు కోరారు. అలాగే.. మార్కెట్లో ఉక్కు టన్ను ధర రూ. 50,000 నుండి రూ. 55,00 మధ్య ఉండగా.. పథకానికి రూ. 47,000కు సరఫరా చేయాలని కోరారు. ఒక్కో ఇంటికి 180 సిమెంట్ బస్తాల చొప్పున ఈ ఏడాది 4 లక్షల 50 వేల ఇళ్లకు 9 మిలియన్ టన్నుల సిమెంట్, ఒక్కో ఇంటికి 1500 కిలోల ఉక్కు చొప్పున 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ఉక్కు అవసరమని అధికారులు కంపెనీల ప్రతినిధులకు వివరించారు. రాబోయే 5 సంవత్సరాలలో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ గృహాలను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకానికి అవసరమైన సిమెంట్, ఉక్కు పూర్తి వివరాలను ప్రభుత్వ ఉన్నతాధికారులు సిమెంట్, ఉక్కు సంస్థల ప్రతినిధులకు అందజేశారు. సోమవారం నాటికి తమ ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులు కోరారు. సంస్థల నుండి ప్రతిపాదనలు అందిన తర్వాత, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, గతంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డికి అందజేస్తామని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన తెగల్లో అత్యంత వెనుకబడిన చెంచు వర్గానికి ఈ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రాధాన్యం కల్పించనున్నట్లు ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. చెంచుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ నియోజకవర్గాల్లో ఏకంగా 10 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

# ఒక్క టీం గెలుపుతో.. మారిన ప్లేఆఫ్స్

## కీలకమవుతోన్న ఒక్కో మ్యాచ్





**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)-2025, సీజన్ 18 రానురాను మరింత ఉత్కంఠ భరితంగా మారుతోంది. ప్లేఆఫ్స్ అర్హత కోసం ఒక్కో మ్యాచ్ కీలకంగా మారుతుంది. వివిధ జట్ల విజయం ఇతర టీమ్‌రూట్‌ను ప్రభావితం చేయ దంతో ఈ సీజన్ చివరి దశలకు చేరే విషయమై ఆసక్తికరమవుతోంది. ఐపిఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ అద్భుత విజయాన్ని సాధించి ప్లేఆఫ్స్‌కు అర్హతపొందింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ బలమైన ఆటతీరు ప్రదర్శించి, భారీ టార్గెట్ అయిన 200 పరుగులను ఛేదించి విజయాన్ని అందుకుంది. ఈ విజయానికి ప్రధాన కారణంగా శుభ్‌మాన్ గిల్, సాయి సుదర్శన్ జోడి నిలిచారు. వీరిద్దరూ నిరంతరం జట్టుకు స్థిరతను అందిస్తూ ఢిల్లీ బౌలింగ్ దాడిని ధ్వంసం చేశారు. ఈ విజయంతో గుజరాత్ తన ఖాతాలో 18 పాయింట్లను చేరేసుకుని టోర్నమెంట్ ప్లేఆఫ్స్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పటి వరకు 12 మ్యాచ్‌ల్లో 9 విజయాలను నమోదు చేసిన గుజరాత్, టేబుల్ లోపై భాగానికి చేరింది. ఈ విజయం గుజరాత్ టైటాన్స్‌కేకాకుండా రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లకు కూడా ఎంతో ప్రయోజనాన్ని అందించింది. గుజరాత్ విజయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు కూడా తమ నెట్ రన్‌రేట్ ఆధారంగా 17 పాయింట్లతో ప్లేఆఫ్స్ రేసులో కొనసాగుతున్నాయి. ఇప్పుడు ఈ మూడు జట్లు టాప్ 2 స్థానాల కోసం పోటీ పడనున్నాయి. వాటికి మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి, దీంతో లీగ్ మరింత ఉత్కంఠ భరితంగా మారింది. ఇక ఢిల్లీక్యాపిటల్స్ విషయాని కొస్తే, ప్రస్తుతం వారు 13 పాయింట్లతో నిలిచారు. తమ మిగిలిన రెండు మ్యాచ్‌లు గెలిచినా సరే, వారి పేలవమైన నెట్ రన్‌రేట్ కారణంగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో క్లిష్టత ఉంది. ఇది వారిని ఆందోళనకు గురిచేసే అంశంగా మారింది. మరో వైపు, ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ ఆశలను కొనసాగించాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌లను తప్పనిసరిగా గెలవాలి. ప్రస్తుతం ఖాతాలో 14 పాయింట్లు ఉన్నాయి. మరో రెండు విజయాలతో ఈ టీమ్ కూడా 18 పాయింట్లకు చేరుకొని, ప్లేఆఫ్స్‌కు అర్హతపొందే అవకాశాన్ని సాధించగలదు. అయితే, ఒక మ్యాచ్‌ఓడిపోతే వారు తీవ్రమైన ఒత్తిడికి లోనవడం ఖాయం. ఈ నెల 21న జరగనున్న ముంబైఇండియన్స్-ఢిల్లీక్యాపిటల్స్ మ్యాచ్ ఐపిఎల్ 2025 ప్లేఆఫ్స్‌కు అర్హత పొందే నాలుగో జట్టును నిర్ణయించగల కీలకమైన పోరాటంగా మారనుంది. ఈమ్యాచ్ ఫలితం లీగ్ టేబుల్‌నుపూర్తిగా మార్చివేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఐపిఎల్ 18 సీజన్ మరింత ఉత్కంఠభరితంగామారి, ఒక్కో మ్యాచ్ ప్లేఆఫ్స్ అర్హతకోసం కీలకంగా మారింది.



# మహిళల ఆసియా కప్‌కు గుడ్‌బై

## పాక్ వైఖరితో భారత్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల మధ్య ఇటీవల ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బిసిసిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఎసిసి)కు పాకిస్తాన్ అంతర్గత మంత్రి మరియు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధిపతి అయిన మొహ్సిన్ నఖ్వీ అధ్యక్షత వహిస్తున్నారు. దీంతో అన్ని ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఈవెంట్‌ల నుండి వైదొలగుతోంది. వచ్చే నెలలో శ్రీలంకలో జరగనున్న మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ నుండి భారతదేశం అధికారికంగా వైదొలగడంతో, ఈ నిర్ణయాన్ని ఇప్పటికే ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు తెలియజేయడం జరిగింది. అలాగే దీంతో పాటు, సెప్టెంబర్‌లో భారత్ వేదికగా జరగాల్సిన ద్వైవార్షిక పురుషుల ఆసియా కప్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోనప్పటికీ, టోర్నమెంట్ భవిష్యత్తు ఇప్పుడు అంధకారంగా కనిపిస్తోంది. ఈ టోర్నమెంట్ నుండి కూడా భారత్ వైదొలగాలని భావిస్తోంది. క్రికెట్‌కు సంబంధించి పాకిస్తాన్‌ను ఒంటరి చేయడమే లక్ష్యంగా భారత్ ఈ చర్యలకు ఉపక్రమించింది. ఇక పురుషుల ఆసియా కప్‌లో భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ మరియు శ్రీలంక జట్లు పాల్గొంటున్నాయి. 2023 ఫైనల్‌లో శ్రీలంకను ఓడించి భారతదేశం డిఫెండింగ్ ఛాంపియన్‌గా నిలిచింది. ఆ ఎడిషన్ కూడా భారతదేశం పాకిస్తాన్ ఉద్రిక్తతలతో దెబ్బతింది. మొదట్లో పూర్తిగా పాకిస్తాన్ ఆతిథ్యం ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ, భారతదేశం సరిహద్దు దాటి ప్రయాణించడానికి నిరాకరించడంతో, దాని అన్నిమ్యాచ్‌లు శ్రీలంకకు మారడంతో ఈ టోర్నమెంట్‌ను హైబ్రిడ్ మోడల్‌లోకి మార్చారు. ఇప్పుడు భారత్ పురుషుల ఆసియా కప్‌ను బాయ్‌కట్ చేయనుండటంతో ఈ టోర్నీపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ ఆసియా కప్‌లో భారత్ పాల్గొనకపోతే టోర్నీ జరగడం దాదాపుగా అసాధ్యం. అంతర్జాతీయ ఈవెంట్లకు స్పాన్సర్లలో ఎక్కువ మంది భారత్‌కు చెందిన వారే ఉండటంతో ఈ టోర్నీపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

# ఇటాలియన్ ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్ అల్కరాజ్

## వరల్డ్ నంబర్ వన్ సిన్నర్ 7-6తో సంచలన ఓటమి



**న్యూఢిల్లీ:** ఇటాలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్ ఛాంపియన్‌గా నిలిచాడు. రోమ్‌లోని ఫోరో ఇటాలికోలో సోమవారం జరిగిన ఇటాలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో అల్కరాజ్ తన ప్రత్యర్థి జానిక్ సిన్నర్‌ను 7-6 (7/5), 6-1 తేడాతో ఓడించి ట్రోఫీని గెలుచుకున్నాడు. దీంతో సిన్నర్ తర్వాత ప్రపంచ నంబర్ టూ స్థానాన్ని అల్కరాజ్ చేరుకున్నాడు. ఈ వారాంతంలో ప్రారంభమయ్యే ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు సీజన్‌లో ఇటాలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో విజయం సాధించే సమయానికి మూడవ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఇటాలియన్ ఓపెన్‌లో ఛాంపియన్‌గా నిలవడంతో ఈ స్పానియార్డ్ సీజన్‌లో సిన్నర్ తన నాలుగో ఫైనల్‌లో విజయాన్ని సాధించాడు. కాగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సిన్నర్ అగ్రస్థానంలో ఉన్నాడు, కానీ అతని 26 మ్యాచ్‌ల విజయ పరంపరను అల్కరాజ్ ముగించాడు, గత సంవత్సరం చైనా ఓపెన్ ఫైనల్‌లో అతనిని ఓడించిన చివరి వ్యక్తి కూడా అల్కరాజ్ కావడం విశేషం. అలాగే 2024 ప్రారంభం నుండి తన ఇటాలియన్ ప్రత్యర్థి పురుషుల టెన్నిస్ మరియు మూడు గ్రాండ్ స్లామ్ టైటిళ్లలో అగ్రస్థానానికి ఎదగడం ప్రారంభించినప్పటి నుండి టూర్ ఫైనల్‌లో సిన్నర్‌ను ఓడించిన ఏకైక వ్యక్తి అల్కరాజ్‌గా నిలిచాడు.

## ఎటిపి ఛాలెంజర్స్‌లో.. రన్నరప్‌గా

# భాంబ్రి, గాలోవే జోడీ



**న్యూఢిల్లీ:** యుకీ బాంబ్రీ-రాబర్ట్ గాల్లోవే జోడీ తమ బోర్డియక్స్ ఎటిపి ఛాలెంజర్ ప్రచారాన్ని రన్నరప్‌గా ముగించింది. ఫైనల్లో ఈ జంట పోర్చుగల్‌కు చెందిన ఫ్రాన్సిస్కో కాబ్రాల్ మరియు ఆస్ట్రియాకు చెందిన లూకాస్ మిడ్లర్‌లతో గట్టి పోటీని ఇచ్చింది. రెండో సీడ్ ఇండో అమెరికన్ జంట 6-7, 6-7 తేడాతో పోర్చుగల్‌కు చెందిన నాల్గవ సీడ్ ఫ్రాన్సిస్కో కాబ్రాల్ మరియు ఆస్ట్రియాకు చెందిన లూకాస్ మిడ్లర్ జంట చేతిలో ఓడిపోయింది.

బోర్డియక్స్‌లో జరిగిన ఎటిపి ఛాలెంజర్ ఈవెంట్ టైటిల్ పోరులో భారతదేశానికి చెందిన యుకీ భాంబ్రీ మరియు అతని అమెరికన్ భాగస్వామి రాబర్ట్ గాల్లోవే హోరాహోరీగా పోరాడి, రన్నరప్‌గా నిలిచారు. అంతకు ముందు ఈ నెల 17న జరిగిన గంటా ఎనిమిద నిముషాల్లో బాంబ్రీ-రాబర్ట్ జంట ఫ్రాన్స్‌కు చెందిన క్వెంటిన్ హాలిస్-అల్బానో ఒలివెట్టి జంటను 7-5, 6-3 తేడాతో ఓడించింది. ఫ్రెంచ్ ద్వయాన్ని ఓడించిన తర్వాత డబుల్స్ సెమీఫైనల్‌లో బ్రెజిల్‌కు చెందిన రాఫెల్ మాటోస్-మార్సెలో మెలోలను ఓడించారు. ఇక భారతదేశానికి చెందిన ఎన్ శ్రీరామ్ బాలాజీ మరియు సుమిత్ నాగల్ కూడా ఎటిపి 175 క్లే కోర్ట్ టోర్నమెంట్‌లో భాగమయ్యారు, కానీ ఇద్దరూ తమ తమ ఈవెంట్లలో ముందుగానే నిష్క్రమించారు.

# టర్కిష్ టైటిల్ గలాటసారే కైవసం



**న్యూఢిల్లీ:** నైజీరియా స్ట్రైకర్ విక్టర్ ఒసిమ్హెన్ గలాటసారే రెండు ఆటలు మిగిలి ఉండగానే ప్రతిష్టాత్మక 25వ టర్కిష్ టైటిల్‌ను సాధించాడు. కైసెరిస్పోర్‌లో సోమవారం మోరిన్హోకు చెందిన ఫెనర్‌బాషేతో జరిగిన పోరులో 3-0 తేడాతో గలాటసారే గెలుపొందాడు. ఇంకా రెండు ఆటలు మిగిలి ఉండగానే ఈ 25వ టర్కిష్ టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. ఈ విజయం గలాటసారేకు చిరకాల ప్రత్యర్థి ఫెనర్‌బాషేపై ఎనిమిది పాయింట్ల ఆధిక్యాన్ని అందించింది. ఆ జట్టు దశాబ్ద కాలంగా ఒక్కసారి కూడా లీగ్ గెలవలేదు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే నైజీరియా స్ట్రైకర్ విక్టర్ ఒసిమ్హెన్ 26వ నిమిషంలో మొదటి గోల్ సాధించగా, మూడు నిమిషాల తర్వాత మొదటి అర్ధభాగంలో టర్కిష్ వింగర్ బారిస్ ఆల్పర్ యిల్మాజ్ ఆ గోల్ చేశాడు. రెండవ అర్ధభాగంలో గోల్ కీపర్ ఫెర్నాండో ముస్లెరా పెనాల్టీతో మూడో గోల్ జోడించాడు, ఇస్తాంబుల్‌లో గలాటసారే విజయాన్ని ఖాయం చేశాడు.

ఈ సీజన్‌లో బెసిక్టాస్‌తో జరిగిన ఒకే ఒక లీగ్ గేమ్‌లో గలాటసారే ఓడిపోయింది. వారు 87 గోల్స్ చేసి 31 గోల్స్ ఇచ్చారు. కాగా ఈ సీజన్‌లో రెండు ఇస్తాంబుల్ క్లబ్‌లు ఇతర టర్కిష్ సూపర్ లీగ్ జట్ల కంటే ముందు వరుసలో ఉన్నాయి.

దీంతో గలాటసారే 89 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకోగా, ఆదివారం ఐయుప్‌స్పోర్‌తో జరిగిన మ్యాచ్‌లో 2-1 తేడాతో ఓడించిన ఫెనర్‌బాషే తాజాగా గలాటే చేతిలో ఓటమి చెందడంతో ప్రస్తుతం అతని ఖాతాలో 81 పాయింట్లు ఉన్నాయి. ఇక శామ్‌సన్‌స్పోర్ 60 పాయింట్లతో మూడవ స్థానంలో ఉన్నాడు.

# సుప్రీంకోర్టులో టెల్కోలకు చుక్కెదురు



**ముంబై, మే 19:** టెలికాం సంస్థలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సర్దుబాటు చేసిన స్థూల రాబడి బకాయిల నుంచి ఊరట కల్పించాలంటూ టెలికాం కంపెనీలు దాఖలు తమకు మినహాయింపు కల్పించాలని టెలికాం సంస్థలు వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్ టెల్, టాటా టెలీ సర్వీసెస్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటీషన్‌ను కొట్టివేసింది. ఈ నిర్ణయంతో చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. దీంతో వొడాఫోన్ ఐడియా షేర్లు కుప్పకూలాయి.

సోమవారం ఇంట్రాడేలో వీఐ షేర్లు 10 శాతం క్షీణించాయి. మధ్యాహ్నం 1:50గంటల సమయంలో ఎన్ఎస్ఈలో షేర్లు 8.28 శాతం నష్టంతో కదలాడుతున్నాయి. ఏజీఆర్ బకాయిలపై వడ్డీ, పెనాల్టీలు, పెనాల్టీలపై వడ్డీ నుంచి టెలికాంసంస్థలపై భారం పడనుందన్న భయంతో షేర్లు ఒత్తిడికి గురయ్యాయి.

# టాటా కుటుంబేతరుల్లో అత్యధిక వాటా దత్తాకే..

**ముంబై, మే 19:** దివంగత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా వీలునామాకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. రతన్ టాటాకు అత్యంత సన్నిహితుడు, తాజ్ గ్రూప్ హోటళ్ల మాజీ డైరెక్టర్ అయిన మోహినీ మోహన్ దత్తా, వీలునామాలోని షరతులకు అంగీకరించినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం వెల్లడించింది. టాటా మిగులు ఆస్తిలో మూడో వంతు భాగాన్ని దత్తాకు కేటాయించారు. దీని విలువ సుమారు రూ.588 కోట్లు ఉంటుందని అంచనా. మోహినీ దత్తా తన సమ్మతిని తెలియజేయడంతో, టాటా వీలునామా ఎగ్జిక్యూటర్లు బాంబే హైకోర్టు నుంచి ప్రొబేట్ (వీలునామా ధృవీకరణ) పొందే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికి మార్గం సుగమమైంది. సుమారు ఇరవై మందికిపైగా ఉన్న లబ్ధిదారులలో, 77ఏళ్ల దత్తా మాత్రమే తన వాటా విలువకు సంబంధించి ఆందోళన వ్యక్తంచేశారు. రతన్ టాటా మిగులు ఆస్తిలో (స్థిరాస్తులు, షేర్‌హోల్డింగ్‌లు మినహా) మిగిలిన మూడింట రెండు వంతుల భాగాన్ని ఆయన సోదరీమణులు షిరీన్ జెజీభాయ్ (72), డయానా జెజీభాయ్ (70)లకు కేటాయించారు.



వీరిద్దరూ వీలునామాకు ఎగ్జిక్యూట ర్లుగా కూడా వ్యవహరి స్తున్నారు.తనకు దక్కాల్సిన వారసత్వ ఆస్తి విలువ విషయంలో ఎగ్జిక్యూటర్లతో దత్తా విభేదించినప్పటికీ, ఆయన వీలునామాను అధికారికంగా సవాలు చేయలేకపోయారు. వీలునామాలోని నోకాంటెస్ట్ క్లాజ్ (వివాద రహిత నిబంధన) ఇందుకు కారణం. ఈ నిబంధన ప్రకారం, ఎవరైనా లబ్ధిదారుడు వీలునామా షరతులను వ్యతిరేకిస్తే, వారు తమ వాటాను కోల్పోయే ప్రమాదం ఉంటుందనికథనం పేర్కొంది. ఎగ్జిక్యూటర్లు మార్చి 27న వీలునామా ప్రొబేట్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. అంగీకారం తెలపని చట్టబద్ధమైన వారసుల నుంచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరుతూ పబ్లిక్ నోటీసు జారీచేయాలని బాంబే హైకోర్టు వారిని ఆదేశించింది. ఏప్రిల్ 9న, వీలునామా మరియు దాని లబ్ధిదారులకు సంబంధించిన విషయాలను పరిష్కరించడానికి ఉపయోగించే చట్టపరమైన యంత్రాంగమైన ఆరిజినేటింగ్ సమన్లను కూడా వారు దాఖలుచేశారు. టాటా కుటుంబం వెలుపల ఇంత పెద్ద మొత్తంలో వాటా పొందిన ఏకైక లబ్ధిదారుడు దత్తానే కావడం గమనార్హం. తనకు కేటాయించిన గణేష్ విగ్రహంతో సహా పలు విలువైన వస్తు వులను పరిశీలించాలని దత్తా కోరినప్పటికీ, కొలాబాలోని టాటా హాలేకై నివాసంలోకి ఆయనకు ప్రవేశం నిరాకరించారు. ప్రస్తుతం టాటా వ్యక్తిగత వస్తువులన్నీ ఎగ్జిక్యూటర్ల ఆధీనంలో ఉన్నాయని నివేదిక తెలిపింది.



# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, మే 19:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణతో సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా ఐటీ షేర్లు ప్రధానంగా నష్టాలు మూటగట్టుకున్నాయి.ఐటీ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఐటీ కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుండడమే ఇందుక్కారణం. ఈ క్రమంలో నిఫ్టీ 25 వేల దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,354.92 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా ఓ మోస్తరు శ్రేణిలో కదలాడింది. ఇంట్రాడేలో 81,964.57 82,424.10 పాయింట్ల మధ్య కదలాడిన సూచీ, చివరికి 271.17 పాయింట్ల నష్టంతో 82,059 వద్ద ముగిసింది. నిఫ్టీ 74.35 పాయింట్ల నష్టంతో 24,945.45 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.40గా ఉంది. ఎటర్నల్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, రిలయన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సూచీలు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.72 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3239 డాలర్ల వద్ద ట్రేడయింది.

# యూకో బ్యాంకు మాజీ సిఎండి అరెస్ట్



**ముంబై, మే 19:** యూకో బ్యాంక్ మాజీ సీఎండీ సుబోధ్ కుమార్ గోయల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. కాన్‌కాస్ట్ స్టీల్‌అండ్ పవర్ లిమిటెడ్‌కు రుణాల మంజూరులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆయన్ని అదుపులోకి తీసుకుంది. సుబోధ్ కుమార్ గోయల్ యూకో బ్యాంక్ సీఎండీగా ఉన్న సమయంలో సీఎస్‌పీఎల్‌కు పెద్దఎత్తున నిధుల్ని మంజూరుచేశారు. ఇలా మంజూరైన రూ.6,210.72కోట్లను ఆ సంస్థ దుర్వినియోగం చేసిందని సీబీఐ దర్యాప్తులో తేలింది. అయితే, రుణ మంజూరు విషయంలో గోయల్‌కు ముడుపు లు అందినట్లు సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఆ నిధులు గోయల్, ఆయన కుటుంబానికి చెందిన షెల్ కంపెనీల్లోకి బదిలీ అయినట్లు సీబీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ రంగంలోకి దిగి అరెస్ట్ చేసింది. మే 17న గోయల్‌ను పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపర్చగా.. మే 21 వరకు ఈడీ కస్టడీకి కోర్టు అనుమతిచ్చింది.

# యుకె కుబేరుల జాబితాలో హిందుజా గ్రూప్

**ముంబై, మే 19:** 110 ఏళ్ల క్రితం ప్రారంభమైన హిందుజా గ్రూప్ ప్రస్తుతం 38దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా రవాణా, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, డిజిటల్ టెక్నాలజీ, మీడియా, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్, లూబ్రికెంట్స్, స్పెషాలిటీ కెమికల్స్, ఎనర్జీ, రియల్ ఎస్టేట్, ట్రేడింగ్ వైద్య రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టింది. ఈ ప్రతిష్ఠాత్మక జాబితా బ్రిటన్‌లో నివసిస్తున్న 350 అత్యంత ధనవంతులు వారి కుటుంబాల ఆస్తులను లెక్కిస్తుంది. భూమి, ఆస్తులు, ప్రభుత్వ రంగ కంపెనీల షేర్లు, ఇతరత్రా లెక్కించదగిన సంపద ఆధారంగా ఈ ర్యాంకింగ్‌ను నిర్ణయిస్తారు. హిందుజా కుటుంబం బ్రిటన్ కుబేరుల జాబితాలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. వారి వ్యాపార సామ్రాజ్యం పరిమాణంలోనే కాకుండా, పరిధిలోనూ విస్తరిస్తోంది అని పేర్కొంది.గత ఏడాది కాలంలో హిందుజా గ్రూప్ భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల రంగంపై మరింత దృష్టి సారించింది. దేశంలో స్థిరమైన రవాణాకు ప్రోత్సాహం లభిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వాహనాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి గణనీయమైన నిధులను కేటాయించింది. ఇది ఆటోమొబైల్ రంగంలో వారి సంస్థ తీసుకుంటున్న గ్రీన్ మార్పును సూచిస్తోంది. మా ఆవిష్కరణల ఆధారిత వృద్ధి లక్ష్యానికి అనుగుణంగా, భవిష్యత్తు రవాణా స్థిరమైన సాంకేతికతల్లో పెట్టుబడులు పెడుతున్నాం అని లండన్‌లో జరిగిన ఒక పరిశ్రమ సదస్సులో గ్రూప్ ప్రతినిధి తెలిపారు. అంతేకాకుండా, అశోక్ లేలాండ్ ఛైర్మన్ ధీరజ్ హిందుజా మాట్లాడుతూ, 2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో హిందుజా లేలాండ్ ఫైనాన్స్‌ను స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇది వారి దీర్ఘకాలిక ఆర్థిక వ్యూహాన్ని తెలియజేస్తోంది.



హిందుజా ఫౌండేషన్ విద్య, వైద్యం, నీటి సంరక్షణ స్థిరమైన గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ, వారి దాతృత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సంస్థ యూకే భారతదేశంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతోంది. అందరినీ కలుపుకొని అభివృద్ధి సాధించాలనే వారి సిద్ధాంతాన్ని ఈ దాతృత్వ కార్యక్రమాలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ సూత్రాన్ని గ్రూప్ వ్యవస్థాపకులు పరమానంద్ దీప్‌చంద్ హిందుజా నెలకొల్పారని చెబుతారు.

# వాణిజ్యం

## భూమార్గాల దిగుమతులపై భారత్ నిషేధం

**ఢాకా, మే 19:** బంగ్లాదేశ్ నుంచి భూమార్గాల ద్వారా రేడీమేడ్ వస్త్రాల దిగుమతిపై భారత్ ఇటీవల నిషేధం విధించింది. నవా షెవా, కోల్‌కతా సీపోర్ట్స్ ద్వారా మాత్రమే దిగుమతులను అనుమతిస్తున్నట్లు తెలిపింది. ఈ చర్య భారతదేశ టెక్స్‌టైల్ తయారీ రంగానికి ఊతమిస్తుందని, దేశీయ ఉత్పత్తిదారులకు రూ.1,000 కోట్లకు పైగా వ్యాపారాన్ని సృష్టించగలదని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. స్థానిక తయారీని బలోపేతం చేయడం, విదేశీ కంపెనీ




లు అనుసరిస్తున్న వాణిజ్య లొసుగులను తగ్గించడం ఈ పాలసీ లక్ష్యంగా పెట్టుకున్నారు. స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం స్వల్పకాలిక సరఫరా గొలుసు అంతరాయాలకు దారితీయవచ్చని కొందరు అంచనా వేస్తున్నారు. లాజిస్టిక్స్‌లో సర్దుబాట్ల కారణంగా కొన్ని బ్రాండెడ్ వస్త్రాల ధరలు స్వల్పంగా పెరగవచ్చని పరిశ్రమ విశ్లేషకులు భావిస్తున్నారు. చైనాలోనికొన్ని కంపెనీలు తమ వస్త్రాలను బంగ్లాదేశ్‌లోకి ఎగుమతి చేసి, అక్కడి నుంచి సుంకం లేకుండా భారతదేశానికి ఎగుమతులు చేస్తున్నాయి. ఈ చర్యలను కట్టడి చేసేందుకు కూడా భారత్ తాజా నిర్ణయం తోడ్పడుతుందని భావిస్తున్నారు. భారత్ నుంచి పతినత, నూలు దిగుమతులపై బంగ్లాదేశ్ ఇటీవల ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఈ నిషేధ నిర్ణయం తీసుకున్నారు. రెండు దేశాల్లో మారుతున్న వాణిజ్యసంబంధాలను ఈపరిణామాలు హైలైట్ చేస్తున్నాయి. తాజా విధానం భారతీయ వ్యాపారాలను బలోపేతం చేయడానికి తోడ్పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.